అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

సోమవారం 6-2-2023

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 9 | సంచిక : 36 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | www.navatelangana.com | 10 పేజీలు | వెల: 6.50

పౌర హక్కులను కాలరాయటమే

- బీబీసీ డాక్యుమెంటరీపై నిషేధం దేశ సార్వభౌమత్వానికి, సమగ్రతకు చేటు : 500మందికిపైగా శాస్త్రవేత్తలు, విద్యావేత్తలు



న్యూఢిల్లీ : బీబీసీ డాక్యుమెంటరీపై మోడీ సర్కార్ నిషేధం విధించటాన్ని భారత్‌కు చెందిన 500మందికిపైగా శాస్త్రవేత్తలు, విద్యావేత్తలు తీవ్రంగా ఖండించారు. మోడీ సర్కార్ తీరు పౌర హక్కులను కాలరాస్తోందని, భారత సార్వభౌమత్వాన్ని, సమగ్రతను దెబ్బతీస్తోందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. గుజరాత్ అల్లర్ల ఘటనకు ...5లో

ఆర్టీఐ చట్టం నిర్వీర్యం

డిజిటల్ డాటా ప్రొటక్షన్ బిల్లులో వివాదాస్పద సెక్షన్లు

- ఈ బిల్లు చట్టంగా మారితే ఆర్టీఐ ఉన్నా లేనట్టే : సమాచార హక్కు కార్యకర్తలు



న్యూఢిల్లీ : మోడీ సర్కార్ తీసుకొచ్చిన 'డిజిటల్ డాటా ప్రొటక్షన్ బిల్లు'పై సామాజిక కార్యకర్తలు, సమాచార హక్కు కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డాటా ప్రొటక్షన్ బిల్లు ద్వారా ఆర్టీఐ చట్టాన్ని నిర్వీర్యం చేయాలన్నదే మోడీ సర్కార్ వ్యూహమని, అందుకోసం ముసాయిదా బిల్లులో వివాదాస్పద సెక్షన్లు పెట్టారని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. డిజిటల్ డాటా ప్రొటక్షన్ ముసాయిదా బిల్లును చట్టంగా మార్చేందుకు కేంద్రం రంగం సిద్ధం చేసింది. దీంతో ఈ అంశం అటు రాజకీయంగానూ చర్చనీయాంశమైంది. ముసాయిదా బిల్లులో పేర్కొన్న పలు సెక్షన్లు ఆర్టీఐ చట్టాన్ని నిర్వీర్యం చేసే విధంగా ఉన్నాయని అభ్యంతరాలు వెలువడుతున్నాయి. ముసాయిదా బిల్లు ఒకవేళ చట్టరూపం దాల్చితే ఇక ఆర్టీఐ హక్కు ఉన్నా లేనట్టేనని హక్కుల కార్యకర్తలు చెబుతున్నారు. ఆర్టీఐ చట్టం, ఇతర చట్టంలోని అంశాల్ని అతిక్రమిస్తూ డిజిటల్ డాటా ప్రొటక్షన్ బిల్లులోని సెక్షన్ 29(2)ను కేంద్రం రూపొందించింది.

అలాగే ఆర్టీఐలోని పలు నిబంధనల్ని, అంశాల్ని సవరించాలని సెక్షన్ 30(2) ప్రతిపాదిస్తోంది. సమాచార వెల్లడిలో అనేక మినహాయింపులు కల్పిస్తోంది. పౌరుల వ్యక్తిగత, గోప్యతకు ముడిపడిన సమాచారం కోరరాదని ఆర్టీఐ చట్టంలోని సెక్షన్ 8(1)(జే) చెబుతోంది. అయినా ఆర్టీఐ చట్టంలోని అత్యంత కీలకమైన సెక్షన్ 8(1)(జే)ను సవరించాలని డిజిటల్ డాటా ప్రొటక్షన్ బిల్లు ప్రతిపాదించింది. దీనివల్ల ప్రజలెవరైనా ప్రభుత్వం నుంచి సమాచారం కోరితే, అది 'వ్యక్తిగత' సమాచారం అంటూ ప్రభుత్వ అధికారులు సమాచార విడుదల నిరాకరించవచ్చు. పౌరుల గోప్యత, వ్యక్తిగత సమాచారానికి ఆర్టీఐ చట్టం ఎన్నడూ భంగం కలిగించలేదని హక్కుల కార్యకర్తలు చెబుతున్నారు. 'వ్యక్తిగత సమాచారం, గోప్యత' పేరుతో ఆర్టీఐ చట్టానికి తూట్లు పొడుస్తున్నారని, డిజిటల్ డాటా ప్రొటక్షన్ బిల్లులోని పలు సెక్షన్లే ఇందుకు ఉదాహరణ అని కార్యకర్తలు వివరించారు.



మాట్లాడుతున్న కేసీఆర్

రైతు రాజ్యం రావాలే..!

నాగళ్లే కాదు పెన్నులు పట్టి చట్టాలు చేయండి

రైతు ఆత్మహత్యలకు బీజేపీ-కాంగ్రెస్‌లే ముద్దాయిలు

- 'మేక్ ఇన్ ఇండియా'.. 'జోక్ ఇన్ ఇండియా'గా మిగిలింది..
- రైతులు చస్తుంటే 'మన్ కీ బాత్' ఇంకెన్నాళ్లు?
- మహారాష్ట్ర-తెలంగాణది 'రోటీ-బేటీ' సంబంధం
- మహారాష్ట్రలో గులాబీ జెండా ఎత్తండి : మహారాష్ట్రలోని నాందేడ్ సభలో సీఎం కేసీఆర్

నవతెలంగాణ-నిజామాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

'ప్రతిసారి ఎన్నికల్లో నాయకులు గెలుస్తున్నారు. ప్రజలు ఓడుతున్నారు. ఇకపై ఎన్నికల్లో ప్రజలు, రైతులు గెలవాలి. నాగళ్లు పట్టిన రైతులు పెన్నులు పట్టి చట్టాలు చేయాలి. రైతు రాజ్యం వస్తేనే మన సమస్యలు పరిష్కారం అవుతాయి' అని సీఎం కేసీఆర్ పిలుపునిచ్చారు. దేశంలో రైతాంగ ఆత్మహత్యలకు, సంక్షోభానికి బీజేపీ, కాంగ్రెస్ ప్రభుత్వాలే కారణమని ఆరోపించారు. 75 ఏండ్ల స్వాతంత్ర భారతదేశంలో ఈ రెండు పార్టీలే 70ఏండ్లు దేశాన్ని పరిపాలించాయన్నారు. ఈ రెండు పార్టీలు 'నువ్వింత తిన్నావ్ అంటే నువ్వింత తిన్నావ్ అని, మీది ఈ కుంభకోణం అంటే మీది ఆ కుంభకోణం అని, ఒకరు అంబానీ, ఒకరు అదానీ పేర దేశాన్ని దివాళా తీయించారని వాపోయారు. దేశంలో స్థితిగతులను పరిశీలించిన తరువాత విధానాలు మార్చాల్సిన ఆవశ్యకతను గుర్తించి జాతీయస్థాయిలో పని చేయాలని



బీఆర్ఎస్(భారత రాష్ట్ర సమితి)ని ఏర్పాటు చేసినట్టు చెప్పుకొచ్చారు. రైతాంగ సంక్షేమం కోసం తెలంగాణలో అమలవుతున్న అన్ని పథకాలను దేశ స్థాయిలో అమలు చేస్తామని వివరించారు. రైతులు మతం పేర, కులం పేర, జెండా పేర విభజన కాకుండా ఐక్యం కావాలని పిలుపునిచ్చారు.

'అబ్ కీ బార్.. కిసాన్ సర్కార్' పేరిట మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లాలో ...5లో

నేడే రాష్ట్ర పద్దు

- రూ.2.80 లక్షల కోట్ల నుంచి రూ.3 లక్షల కోట్ల వరకు...?
- ముహూర్తం నేటి ఉదయం 10.30 గంటలకు 10లో..

బాల్య వివాహాల కేసుల్లో

అసోం సర్కార్ దూకుడు

2,200 మందికి పైగా అరెస్టు...మహిళలపై లాఠీ చార్జీలు

- 'కుటుంబాలు విడిపోతున్నాయి' బంధువుల ఆవేదన



న్యూఢిల్లీ : బాల్య వివాహాల కేసుల్లో అసోంలోని బీజేపీ ప్రభుత్వం అత్యంత దూకుడుగా ముందుకు దూసుకుని వెళుతోంది. బాల్య వివాహాలను నిరోధించడం పేరుతో ఈ కేసుల్లో అమానవీయంగానూ వ్యవహరిస్తోంది. ఈ కేసుల్లో గత రెండు రోజుల్లో 2,200 మందికిపైగా వ్యక్తులను అరెస్టు ...5లో

వ్యాపారంగా విద్య

ఉన్నత విద్యకు ఎన్ఈపీ ఆటంకం

సమస్యల పరిష్కారానికి పోరాటమే శరణ్యం : మాజీ ఎంపీ, టీఏజీఎస్ రాష్ట్ర అధ్యక్షులు మిడియం బాబురావు

- ఘనంగా ప్రారంభమైన టీఏవీఎస్ రాష్ట్ర రెండో మహాసభలు



మాట్లాడుతున్న మిడియం బాబురావు

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి, ఆదిలాబాద్‌టౌన్

కేంద్ర ప్రభుత్వం నూతన విద్యా విధానాన్ని తీసుకురావడంతో విద్య వ్యాపారంగా మారిందని భద్రాచలం మాజీ ఎంపీ, తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు మిడియం బాబురావు అన్నారు. మార్కెట్ శక్తులు విద్యారంగాన్ని శాసిస్తున్నాయని తెలిపారు. పాతకాలం నాటి చెత్తను తీసుకొచ్చి చొప్పించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఆర్అండ్‌బీ విశ్రాంతి భవనం ఎదుట ఆదివారం తెలంగాణ ఆదివాసీ విద్యార్థి సంఘం(టీఏవీఎస్) రెండో మహాసభలు ప్రారంభమయ్యాయి. ఉమ్మడి ఆదిలాబాద్, వరంగల్, ఖమ్మం జిల్లాల నుంచి ఆదివాసీ విద్యార్థులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఆయా జిల్లాల నుంచి విద్యార్థుల రాకతో స్థానిక ఆర్అండ్‌బీ విశ్రాంతి భవన పరిసర ప్రాంతం సందడిగా మారింది. ఈ సందర్భంగా జరిగిన సభలో మిడియం బాబురావు మాట్లాడుతూ.. దేశమంతా కోవిడ్‌తో ఇబ్బందులు పడుతుంటే.. కేంద్ర ప్రభుత్వం మాత్రం ఇదే సమయంలో నూతన విద్యా విధానం(ఎన్ఈపీ-2020)ని తీసుకొచ్చిందని తెలిపారు. ఈ విధానంలో మూడు రకాల భావనలు చొప్పించిందని చెప్పారు. ఏ స్థాయిలో చదువుకుంటే అదే స్థాయిలో నైపుణ్య సర్టిఫికేట్ ఇచ్చేలా ఈ విధానాన్ని రూపొందించారని పలు ఉదాహరణలిచ్చారు. ప్రాథమిక విద్యలో స్థానిక తెగల భాషలు లేకుండా పోతున్నాయని, హిందీని బలవంతంగా రుద్దే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. విజ్ఞానవంతమైన చదువు లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయుధాలు అమ్మితే వచ్చేలాభాలు ప్రస్తుతం విద్యారంగంలో వస్తున్నాయన్నారు. మత భావనలతో విద్యా విధానాన్ని నింపే పరిస్థితి వచ్చిందని వివరించారు. ఆదివాసీ బిడ్డలు ఉన్నత విద్యను అభ్యసించేందుకు ఈ నూతన విధానం ఆటంకంగా మారుతుందని స్పష్టం చేశారు. హస్టల్‌లో కోడిగుడ్డును కూడా పెట్టకుండా మెనూను సైతం లాగేసే ప్రయత్నం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. యూనివర్సిటీ విద్యను నిర్వీర్యం చేస్తోందని, ఫెలోషిప్‌లో కోత విధించడంతో విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడే పరిస్థితి వచ్చిందని తెలిపారు. ఏదైనా చట్టం ఆదివాసీలకు వ్యతిరేకంగా ఉంటే దాన్ని రద్దు చేసే అధికారం గవర్నర్‌కు ఉంటుందని చెప్పారు. ఆదివాసీ విద్యార్థులకు టీఏవీఎస్ అన్ని విధాలా అండగా ఉంటుందని, పోరాటంతోనే సమస్యలు పరిష్కారమవుతాయని వ్యాఖ్యానించారు. ఈ సమావేశంలో డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి, టీఏవీఎస్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మెస్రం రాజు, పూసం సచిన్, టీఏజీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తొడసం భీంరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు బండారు రవికుమార్, సరియం కోటేశ్వర్‌రావు, లంక రాఘవులు, టీఏవీఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తుర్రం ఈశ్వర్, బైరి సోమేష్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు దర్శనాల మల్లేష్, నాయకులు ఆత్రం తానూష్, మెస్రం నర్మద, కోట్నాక్ పుష్పలత, మాలశ్రీ, జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి నూతుల రవీందర్‌రెడ్డి ఆదివాసీ విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.




ఉత్తరాఖండ్ రిక్రూట్‌మెంట్ కేసు

బీజేపీ నేత అరెస్టు

- ప్రభుత్వ ఉద్యోగాల నియామక పరీక్ష పత్రాల లీక్‌లో నిందితుడిగా..

న్యూఢిల్లీ : ఉత్తరాఖండ్‌లో అవినీతి, కుంభకోణాలకు అడ్డుకట్ట పడటం లేదు. ప్రభుత్వ ఉద్యోగ నియామక పరీక్షల్లో అక్రమాలు, పేపర్ లీకేజ్‌లు అక్కడ సర్వసాధారణంగా మారాయి. సీఎం పుష్కర్‌సింగ్ ధామి నేతృత్వంలోని బీజేపీ ...5లో



పాక్ మాజీ అధ్యక్షుడి కన్నుమూత

- కమాండో నుంచి అధ్యక్షుడి వరకూ..
- ముషారఫ్ వివాదాస్పద ప్రస్థానం

2లో..

వర్గ పోరాటాల కేంద్రంగా

సీఐటీయూ కార్యాలయం

నూతన ఆఫీసుకు శంఖుస్థాపన

- హాజరైన నేతలు, కార్యకర్తలు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్


కష్టజీవుల పోరాట కేంద్రంగా సీఐటీయూ రాష్ట్ర కార్యాలయం ఉండాలని పలువురు వక్తలు అభిలషించారు. హైదరాబాద్‌లోని రీసాల గడ్డలో ఇప్పటికే ఉన్న ఎన్వీ భాస్కర్‌రావు స్మారక భవనం స్థానంలో కొత్త భవనానికి ఆదివారం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు చుక్కారాములు శంఖుస్థాపన చేశారు. ఇతర నేతలతో కలిసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ఉద్యోగులు, కార్మికులతో పాటు శ్రమజీవులకు కేంద్రంగా తమ కార్యాలయం పనిచేస్తుందని చెప్పారు. భారీ వ్యయంతో కూడుకున్న భవన నిర్మాణానికి కార్మికులు, ఉద్యోగులు, శ్రేయోభిలాషులు, ప్రజాతంత్రవాదులు, వాణిజ్య-వ్యాపార వేత్తలు ఉదారంగా విరాళాలివ్వాలని విజ్ఞప్తి చేశారు. సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ నూతన భవన నిర్మాణానికి సీఐటీయూ అనుబంధ సంఘాలు,కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ సంఘాలు సహకరించాలని కోరారు. ఏఐకేఎస్ జాతీయ నాయకులు సారంపల్లి మల్లారెడ్డి మాట్లాడుతూ కార్మికులు, కర్షకులతో పాటు సమస్త ప్రజల సమస్యలను పట్టించుకునే కార్యాలయంగా సీఐటీయూ ఆఫీసు వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఐద్వా జాతీయ నాయకులు టి జ్యోతి మాట్లాడుతూ ప్రజా,కార్మిక ఉద్యమాల రూపకల్పనకు వేదిక కావాలన్నారు. సీఐటీయు ...5లో



దేశాభివృద్ధికి ప్రజారవాణా జీవనాడి

విద్యుత్ బస్సులను ఆర్టీసీలకే అప్పగించాలి

- ఎస్టీయూలను ప్రయివేటీకరించొద్దు
- ఆర్టీసీపై పన్నులను, టోల్ చార్జీలను మోపొద్దు
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలిచ్చే మూలధన పెట్టుబడిని పునరుద్ధరించాలి : ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మయ్య



మాట్లాడుతున్న ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మయ్య

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

దేశాభివృద్ధికి ప్రజారవాణా వ్యవస్థ జీవనాడి లాంటిదనీ, అలాంటి వ్యవస్థను నిర్వీర్యం చేసే ఆలోచనలను కేంద్రం వెనక్కి తీసుకోవాలని ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్(ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్) అఖిల భారత ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మయ్య డిమాండ్ చేశారు. ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ ఆధ్వర్యంలో స్టేట్ ట్రాన్స్‌పోర్టు అండర్ టేకింగ్ సెక్టార్(ఎస్టీయూ) ప్రతినిధుల సభను నిర్వహించారు. ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ జాతీయ నేత జీవన్‌సాహా అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్టీయూల కన్వీనర్ అర్ముదనయనార్ ...5లో

ఓటర్ల సంఖ్య

94.50 కోట్లు

2019 లోక్‌సభ ఎన్నికల పోలింగ్‌కు 30కోట్లమంది దూరం

న్యూఢిల్లీ : కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసిన తాజా సమాచారం ప్రకారం, జనవరి 1నాటికి దేశంలో మొత్తం ఓటర్ల సంఖ్య 94 కోట్లా 50 లక్షలా, 25 వేలా 694కు చేరుకుంది. దేశ స్వాతంత్ర్యం తర్వాత 1951 నాటి ఓటర్లతో పోల్చితే ఓటర్ల సంఖ్య ఆరు రెట్లు పెరిగింది. మొదటి సార్వత్రిక ఎన్నికలనాటికి దేశంలో 17.32 కోట్ల మంది ఓటర్లున్నారు.



ఇందులో ఆనాడు 45.67శాతం మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అలాగే 2019 సార్వత్రిక ఎన్నికలనాటికి ఓటర్ల సంఖ్య 91.20 కోట్లకు చేరుకుంది. కాగా ఓటింగ్ ...5లో

బీజేపీని ఓడించండి.. త్రిపురను కాపాడండి

అగర్తలా : 'బీజేపీ హఠావో.. త్రిపుర బచావో..' అంటూ నినాదాలతో త్రిపుర రాజధాని అగర్తలా హెూరెత్తింది. త్వరలో ఎన్నికలు జరగనున్న త్రిపురలో రాష్ట్రవ్యాప్తంగా వామపక్షాలు విస్తృతంగా ర్యాలీలు, భారీ బహిరంగ సభలు నిర్వహిస్తున్నాయి. బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి త్రిపురలో ప్రజాస్వామ్యాన్ని మంటగలిపి దాడులు నిర్వహిస్తున్న తీరును నిరసిస్తూ వామపక్షాలు, కాంగ్రెస్ అగర్తలాలో శనివారం భారీ ర్యాలీ నిర్వహించాయి.

త్రిపురలో సీపీఐ(ఎం) విస్తృత ప్రచారం

ఈ నెల 16న ఎన్నికలు జరిగే త్రిపురలో సీపీఐ(ఎం) విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తోంది. సీపీఐ(ఎం) అభ్యర్థులకు ప్రజల నుంచి విశేష మద్దతు లభిస్తుంది. బోర్జల అసెంబ్లీ నియోజకవర్గంలో వామపక్ష అభ్యర్థి సుదీప్ సర్కార్‌కు మద్దతుగా మాజీ ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్ ప్రచారం నిర్వహించారు. ఇక్కడ ఆదివారం జరిగిన ఎన్నికల ర్యాలీలో ప్రసంగించారు. సీపీఐ(ఎం)కి ఓటు వేసి బీజేపీ గూండాయిజం నుంచి త్రిపురను రక్షించాలని పిలుపునిచ్చారు. ప్రతాప్‌గఢ్ నియోజకవర్గంలోనూ మాణిక్ సర్కార్ ప్రచారం నిర్వహించారు. ఇక్కడ లెఫ్ట్‌ఫ్రంట్ అభ్యర్థి రాము దాస్‌కు అనుకూలంగా భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. వందలాది మంది యువకులు, ప్రజలు ఎర్ర జెండాలతో ఈ ర్యాలీలో ఉత్సాహంగా పాల్గొన్నారు. అమర్‌పురా నియోజకవర్గంలోనూ లెఫ్ట్‌ఫ్రంట్ అభ్యర్థి పరిమళ్ దేవనాథ్‌కు మద్దతుగా భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. రైమావలి అసెంబ్లీ నియోజకవర్గంలో వామపక్ష అభ్యర్థికి ప్రజల నుంచి మద్దతు లభిస్తుంది.



మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో.. శనగలు కొనుగోలు చేస్తాం

- మార్క్‌ఫెడ్ చైర్మెన్ మార గంగారెడ్డి



నవతెలంగాణ-బోధన్

యాసంగి సీజన్లో భాగంగా రైతులు పండించిన శనగ పంటను మార్క్ ఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోలు చేస్తామని మార్క్ ఫెడ్ రాష్ట్ర చైర్మెన్ మార గంగారెడ్డి తెలిపారు. ఆదివారం మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లాలో నిర్వహిస్తున్న బీఆర్ఎస్ మహాసభకు వెళుతూ నిజామాబాద్ జిల్లా సాలూరు మండల కేంద్రంలో ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. రైతులు శనగ పంటలను పూర్తిగా ఎండబెట్టిన తర్వాత మార్క్ ఫెడ్ ద్వారా ఏర్పాటు చేస్తున్న కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి విక్రయించాలని సూచించారు. రైతులు దళారులను ఆశ్రయించి నష్టపోవద్దని కోరారు. ప్రభుత్వం రైతులకు మద్దతు ధర కల్పించి శనగలను కొనుగోలు చేస్తుంది కనుక ఎలాంటి ఇబ్బందులకు గురికావద్దని సూచించారు. సమావేశంలో డీసీసీబీ డైరెక్టర్లు శరత్, గంగారెడ్డి, మాజీ మండల రైతు సమితి అధ్యక్షులు బుద్దె రాజేశ్వర్, ఏఎంసీ వైస్ చైర్మెన్ షకీల్ , వైస్ ఎంపీపీ గంగారెడ్డి, పార్టీ మండల అధ్యక్షులు నరసయ్య, సర్పంచ్ అమీర్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని జిల్లా కేంద్రాల్లో నేడు, రేపు నిరసనలు : పండిత పీఈటీ జేఏసీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అన్ని జిల్లా కేంద్రాల్లో సోమ, మంగళవారాల్లో నిరసనలు చేపట్టనున్నట్టు పండిత పీఈటీ జేఏసీ తెలిపింది. ఆదివారం జూమ్ యాప్ ద్వారా పండిత జేఏసీ నేతలు అబ్దుల్లా, జగదీష్, చక్రవర్తుల శ్రీనివాస్, కాంతి కృష్ణ, నర్సింలు, గౌరీ శంకర్ సమావేశమై చర్చించారు. వారం రోజుల నుంచి తొమ్మిది, పదో తరగతిలో బోధన నిలిపేసి నల్ల బ్యాడ్జీలతో నిరసనలు తెలిపారు. డీఈఓ, కలెక్టర్, మహాత్మాగాంధీ, అంబేద్కర్ విగ్రహాలకు వినతిపత్రాలు సమర్పించారు. వీటిని సమీక్షించుకున్న నాయకులు, సోమవారం సాయంత్రం 4.30 గంటల నుంచి 5.30 గంటల వరకు అన్ని జిల్లా కేంద్రాల్లోని డీఈఓ కార్యాలయాల ముందు భాషా పండితులు, పీఈటీలకు ఇదే షెడ్యూల్లో అన్ని క్యాడర్లతో పాటే పదోన్నతులు ఇవ్వాలని నినాదాలతో నిరసనలు తెలపాలని సూచించారు. రేపు అన్ని జిల్లా కేంద్రాల్లోని జిల్లా పరిషత్తు ఆవరణలో సాయంత్రం 4.30 గంటల నుంచి 5:30 గంటల వరకు పండితుల బతుకమ్మతో నిరసన వ్యక్తం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి పీఈటీలు సంపూర్ణ సంఘీభావం ప్రకటించారు.

ఆర్టీసీకి బడ్జెట్‌లో రూ. 6వేల కోట్లు కేటాయించాలి

- ఆర్టీసీ జేఏసీ డిమాండ్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

టీఎస్ఆర్టీసీకి బడ్జెట్‌లో రూ. 6వేల కోట్లు కేటాయించాలని ఆర్టీసీ జేఏసీ డిమాండ్ చేసింది. అదనంగా కొత్త బస్సులను కొనాలనీ, ఉద్యోగ నియామకాలు చేపట్టాలని తద్వారా సంస్థలను బలోపేతం చేయాలని ప్రభుత్వాన్ని కోరింది. ఆదివారం హైదరాబాద్‌లోని టీజేఎంయూ కేంద్ర కార్యాలయంలో ఆర్టీసీ జేఏసీ నేతలు టీజేఎంయూ, ఎస్‌డబ్ల్యూయూ, బీడబ్ల్యూయూ, కేపీ, కేఎస్ యూనియన్ల అధినేతలు కె హనుమంతు ముదిరాజ్, సుద్దాల సురేష్, జి అబ్రహం, బి. యాదగిరి, శివకుమార్, స్వాములయ్య, పీకే మూర్తి, బాలస్వామి, రాములు తదితరులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా హనుమంతు మాట్లాడుతూ 2013 తర్వాత ఆర్టీసీలో వేతనాలు పెంచలేదన్నారు. రెండు వేతన సవరణలు, రెండు డీఏలు ఇవ్వాలని కోరారు. 50శాతం బాండ్ డబ్బుల బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీలో పని భారం పెంచి వివిధ రకాల వేధింపులతో ఆర్టీసీ ఉద్యోగులను తీవ్ర ఇబ్బందులు గురి చేస్తూ... విధుల నుంచి సస్పెండ్ చేస్తున్నారనీ, అటువంటి పద్ధతి వెంటనే మానుకోవాలని ఉద్యోగ భద్రత కల్పించాలని ఆయన కోరారు. ఆర్టీసీ సిబ్బంది స్వయంగా పొదుపు చేసుకున్న సీసీఎస్, పీఎఫ్, ఎస్ఆర్‌బీఎస్, ఎస్‌బీటీ సుమారు రూ 3వేలకోట్లను వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

రైతుల ప్రయివేటు అప్పులు తీర్చేందుకు బ్యాంకులు రుణాలు ఇవ్వాలి :పాకాల

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

హైకోర్టు ఆదేశాలమేరకు రైతుల ప్రయివేటు అప్పులు తీర్చేందుకు బ్యాంకులు రుణాలివ్వాలని తెలంగాణ రైతు రక్షణ సమితి అధ్యక్షులు పాకాల శ్రీహరి రావు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఇప్పటికే బ్యాంకులు ఆదిశగా ఆలోచన చేయడం లేదని పేర్కొన్నారు. రైతులు ప్రయివేటు అప్పులబారిన పడి ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు ఆత్మహత్యలను నివారించాలంటే, బ్యాంకులు రైతులకు రుణాలు ఇవ్వాలని కోరారు.

నాందేడ్‌లో బీఆర్ఎస్ సభతుస్సుమంది : బండి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మహారాష్ట్రలోని నాందేడ్‌లో 30 మంది ఎమ్మెల్యేలు, ఇద్దరు మంత్రులు, ఇద్దరు ఎంపీలు 25 రోజులుగా తిష్టవేసి పనిచేసినా బీఆర్ఎస్ నిర్వహించిన సభ జనం లేక తుస్సుమన్నదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్‌కుమార్ విమర్శించారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రూ.500 చొప్పున ఇచ్చి తెలంగాణలోని సరిహద్దు జిల్లాల నుంచి ప్రజలను తీసుకెళ్లారని ఆరోపించారు. దేశంలో బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే ఏడాదిలోపే మహిళలకు చట్ట సభల్లో 33 శాతం ప్రాతినిధ్యం పెంచుతామని కేసీఆర్ చెప్పటం విడ్డూరంగా ఉందని పేర్కొన్నారు. రైతు ఆత్మహత్యల గురించి ఆయన మాట్లాడటం దయ్యాలు వేదాలను వల్లించినట్టుగా ఉందని విమర్శించారు. రైతు ఆత్మహత్యల్లో తెలంగాణ దేశంలోనే నాలుగో స్థానంలో ఉందని తెలిపారు. అబద్దాలకు ఆస్కార్ అవార్డుంటే అది కేసీఆర్‌కే దక్కేదని ఎద్దేవా చేశారు. తెలంగాణలో తొమ్మిదేండ్లలో ఎన్ని టీఎంసీల నీళ్లు సముద్రం పాలయ్యాయనే విషయాన్ని చెప్పాలని ప్రశ్నించారు. బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే ప్రయివేటు పరమైన సంస్థలన్నింటినీ ప్రభుత్వ పరం చేస్తానని చెప్పటం మరో పెద్ద జోక్ అన్నారు. ఫార్మా పారిశ్రామిక, ఐటీ రంగాల్లో మహారాష్ట్ర తెలంగాణను మించిపోయిందని తెలిపారు. 12 కోట్ల జనాభా ఉన్న మహారాష్ట్రలో లిక్కర్ ద్వారా ఆదాయం రూ.17వేల కోట్లు వస్తుంటే...నాలుగు కోట్ల జనాభా ఉన్న తెలంగాణలో రూ.40 వేల కోట్ల ఆదాయం దాటిందని వివరించారు. దేశంలోనే తెలంగాణలో నిత్యావసర వస్తువుల రేట్లు, పెట్రోల్, డీజిల్ రేట్లు అధికంగా ఉన్నాయని తెలిపారు. తెలంగాణలోనే అత్యధిక ద్రవ్యోల్బణం ఉందని పేర్కొన్నారు.

పత్తికి మద్దతు ధర కల్పించాలి



నవతెలంగాణ-కోటపల్లి

క్వింటాల్ పత్తికి కనీస మద్దతు ధర రూ.12000 కల్పించి రైతులను ఆదుకోవాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో రైతులు రోడ్డుపై నిరసన తెలిపారు. మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలం రొయ్యలపల్లి గ్రామంలో జరిగిన ఈ ధర్నాలో ఆ సంఘం జిల్లా కార్యదర్శి ఏర్మ పున్నం మద్దతు తెలిపి మాట్లాడారు. రైతులు అరుగాలం కష్టపడి పండించిన పత్తికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మద్దతు ధర కల్పించటం లేదని విమర్శించారు. గడిచిన 2 రోజుల్లోనే పత్తి ధర రూ.1000 పడిపోయిందని,పెట్టుబడి కూడా రాలేని పరిస్థితి ఉందని అన్నారు. రైతులకు కనీస మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యపై ఫిబ్రవరి 10వ తేదీన జరిగే కలెక్టర్ ముట్టడిలో రైతులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం నాయకులు గోమాస రాజబాబు, తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు కోర్తే సమ్మయ్య, ఎర్మ బోడ్డయ్య, రైతులు పాల్గొన్నారు.

పాక్ మాజీ అధ్యక్షుడి కన్నుమూత

దుబాయ్: పర్వేజ్ ముషారఫ్ కమాండో నుంచి పాకిస్థాన్ సైనిక పాలకుడి వరకూ వివిధ బాధ్యతలు నిర్వహించారు. ఆదివారం అమిలోయిడోసిస్ అనే అరుదైన వ్యాధితో దుబాయ్‌లో ఆయన మరణించినట్లు పాక్ వర్గాలు పేర్కొన్నాయి. 2018 నుంచి ఆయన ఈ వ్యాధితో బాధపడుతున్నారు. వైద్య చికిత్స నిమిత్తం 2016 మార్చిలో దుబాయ్ వెళ్లిన ఆయన అప్పటి నుంచి అక్కడే ఉన్నారు. 1943 ఆగస్టు 11న ఢిల్లీలో జన్మించారు. ఆయన బాల్యంలో కరాచీలోని సెయింట్ పాట్రిక్స్ హైస్కూలులో చదివారు. ఆ తర్వాత లాహెూర్‌లోని ఫోర్మన్ క్రిస్టియన్ కాలేజీలో ఉన్నత చదువులు చదివారు. ఆ తర్వాత బ్రిటన్‌లోని రాయల్ కాలేజ్ ఆఫ్ డిఫెన్స్ స్టడీస్‌లో చదివారు. 1961లో పాకిస్థాన్ మిలిటరీ అకాడమీలో చేరారు. పాకిస్థాన్ ఆర్మీలో 1964లో చేరారు. 1965లో భారత్-పాకిస్థాన్ యుద్ధం సమయంలో ఆయన సెకండ్ లెఫ్టినెంట్ హోదాలో ఉన్నారు. 1980వ దశకంలో ఆయన ఓ ఆర్టిలరీ బ్రిగేడ్‌కు చీఫ్‌గా ఎదిగారు. ఆఫ్ఘనిస్థాన్ సివిల్ వార్‌లో చురుకైన పాత్ర పోషించారు. తాలిబన్లకు పాకిస్థాన్ మద్దతును ప్రోత్సహించారు. 1998లో అప్పటి పాకిస్థాన్ ప్రధాన మంత్రి నవాజ్ షరీఫ్ ఆయనకు ఫోర్ స్టార్ జనరల్ హోదా ఇచ్చారు. దీంతో ఆయన పాకిస్థాన్ రక్షణ దళాలకు అధిపతి అయ్యారు. 1999లో కార్గిల్ యుద్ధం ఆయన హయాంలోనే జరిగింది. ఈ యుద్ధంలో భారత్ ఘన విజయం సాధించింది.

షరీఫ్, ముషారఫ్ మధ్య సంబంధాలు దెబ్బతినడంతో ముషారఫ్‌ను ఆర్మీ చీఫ్ పదవి నుంచి తొలగించేందుకు షరీఫ్ విఫలయత్నం చేశారు. దీంతో ముషారఫ్ నేతత్వంలో సైన్యం తిరుగుబాటు చేసింది. 1999లో షరీఫ్ ప్రభుత్వాన్ని కూల్చేసింది. 1998 నుంచి 2007 వరకు పాకిస్థాన్ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్‌గా బాధ్యతలు నిర్వహించారు. 1998 నుంచి 2001 వరకు చైర్మన్, జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ కమిటీగా వ్యవహరించారు. 2001లో పాకిస్థాన్ అధ్యక్ష పదవిని ముషారఫ్ చేపట్టారు. షరీఫ్‌ను గృహ నిర్బంధం చేశారు. ఆయన 2001 జూన్ 20 నుంచి 2008 ఆగస్టు 18 వరకు పాకిస్థాన్ దేశాధ్యక్షునిగా పని చేశారు. 2008లో ఎన్నికల అనంతరం అభిశంసనను ఎదుర్కొన్న ముషారఫ్ దేశాధ్యక్ష పదవికి రాజీనామా చేశారు. అప్పటి నుంచి గృహ నిర్బంధంలో ఉన్న ఆయన వైద్య చికిత్స కోసం దుబాయ్ వెళ్లేందుకు 2016లో అనుమతి పొందారు. 2016 మార్చిలో దుబాయ్ వెళ్లిన తర్వాత అక్కడే ఉండిపోయారు. 2007లో రాజ్యాంగాన్ని సస్పెండ్ చేసినందుకు ముషారఫ్‌పై దేశద్రోహం కేసు నమోదైంది. ఈ కేసులో కోర్టు ఆయనకు మరణశిక్ష విధించింది. తర్వాత కోర్టు తీర్పును రద్దు చేసింది. పాక్ మాజీ ప్రధాన మంత్రి బేనజీర్ భుట్టో హత్య, రెడ్ మాస్క్ క్లరిక్ హత్య కేసుల్లో ఆయనపై ఆరోపణలు ఉన్నాయి. ఆయన దేశం నుంచి పరారైనట్లు పాక్ ప్రకటించింది. నవాజ్ షరీఫ్ ప్రభుత్వం ముషారఫ్‌పై తీసుకున్న చర్యలన్నీ రాజ్యాంగ విరుద్ధమని లాహెూర్ హైకోర్టు 2020లో ప్రకటించింది. ఆయన పాలనలో మానవ హక్కులు తీవ్రంగా ఉల్లంఘనకు గురయ్యాయని 2013లో హ్యూమన్ రైట్స్ వాచ్ పేర్కొంది. ముషరఫ్ కుటుంబ సభ్యులకు పాక్ అధ్యక్షుడు ఆరిఫ్ అల్వీ తన సానుభూతి తెలియజేశారు.

భద్రాచలం కాకుండా ములుగే ఎందుకు?

ఉమ్మడి ఖమ్మం జిల్లా

కాంగ్రెస్ నేతలు చేతులెత్తేశారా?

- బీఆర్ఎస్‌లో చేరాలంటూ 'పోడెం'పై ఒత్తిడే కారణమా?
- కీలక దశలో ఆయన కారెక్కితే కాంగ్రెస్‌కు పెద్ద దెబ్బే...
- రేవంత్ ముందే పసిగట్టి యాత్రను ములుగుకు మార్చారా?.. కాంగ్రెస్‌లో చర్చ

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

'హాత్ సే హాత్'యాత్రను భద్రాచలం నుంచి ప్రారంభిస్తామని ప్రకటించిన రేవంత్‌రెడ్డి ఉన్నట్టుండి ములుగు జిల్లా మేడారానికి ఎందుకు మార్చారు? ఉమ్మడి ఖమ్మం జిల్లా నేతలు ఆయనకు సహకరించకుండా చేతులెత్తేశారా? అందుకు తగిన ఏర్పాట్లు చేయబోమంటూ భీష్మించుకు కూర్చున్నారా? ఇప్పుడు కాంగ్రెస్ శ్రేణుల్లో ఇదే చర్చనీయాంశవుతున్నది. భద్రాచలం రామాలయం నుంచి ప్రారంభిస్తామన్న యాత్ర మేడారం సమ్మక్క, సారలమ్మ ఆలయానికి ఎందుకు మారింది అనేది ఆసక్తికరంగా మారింది. భద్రాచలం, ములుగు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలే ఉన్నారు. తగిన ఏర్పాట్లు చేస్తానంటూ ఎమ్మెల్యే పోడెం వీరయ్య హామీ కూడా ఇచ్చారు. ఇంతలోనే ఎందుకు కార్యస్థలం మారింది? పార్టీలో ఏం రాజకీయ పరిణామాలు జరిగాయి అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆ జిల్లాకు చెందిన కీలక నేత, సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క శాసనసభ సమావేశాల్లో బిజీగా ఉండటంతో ఏర్పాట్లు చేసేందుకు సమయంలో లేకపోవడం వల్లే యాత్రను మేడారానికి మార్చారనే వాదన వినిపిస్తున్నది. ఈ విషయాన్ని పార్టీకి నేరుగా చెప్పకుండా ఏర్పాట్లు చేయకపోవడంతోనే రేవంత్ మేడారానికి మార్చుకున్నట్టు తెలిసింది. భద్రాచలం



ఎమ్మెల్యే పోడెం వీరయ్యను పార్టీ మారాలంటూ బీఆర్ఎస్ గత కొంత కాలంగా ఆయనపై తీవ్ర ఒత్తిడి తెస్తున్నట్టు తెలిసింది. తన సొంత నియోజకవర్గం ములుగులో టికెట్ ఇవ్వకుండా సీతక్కకు ఇవ్వడం, భద్రాచలంలో స్థానికేతరడు కావడంతో పార్టీపై ఆయన కొంత అసంతృప్తితో ఉన్నారు. ఇదే అదనుగా భావించిన బీఆర్ఎస్...రానున్న ఎన్నికల్లో ములుగు నియోజకవర్గానికి బీఫామ్ ఇస్తామంటూ పోడెంపై ఒత్తిడి తెస్తున్నట్టు తెలిసింది. అయితే బీఆర్ఎస్ ప్రతిపాదనను పోడెం తీవ్రంగా వ్యతిరేకిస్తూ వస్తున్నట్టు పార్టీ నేతలు చెబుతున్నారు. ఈ క్రమంలో రేవంత్‌రెడ్డి, పార్టీ కీలక నేతలు మాత్రం బీఆర్ఎస్ వ్యూహాన్ని పసిగట్టినట్టు పార్టీ వర్గాలు అంటున్నాయి. రేవంత్ హాత్ సే హాత్ యాత్ర భద్రాచలం నుంచి ప్రారంభమైన తర్వాత పోడెం వీరయ్య అనివార్య పరిస్థితుల్లో బీఆర్ఎస్‌లో చేరితే, పార్టీలో టీపీసీసీ చీఫ్ ప్రతిష్ట మాసకబారుతుందనే ఆలోచనతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్టు పార్టీ సీనియర్ నేత తెలిపారు. రేవంత్ యాత్ర ములుగు నుంచి ప్రారంభించడం ఎలా ఉన్నా...ఈ పరిణామాలతో పార్టీలో అంతర్గత కుమ్ములాటలు సజీవంగా ఉన్నాయనే విషయం మరోసారి తెరపైకి వచ్చింది. మరోవైపు ఇప్పటికే రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్ర స్ఫూర్తితో హాత్ సే హాత్ అభియాన్ యాత్ర అన్ని జిల్లాల్లో కొనసాగించాలనే ఏఐసీసీ నిర్ణయాన్ని అమలు చేయకతప్పని పరిస్థితులు నెలకొన్నాయి. చాలా కాలంగా రేవంత్ పాదయాత్రపై ఏఐసీసీ క్లారిటీ ఇవ్వడం లేదనే ప్రచారం జరుగుతున్నది. రాష్ట్రానికి చెందిన కొంత మంది నేతలు కూడా పాదయాత్రకు అడ్డంకులు సృష్టిస్తున్నట్టు ప్రచారం జరుగుతున్నది. ఒక్కరే యాత్ర చేస్తే ఆయన వ్యక్తిగత ఇమేజ్ పెరుగుతుందనీ, అందరికీ పాదయాత్ర చేసే అవకాశం ఇవ్వాలని సీనియర్లు కోరుతున్నట్టు తెలిసింది.

232 రుణ, బెట్టింగ్ యాప్‌ల నిషేధం



న్యూఢిల్లీ: దేశంలో రుణ యాప్‌ల ఆగడాలు, బెట్టింగ్ యాప్‌ల పర్యవసనాల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలకమైన నిర్ణయం తీసుకున్నది. చైనా మూలాలున్న 138 బెట్టింగ్ యాప్స్, 94 రుణ యాప్‌లలో కొన్నింటిపై నిషేధం, మరికొన్నింటిని బ్లాక్ చేయాలని నిర్ణయించింది. మొత్తం 232 యాప్స్‌పై తక్షణ, అత్యవసర ప్రాతిపదికన ఈ చర్యకు సిద్ధమైనట్టు కేంద్ర ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ వర్గాలు తెలిపాయి. ఈ వారంలోనే ఈ నిర్ణయం జరిగిందని, యాప్‌ల నిషేధానికి సంబంధించిన ప్రక్రియ ఇప్పటికే మొదలైందని పేర్కొన్నాయి. ఐటీ చట్టంలోని సెక్షన్ 69 కింద భారత సార్వభౌమత్వం, సమగ్రత పట్ల పక్షపాతంగా వ్యవహరించే ఉద్దేశాలను ఈ యాప్‌లలో గుర్తించడంతో ఈ చర్య తీసుకుంటున్నట్టు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. కాగా లోన్ యాప్‌లు అమాయకులను రుణాల పేరిట దోపిడీకి గురిచేస్తున్నాయనే ఆరోపణలున్నాయి. భారీ వడ్డీ రేట్లు విధిస్తున్నాయి. ఆ వడ్డీలు చెల్లించలేని రుణగ్రస్థులను యాప్‌ల ప్రతినిధులు వేధింపులకు గురిచేస్తున్నారు. పలువురు బాధితులు ఆత్మహత్యలకు పాల్పడిన ఘటనలు కూడా వెలుగు చూశాయి. మరీ ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఈ తరహా ఘటనలు ఎక్కువగా నమోదవుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఈ దిశగా అడుగులు వేసింది.ఇప్పటికే ఆరు నెలలక్రితం 28 లోన్ యాప్‌లపై కేంద్ర హెూం మంత్రిత్వ శాఖ నిషేధం విధించింది.

చట్టాన్ని దుర్వినియోగం చేయడాన్ని ఆపండి

- సుప్రీంకోర్టుకు చిదంబరం విజ్ఞప్తి

న్యూఢిల్లీ : చట్టాన్ని దుర్వినియోగం చేయడాన్ని ఇక నుంచైనా నిరోధించాలని సుప్రీంకోర్టుకు కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ నాయకులు పి. చిదంబరం ఆదివారం విజ్ఞప్తి చేశారు. 2019 జామియా నగర్ అల్లర్ల కేసులో 11 మందిని నిర్దోషులుగా సుప్రీంకోర్టు శనివారం విడుదల చేసింది. పోలీసులు వీరిని 'బలిపశువులు'గా మార్చారని కూడా సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. దీనికి ఒక రోజు తరువాత చిదంబరం ఈ విజ్ఞప్తి చేశారు. విచారణకు ముందే శిక్షను విధించే నేర న్యాయ వ్యవస్థ రాజ్యాంగానికి అవమానకరమని చిదంబరం ఆదివారం ట్వీట్ చేశారు. 'ఈ కేసుకు కోర్టుకు ముగింపు పలికింది. అయితే ఇందులో కొందరు నిందితులు దాదాపు 3 ఏళ్ళ జైలులో ఉన్నారు. ఇది విచారణకు ముందే శిక్ష వంటింది', 'విచారణకు ముందే ప్రజలకు శిక్ష విధించడానికి పోలీసులు అత్యుత్సాహంతో పనిచేస్తారు. వీరిపై ఎలాంటి చర్యలు తీసుకుంటారు' అని చిదంబరం వరస ట్వీట్లతో ప్రశ్నించారు. 'విచారణకు ముందే శిక్ష విధించడం మన న్యాయ వ్యవస్థ, రాజ్యాంగానికి అవమానకరం. చట్టాన్ని దుర్వినియోగం చేయడాన్ని సుప్రీంకోర్టు ముగింపు పలకాలి. ఇది ఎంత త్వరగా అయితే అంత మంచిది' అని చిదంబరం తెలిపారు.

వాణి జయరాం మృతి సంగీత, సాహిత్య రంగాలకు తీరని లోటు

- బండారు దత్తాత్రేయ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సినీ నేపథ్యగాయకురాలు వాణి జయరాం మతి సంగీత, సాహిత్య రంగాలకు తీరని లోటని హరియాణ గవర్నర్ బండారు దత్తాత్రేయ పేర్కొన్నారు. ఆమె మృతికి సంతాపాన్ని ప్రకటించారు. వివిధ భాషల్లో 20వేల పాటలకు పైగా పాడిన ఆమె మరణం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. మధురమైన కంఠస్వరంతో ఆమె ప్రేక్షకులను మంత్రముగ్ధుల్ని చేశారని పేర్కొన్నారు.

మంత్రుల చేతుల మీదుగా బీసీ సంఘాల ఆత్మగౌరవ భవనాలకు శంకుస్థాపన

ఉప్పల్ భగయాత్‌లో 38 ఎకరాల్లో 22 భవనాలు

నవతెలంగాణ బ్యూరో-హైరాబాద్

వెనుకబడిన వర్గాల చరిత్రలో ఆదివారం గొప్పగా గుర్తుండి పోతుందని రాష్ట్ర మంత్రులు గంగుల కమలాకర్, తలసాని శ్రీనివాస్‌యాదవ్, వి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు.ఆదివారం హైదరాబాద్‌లోని ఉప్పల్ భగాయత్‌లో 13 బీసీ సంఘాల ఆత్మగౌరవ భవనాలకు వారు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి గంగుల మాట్లాడుతూ 75 ఏండ్ల స్వతంత్ర చరిత్రలో ఎవరూ చేయని విధంగా వెనకబడిన వర్గాలకు మేలు చేస్తున్నామని చెప్పారు. రాజధాని నడిబొడ్డున కోకాపేట, ఉప్పల్ బాగాయత్‌లో వేల కోట్ల విలువచేసే 87.3 ఎకరాలను ప్రభుత్వం వారికి కేటాయించిందన్నారు. ఉప్పల్ భగాయత్‌లో 13 కుల సంఘాలకు 18.3 ఎకరాల్లో రూ. 17 కోట్లతో నిర్మించే భవనాలకు భూమి పూజ చేశామని చెప్పారు.. ఇక్కడే మరో 22 కులాలకు 38 ఎకరాలు కేటాయించామని తెలిపారు. దసరా నాటికల్లా వీటిలో కార్యకలాపాలు ప్రారంభించుకోవాలని ఆయా సంఘాలకు సూచించారు. మంత్రి తలసాని మాట్లాడుతూ వెనుకబడిన వర్గాల ఆత్మగౌరవాన్ని పెంచిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతున్నదని అన్నారు. తెలంగాణ రావడంతోనే మన జీవితల్లో పెద్ద మార్పు వచ్చిందని చెప్పారు. శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ కుల వ్యవస్థపై మహనీయులు పూలే అద్భుత పరిశోధన చేశారని తెలిపారు. మనమంతా ఒకటేననీ, కేవలం వృత్తిపరంగా కులాలుగా విభజించబడ్డామని చెప్పారని అన్నారు. అందరినీ కలపడానికి ఆయన పడ్డ ఆవేదన అంతా ఇంతా కాదని వివరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ మధుసుధనాచారి, ఎమ్మెల్యేలు భేతి సుభాష్ రెడ్డి, ముఠాగోపాల్, బీసీ కమిషన్ చైర్మెన్ వకుళాభరణం కష్ణమోహన్‌రావు, సాహిత్య అకాడమీ చైర్మెన్ గౌరీ శంకర్, బీసీ కమిషన్ సభ్యులు ఉపేంద్ర, కిషోర్. బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి బుర్ర వెంకటేశంతో పాటు బీసీ కులాల ప్రతినిధులు పాల్గొన్నారు.

కుల గణన చేపట్టాలి

బీసీ సబ్ ప్లాన్ చట్టం చేయాలి



- బీసీ పొలిటికల్ ఫ్రంట్ సమావేశంలో నాయకులు, మేధావులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కుల గణన చేపట్టాలనీ, బీసీ సబ్ ప్లాన్ చట్టం అమలు చేయాలని పలు రాజకీయ పార్టీల నాయకులు, మేధావులు డిమాండ్ చేశారు. బీసీ పొలిటికల్ ఫ్రంట్ అధ్యక్షులు ప్రొఫెసర్ కె.మురళీ మనోహర్ అధ్యక్షతన కుల గణన - బీసీ సబ్ ప్లాన్ -రాజకీయ పార్టీల వైఖరి అనే అంశంపై ఆదివారం హైదరాబాద్‌లోని సోమాజీగూడ ప్రెస్ క్లబ్‌లో సమావేశం నిర్వహించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుల గణన హామీనిచ్చి అమలు చేయకుండా చోద్యం చూస్తోందని విమర్శించారు. మరో వైపు రాష్ట్ర ప్రభుత్వం బీసీ సబ్ ప్లాన్‌ను అమలు చేయకుండా మోసం చేశాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్రాల బడ్జెట్‌లోనూ బీసీలకు నామమాత్రపు కేటాయింపులే చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కులగణన చేపట్టాలని సమావేశం ఏకగ్రీవంగా తీర్మానం చేసింది.

బీజేపీపై ఒత్తిడి పెంచాలి

అన్ని రాజకీయ పార్టీలు, బీసీ సంఘాలు కుల గణన చేపట్టే విధంగా బీజేపీ పెంచాలనీ, అందుకనుగుణంగా ఒత్తిడి పెంచేలా ఉద్యమాలు చేయాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు మేకపోతుల వెంకట రమణ సూచించారు. కుల గణన చేపట్టడం, బీసీ సబ్ ప్లాన్ చేయాలనే డిమాండ్లను తమ పార్టీ సంపూర్ణంగా బలపరుస్తుందని స్పష్టం చేశారు. అనేక సందర్భాల్లో కులగణన చేపట్టాలంటూ సీపీఐ(ఎం) సభ్యులు పార్లమెంటులో డిమాండ్ చేశారని గుర్తుచేశారు. 2011లో ప్రతిపక్షంలో ఉన్న బీజేపీ కులగణన చేయాలని డిమాండ్ చేసి అధికారంలోకి వచ్చాక విస్మరించిందని విమర్శించారు. సుప్రీంకోర్టుకు ఇచ్చిన అఫిడవిట్లో ఆ ప్రభుత్వం కుంటి సాకులుచెప్పి కుల గణన చేపట్టలేమంటూ తప్పించుకుందని తెలిపారు గణన చేపడితే అసమానతలు బయటపడి కొత్త డిమాడ్లు ముందుకొస్తాయనీ, బీజేపీ అవలంభిస్తున్న మత ఎజెండాకు ఆటంకమవుతాయనే ఉద్దేశంతోనే మోడీ, నాయకులు ఆ పని చేయడం లేదని రమణ విమర్శించారు. రాష్ట్రంలో బీసీ సబ్ ప్లాన్ చట్టం చేయాలని గత అనేక సంవత్సరాలుగా ఉద్యమాలు చేస్తున్నప్పటికీ ప్రభుత్వం పెడచెవిన పెడుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉత్పత్తి , సేవా వృత్తులు, సంచార జాతుల వారికి ఉపాధి కల్పించే విధంగా బడ్జెట్లో తగిన వాటా కల్పించాలని డిమాండ్ చేశారు. ఎంబీసీలకు తగిన ప్రాధాన్యత ఇచ్చి అభివృద్ధి చేయాలని కోరారు.

బ్రిటీష్ గణాంకాలే ఆధారం

బ్రిటీష్ పాలనలో 1931లో చివరి సారి చేసిన గణాంకాలే బీసీలకు మిగిలాయని కె.మురళీ మనోహర్ తెలిపారు. వాటి ఆధారంగానే నేటికీ మాట్లాడే దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలంటే గణాంకాలు అవసరమని తెలిపారు.

అనేక కమిషన్లు సిఫారసు చేసినా....

కుల గణన చేపట్టాలంటూ స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి అనేక కమిషన్లు సిఫారసు చేసినా ప్రభుత్వాలు పట్టించుకోలేదని సమాజ్ వాదీ పార్టీ నేత ప్రొఫెసర్ సింహాద్రి విమర్శించారు.

ఆర్థిక వెనుకబడిన తరగతులకు (ఈడబ్ల్యూఎస్) 10 శాతం రిజర్వేషన్లను అమలు చేయడానికి వ్యతిరేకంగా తమిళనాడు, ఛత్తీస్‌గఢ్ తదితర రాష్ట్రాలు తీర్మానించాయని తెలిపారు.ఈ సమావేశంలో టీజేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ పీ.ఎల్.విశ్వేశ్వర్ రావు, బీఎల్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ దండి వెంకట్, ప్రొఫెసర్ ప్రభంజన్ యాదవ్ ఎంసీపీఐ(యు) రాష్ట్ర కార్యదర్శి గాదెగోని రవి సూచిచారు. బీయస్పీ - బీసీ రిజర్వేషన్ పోరాట స్టీరింగ్ కమిటీ కన్వీనర్ డాక్టర్ సాంబశివగౌడ్ దేశగాని, ఆప్ మాజీ నేత ఇందిరాశోభన్, సోషల్ జస్టిస్ పార్టీ అధ్యక్షులు పిడికిలి రాజు, సీనియర్ పాత్రికేయులు పాశం యాదగిరి, ఆల్ ఇండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు గౌడ్ కిరణ్ కుమార్, బీసీ పొలిటికల్ ఫ్రంట్ ప్రధాన కార్యదర్శి దేవల్ల సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతు బంధు ఒక్కటే సర్వరోగ నివారిణి కాదు

- కౌలు రైతుల పరిస్థితి అధ్వాన్నం : వ్యవసాయరంగంపై కాంగ్రెస్ మూడో ఛార్జిషీట్ విడుదల

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

వ్యవసాయాన్ని పండుగగా చేస్తామన్న బీఆర్ఎస్ ప్రభుత్వం...దాన్ని దండగగా మార్చిందని ఏఐసీసీ కార్యక్రమాల అమలు కమిటీ చైర్మెన్ ఏలేటి మహేశ్వరరెడ్డి తెలిపారు. వ్యవసాయాన్ని అభివృద్ధి చేసేందుకు రైతు బంధు ఒక్కటే సర్వరోగ నివారిణి అన్నట్టుగా సర్కారు ప్రచారం చేస్తున్నదని విమర్శించారు. రాష్ట్రంలో కౌలు రైతుల పరిస్థితులు అధ్వాన్నంగా మారాయని చెప్పారు. సోమవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో వ్యవసాయరంగానికి బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు, వైఫల్యాలపై కాంగ్రెస్ మూడో ఛార్జిషీట్ విడుదల చేశారు. ఈ సందర్భంగా మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ రైతురుణమాఫీని పూర్తిగా చేయకపోవడంతో రైతులు అప్పులపాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్త రుణాలు అందకపోవడం, తగిన పెట్టుబడి రాకపోవడంతో రైతులు ఇబ్బందిపడుతున్నారని విమర్శించారు. గత్యంతరం లేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారని తెలిపారు.

వైద్య పరంగా తీసుకునే నిర్ణయాల్లో.. ఐఎంఏను ప్రభుత్వం భాగస్వామ్యం చేయాలి

- ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ బి.ఎన్ రావు



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

రాష్ట్ర ప్రభుత్వం వైద్య పరంగా తీసుకునే నిర్ణయాల్లో ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ)ను భాగస్వామ్యం చేయాలని ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ బీఎన్ రావు తెలిపారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ తెలంగాణ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ఐఎంఏలో దేశవ్యాప్తంగా నాలుగు లక్షల మంది వైద్యులు సభ్యులుగా ఉన్నారని, రాష్ట్రంలో 20వేల మంది వైద్యులు సభ్యులుగా ఉన్నారని తెలిపారు. రాష్ట్ర ఐఎంఏ సామాజిక బాధ్యతతో ముందుంటుందన్నారు. పబ్లిక్ హెల్త్ సర్వీస్ సేవలను ప్రజలకు అందించేందుకు గ్రామాలను వైద్యులు దత్తత తీసుకొని వైద్యం అందించేందుకు ముందుకు వస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో ఇప్పటికీ వైద్యరంగంలో 70 శాతం ప్రయివేటు వారే సేవలందిస్తున్నారని చెప్పారు. ప్రజలకు సేవ అందించేందుకు ప్రయివేటు వైద్యులకూ ప్రభుత్వం భాగస్వామ్యం కల్పించాలని కోరారు. ప్రభుత్వం చిన్న, మధ్యతరగతి ఆస్పత్రులకు సైతం ఆరోగ్యశ్రీ సేవలను అనుమతించాలని కోరారు. రాష్ట్రంలో అక్కడక్కడ వైద్యులపై దాడులు జరగడం బాధాకరమని, దీన్ని అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో ఐఎంఏ మాట్లాడి రక్షణ చర్యలు తీసుకుంటుందని చెప్పారు. ఐఎంఏ సభ్యుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. గ్రామాల్లో సీజనల్ వ్యాధులు సంక్రమించే నాన్ కమ్యూనికేబుల్ వ్యాధుల గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. ఆవ్ గావ్ చెలే పథకం కింద గ్రామాలను దత్తత తీసుకుంటున్నామని తెలిపారు. ఆస్పత్రి అనుమతి కోసం సింగల్ విండో సిస్టమ్, ఎస్‌టీపీ ఏర్పాటు, క్లినికల్ స్థాపన, చిన్న ఆస్పత్రికి ఆరోగ్యశ్రీ అనుమతి, ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ బకాయిలను వెంటనే చెల్లించాలని లాంటి సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. సమావేశంలో ఐఎంఏ జనరల్ సెక్రెటరీ డాక్టర్ విజయ్ రావు, కోశాధికారి డాక్టర్ రాజేందర్ కుమార్ యాదవ్, మాజీ అధ్యక్షులు డాక్టర్ ప్రతాపరెడ్డి, డాక్టర్ సంపత్ రావు, ఐఎంఏ ఉపాధ్యక్షులు డాక్టర్ గట్టు శ్రీనివాసులు, డాక్టర్ రంగారెడ్డి, డాక్టర్ లింగమూర్తి, డాక్టర్ నరేందర్ రెడ్డి, వైద్యులు పాల్గొన్నారు.

నిర్మలా సీతారామన్‌కు గవర్నర్ శుభాకాంక్షలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దేశానికి ఉజ్వల భవిష్యత్ నిచ్చే బడ్జెట్ ను ప్రవేశపెట్టారంటూ రాష్ట్ర గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందర రాజన్ .... కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ను అభినందించారు. ఆదివారం న్యూఢిల్లీలో వారిరువురూ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా గవర్నర్ పుదుచ్చేరి, తెలంగాణ భవిష్యత్ అభివృద్ధికి సంబంధించిన ప్రణాళికలను సీతారామన్‌కు సమర్పించారు.

సీఎంను కలిసిన నవీన్ మిట్టల్

భూపరిపాలనాశాఖ చీఫ్ కమిషనర్ (సీసీఎల్ఏ)గా బాధ్యతలు చేపట్టిన సీనియర్ ఐఏఎస్ నవీన్ మిట్టల్ ఆదివారం సీఎం కేసీఆర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ప్రగతిభవన్‌లో కేసీఆర్‌తో భేటీ అయిన ఆయన ధరణి, భూసమస్యలు, వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు భూసేకరణ, పరిహారాలు తదితర అంశాలపై చర్చించారు. మరో వైపు రాచకొండ పోలీస్ కమిషనర్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన సీనియర్ ఐపీఎస్ దేవేంద్ర సింగ్ చౌహాన్ కూడా సీఎంను కలిశారు. త్వరలో జరగనున్న తన కుమార్తె వివాహానికి రావాలంటూ ఆయన సీఎంను ఆహ్వానించారు. మెదక్ జిల్లా శివంపేటలో నిర్మించిన శక్తిపీఠం, శ్రీ బగళాముఖి దేవాలయ ప్రతిష్టాపన మహోత్సవానికి రావాలంటూ అక్కడి ట్రస్ట్ అధ్యక్షుడు వెంకటేశ్వర శర్మ తదితరులు సీఎంను ఆహ్వానించారు. నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్ రెడ్డి కూడా ఆహ్వానించిన వారిలో ఉన్నారు.

నిరసనలు జయప్రదం చేయండి

- టీఎస్ ఆర్టీసీ జేఏసీ చైర్మెన్ రాజిరెడ్డి పిలుపు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర బడ్జెట్‌లో ఆర్టీసీకి రెండు శాతం నిధులను కేటాయించాలని టీఎస్‌ఆర్టీసీ జేఏసీ చైర్మెన్ కె.రాజిరెడ్డి డిమాండ్ చేశారు. మునుగోడు ఉప ఎన్నిక సందర్భంగా మొదటి వేతన సవరణ (1.4.2017), రెండో వేతన సవరణ (1.4.2021)పై ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని కోరారు. ఆర్టీసీలో సంక్షేమ బోర్డులను తక్షణం రద్దు చేసి యూనియన్లకు అనుమతినివ్వాలని విజ్ఞప్తి చేశారు. తక్షణమే గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. సీసీఎస్‌కు డబ్బులు చెల్లించాలనీ, పీఎఫ్, ఎస్‌ఆర్‌బీఎస్‌కు చెల్లించాల్సిన బకాయిలను విడుదల చేయాలని కోరారు. కార్మికులపై పని భారం తగ్గించి, వేధింపులను ఆపాలని కోరారు. ఈ అంశాలన్నింటిపై మంగళవారం డిమాండ్స్ డేను నిర్వహించాలని ఆయన ఆర్టీసీ కార్మికులకు పిలుపునిచ్చారు. సంబంధిత కార్డులను ధరించి విధులు నిర్వహించాలనీ, నిరసనలు తెలపాలని తమ జేఏసీలో నిర్ణయించినట్టు వెల్లడించారు. జేఏసీ కన్వీనర్ వీ.ఎస్.రావు, కో కన్వీనర్ కత్తుల యాదయ్యతో కలిసి ఈ నిర్ణయాలను తీసుకున్నట్టు వివరించారు.

ఆర్థిక వ్యవస్థలో.. విప్లవాత్మక సంస్కరణలు



- దేశంలో మార్పు జరగాల్సిందే
- మోడీ పాలనలో లాభాలు ప్రయివేటుకు.. నష్టాలు ప్రజలకు..
- అదానీ లాభాల కోసమే బొగ్గు దిగుమతి
- మోడీ మిత్రుల కోసం విదేశీ కంపెనీలకు మోకాలడ్డు
- ఎల్ఐసీని పూర్తిగా ప్రభుత్వపరం చేస్తాం
- విభజిత, విద్వేష రాజకీయాలను వ్యతిరేకిస్తాం : నాందేడ్ ప్రెస్‌మీట్‌లో కేసీఆర్ వెల్లడి

నవతెలంగాణ-నిజామాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

దేశంలో పేదరికం నిర్మూలించాలంటే ఆర్థిక వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు జరగాలని సీఎం కేసీఆర్ వెల్లడించారు. చైనా, సింగపూర్, మలేషియా, దక్షిణ కొరియా మాదిరిగా చేయాలని అన్నారు. ప్రస్తుతం దేశంలో పన్నుల పేర పేదల నుంచి లాగడం, పెద్దలకు పంచడం చేస్తున్నారని, ఇది సరైన విధానం కాదని తెలిపారు. ప్రధానమంత్రి మోడీ తన మిత్రుల వ్యాపారం కోసం విదేశీ కంపెనీలను దేశానికి రాకుండా మోకాలడ్డుతున్నారని విమర్శించారు. అదానీ వ్యవహారంపై పార్లమెంట్‌లో చర్చించాలని డిమాండ్ చేశారు. దీనిపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే విద్యుత్తు రంగాన్ని జాతీయం చేస్తామని, ఎల్ఐసీని పూర్తిగా ప్రభుత్వపరం చేస్తామని అన్నారు. మోడీ పాలనలో నష్టాల ప్రజలకు, లాభాలు ప్రయివేటువాళ్లకు వెళుతున్నాయని విమర్శించారు. మహారాష్ట్రలోని నాందేడ్‌లో ఆదివారం బీఆర్ఎస్ బహిరంగ సభ అనంతరం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసీఆర్ మాట్లాడారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో బీఆర్ఎస్ ఏ విధానం ఉండబోతుందో ప్రకటించారు. ప్రస్తుతం దేశం అన్ని రంగాల్లో వెనుకబడిందని, ఈ స్థితిలో ప్రపంచ దేశాలతో పోటీ పడుతున్నామని కేంద్ర నేతలు ప్రకటించడం బూటకమని కొట్టిపారేశారు. దేశంలో ప్రధాని దందా నడుస్తోందని విమర్శించారు. దేశంలో ఉన్న బొగ్గు నిల్వలతో 125 యేండ్ల పాటు యావత్ దేశానికి విద్యుత్తు అందించవచ్చన్నారు. దేశ అభివృద్ధికి విద్యుత్తు రంగం కీలకమని, కానీ కుంటిసాకులతో ఈ రంగాన్ని ప్రయివేటుపరం చేస్తున్నారని వాపోయారు. విద్యుత్తు రంగం పూర్తిగా ప్రయివేట్‌వాళ్ల చేతికి వెళ్తే.. భవిష్యత్తులో దేశాన్ని, సర్కారును బ్లాక్‌మెయిల్ చేస్తారని హెచ్చరించారు. లక్షల కోట్ల ఆస్తిని కేవలం వందల కోట్లకు ప్రయివేటుపరం చేస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా పవన్ హన్స్ కంపెనీని ఉదహరించారు. ఈ కంపెనీతో ప్రభుత్వానికి దక్కే డివిడెంట్ కంటే తక్కువకు ప్రయివేటీకరణ చేశారని అన్నారు. ఇష్టం వచ్చినట్టు ప్రయివేటీకరణ చేస్తే ఊరుకోబోమని, 2024 తర్వాత బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తరువాత మళ్లీ జాతీయం చేస్తామని అన్నారు. బొగ్గు రంగంలోనూ ఇదే విధంగా వ్యవహరించారని ఆరోపించారు. దేశంలో పెద్దఎత్తున బొగ్గు నిక్షేపాలున్నాయని, కిలో బొగ్గు కూడా దిగుమతి చేసుకోవాల్సిన అవసరం లేదని అన్నారు. కానీ ప్రధాని మోడీ.. తన మిత్రుడు అదానీ కోసం రాష్ట్రాలను భయపెట్టి బలవంతంగా ఆస్ట్రేలియా నుంచి బొగ్గు దిగుమతి చేయిస్తున్నారని వాపోయారు. కోల్ ఇండియా కంపెనీకి అవసరమైన రైలు పట్టాలను వేయడం లేదని విమర్శించారు. ఎల్ఐసీని నిర్వీర్యం చేస్తున్నారని, అదానీ కంపెనీల్లో రూ.87 వేల కోట్లు పెట్టుబడి పెట్టించారని, పైగా నష్టం జరగలేదని బూటకపు ప్రకటనలు చేయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది పెద్ద కుంభకోణమని, ఒకవేళ నష్టం జరగకపోతే అదానీ వ్యవహారంపై పార్లమెంట్‌లో చర్చ పెట్టాలని డిమాండ్ చేశారు. మోడీకి అదానీపై ఉన్న ప్రేమ.. ప్రజలపై ఉండాలని చురకలంటించారు.

మహిళలకు పార్లమెంట్‌లో, అసెంబ్లీ, కౌన్సిల్‌లో 35 శాతం ప్రాతినిధ్యం కల్పిస్తామని అన్నారు. దేశంలో రాజకీయ విధానం, ప్రభుత్వ పరిపాలన ఇలా అన్ని రంగాల్లో మార్పు జరిగితేనే దేశం అభివృద్ధి చెందుతుందని అన్నారు. మోడీ మిత్రుడు కాబట్టే అదానీ రెండేండ్లలో ప్రపంచ కుబేరుల్లో రెండో స్థానంలోకి వచ్చారని అన్నారు. ఈ విషయం దేశ ప్రజలందరికీ తెలుసని, ఈ విషయాన్ని ఇంకా దాచలేరని అన్నారు. నీటి వివాదాలకు భాగస్వామ్య పక్షాలతో చర్చించి పరిష్కరిస్తే సరిపోతుందని ఒక ప్రశ్నకు జవాబుగా చెప్పారు. మహారాష్ట్రకు నీటి అవసరం ఉంటే ఎస్సారెస్పీ నుంచి కూడా లిఫ్ట్ చేసుకోవచ్చని ఒక ప్రశ్నకు బదులుగా చెప్పారు.

ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించేందుకే...

- ప్రజా గొంతుక రేవంత్ రెడ్డి యాత్ర
- రాష్ట్రంలో 60 నియోజక వర్గాల్లో 'హాత్ సే హాత్'
- పోరాట వీరవనితలు సమ్మక్క - సారలమ్మ పోరాటగడ్డపై నుంచి ప్రారంభం
- టీపీసీసీ ఉపాధ్యక్షులు మల్లు రవి, గాంధీభవన్ ఇన్‌చార్జ్ కిరణ్, ఎమ్మెల్యే సీతక్క



నవతెలంగాణ- ములుగు

రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించే దిశగా కాంగ్రెస్ పార్టీ అడుగులు వేస్తుందని, ఇందులో భాగంగానే ప్రజాగొంతుకగా టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి ఆదివాసీ పోరాట వీరవనితల పోరుగడ్డ మేడారం సమ్మక్క సారలమ్మను దర్శించుకుని రేవంత్ రెడ్డి 'హాత్ సే హాత్' యాత్రను ప్రారంభిస్తారని టీపీసీసీ ఉపాధ్యక్షులు మల్లు రవి, కాంగ్రెస్ పార్టీ జాతీయ నేత, ఎమ్మెల్యే డాక్టర్ సీతక్క, గాంధీభవన్ ఇన్‌చార్జ్ చాపాటి కిరణ్, మాజీ కేంద్రమంత్రి పోరిక బలరాం, మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య తెలిపారు. ములుగు జిల్లా కేంద్రంలో ఆదివారం ఎమ్మెల్యే సీతక్క అధ్యక్షతన ఏర్పాటు చేసిన 'హాత్ సే హాత్' యాత్ర సన్నాహక సమావేశానికి వారు హాజరై మాట్లాడారు. రాహుల్ గాంధీ భారత్ జోడో పాదయాత్ర స్ఫూర్తితో సమ్మక్క - సారలమ్మ సాక్షిగా రేవంత్ రెడ్డి 'హాత్ సే హాత్' పాదయాత్రకు పూనుకున్నారని తెలిపారు. ములుగు నియోజక వర్గం తాడ్వాయి మండలం మేడారం నుంచి మొదలు కాబోతున్నదన్నారు. కాంగ్రెస్ పార్టీ శ్రేణులు కార్యకర్తలు, నాయకులు పెద్ద ఎత్తున హాజరు కావాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఏక కాలంలో రూ.2 లక్షల రైతు రుణమాఫీ, పంటకు గిట్టుబాటు ధర, ధరణి పోర్టల్ రద్దు, పోడు భూములకు పట్టాలు ఇస్తుందని స్పష్టంచేశారు. సీఎం కేసీఆర్ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లేందుకు రేవంత్ రెడ్డి పాదయాత్రకు శ్రీకారం చుట్టారని అన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్, కేంద్రంలో బీజేపీ ప్రజల సమస్యలను పక్కనపెట్టి కార్పొరేట్ సంస్థలకు కాపాడుతున్నారని తెలిపారు. నిరుద్యోగ భృతి, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, దళితులకు మూడెకరాల భూమి, పంట రుణమాఫీ ఏ ఒక్కటీ అమలు చేయలేదన్నారు. ఎరువులు, విత్తనాలపై సబ్సిడీలు ఎత్తివేసి నామమాత్రంగా ఎకరాకు రూ.5000 రైతుబంధు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు రూ.60 వేల కోట్లు దారి మళ్లించి, కేవలం రూ.10 కోట్లతో దళిత బంధు అమలు చేసి దళితుల మధ్య చిచ్చు పెడుతున్నారని ఆరోపించారు.

అనంతరం రేవంత్ రెడ్డి 'హాత్ సే హాత్' యాత్రపై పాటల సీడీని ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రవళి రెడ్డి, టీపీసీసీ సభ్యులు, భూపాలపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణ రావు, టీపీసీసీ కార్యదర్శి పైడాకుల అశోక్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్, టీపీసీసీ సభ్యులు మల్లాడి రాంరెడ్డి, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు గొల్ల పెల్లి రాజేందర్ గౌడ్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు బానోత్ రవి చందర్, వర్కింగ్ కమిటీ అధ్యక్షులు ఆకు తోట చంద్ర మౌళి, తదితరులు పాల్గొన్నారు.

వీఆర్ఏలకు సీఎం శుభవార్త చెప్తారు

- మంత్రి హరీశ్‌రావు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

వీఆర్ఏల సమస్య సీఎం కేసీఆర్ దృష్టిలో ఉందనీ, త్వరలోనే వారికి ఆయన శుభవార్త చెప్తారని మంత్రి హరీశ్‌రావు హామీనిచ్చారు. ఆదివారం హైదరాబాద్‌లోని మంత్రి నివాసం వద్ద హరీశ్‌రావును వీఆర్ఏ జేఏసీ కో-చైర్మెన్ రమేశ్ బహదూర్, ప్రధాన కార్యదర్శి దాదేమియా, కో-కన్వీనర్లు మాధవనాయుడు, రఫీ, రాష్ట్ర నాయకులు ఉమామహేశ్వర్‌రావు, రాజు, తదితరులు కలిశారు. సోమవారం ప్రవేశపెట్టబోయే బడ్జెట్ ద్వారానైనా వీఆర్ఏల సమస్యలను పరిష్కరించాలని కోరారు. పేస్కేలును వర్తింపజేయాలని విన్నవించారు. ప్రమోషన్లు, వారసత్వ ఉద్యోగాలు, డబుల్‌బెడ్ రూమ్ ఇండ్లు, తదితర హామీలను నెరవేర్చాలని విజ్ఞప్తి చేశారు. వీఆర్ఏలకు న్యాయం జరిగేలా చూస్తామని ఈ సందర్భంగా మంత్రి హామీనిచ్చారు.

పాత పెన్షన్‌ను పునరుద్ధరిస్తున్న రాష్ట్రాలపై కేంద్ర వైఖరిని ఖండిస్తున్నాం

- సీపీఎస్ ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తున్న రాష్ట్రాలకు అదనపు రుణాలివ్వబోమని కేంద్ర ప్రభుత్వం బలవంతపు ఆంక్షలు విధించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని సీపీఎస్ ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దాముక కమలాకర్, చీటీ భూపతిరావు తెలిపారు. ఈ మధ్యనే పాత పెన్షన్‌ను పునరుద్ధరించిన రాజస్తాన్, పంజాబ్, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్ రాష్ట్రాలకు జీఎస్‌డీపీ రుణాలను మూడు శాతానికి తగ్గించి ఉద్యోగుల హక్కులను హరించేలా ఒత్తిడి తేవడం రాజ్యాంగ ఉల్లంఘనే అవుతుందని పేర్కొన్నారు. ప్రావిడెంట్ ఫండ్ రెగ్యులేటరీ డెవలప్‌మెంట్ అథారిటీలో ఉంచిన రాష్ట్ర ఉద్యోగుల వాటాగా ఉన్న రూ.16వేల కోట్లను కేంద్ర ప్రభుత్వం వెంటనే ఆయా రాష్ట్రాలకు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.వాటిని కార్పొరేట్లకు అప్పగించే ప్రయత్నం చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు.

ఆ విధానం తగదు : ఎన్ఎంఓపీఎస్ ప్రధాన కార్యదర్శి స్థితప్రజ్ఞ

రాష్ట్ర ప్రభుత్వాలకు ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించే రాష్ట్రాలకు అదనపు రుణాలిచ్చేది లేదంటూ కేంద్ర ప్రభుత్వం సర్క్యులర్ జారీ చేయడాన్ని ఎన్ఎంఓపీఎస్ ప్రధాన కార్యదర్శి స్థితప్రజ్ఞ తప్పుబట్టారు. ఆదివారం హైదరాబాద్‌లో ఆ సంఘం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా స్థితప్రజ్ఞ మాట్లాడుతూ..ఉద్యోగుల సొమ్మును తనఖాపెట్టే అధికారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఎక్కడిదని ప్రశ్నించారు. ఉద్యోగుల సామాజిక భద్రత, సంక్షేమం కోరే రాష్ట్రాలు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తున్నాయనీ, వాటికి ఆర్థికంగా సహకారం అందించాల్సింది పోయి ఆర్థిక ఆంక్షలు విధించడమేంటని నిలదీశారు. ఉద్యోగుల డబ్బులతో అదాని లాంటి కార్పొరేట్లు బిలినియర్లు అవుతున్నారనీ, ఈ జూదంలో సీపీఎస్ ఉద్యోగులు ఓడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వాన్ని ఆదర్శంగా తీసుకుని వృద్ధ తల్లిదండ్రుల బాగోగులను వదిలివేస్తే 'అదనపు వ్యక్తిగత రుణాల'ను ఇస్తామంటూ బ్యాంకులు కూడా ముందుకు వస్తాయేమో ..అని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ సీపీఎస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కల్వల్ శ్రీకాంత్ మాట్లాడుతూ కేంద్రం బెదిరింపు ధోరణి సరికాదనీ, ఆ సర్క్యులర్‌ను వెంటనే ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర కోశాధికారి నరేష్ గౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కూరకుల శ్రీనివాస్, మ్యానపవన్ కుమార్, లింగమూర్తి, బుచ్చన్న, దర్పన్ గౌడ్, మల్లికార్జున్, రోషన్, ఉపేందర్ పాల్గొన్నారు.

బదిలీలు చేపట్టండి

- మంత్రులు సబిత, గంగుల, సత్యవతి రాథోడ్‌లకు స్పౌజ్ ఫోరం వినతి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో 13 జిల్లాల ఎస్జీటీ, పీఈటీ, భాషా పండితులు, మిగిలిపోయిన స్కూల్ అసిస్టెంట్ల స్పౌజ్ బదిలీలు చేపట్టాలని స్పౌజ్ ఫోరం సభ్యులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఈ మేరకు మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, గంగుల కమలాకర్, సత్యవతి రాథోడ్‌లకు, దారుసలేంలో ఎంఐఎం ఎమ్మెల్యేలకు ఆ ఫోరం సభ్యులు వినతిపత్రాలను అందజేశారు. గతేడాది 19 జిల్లాల్లో స్పౌజ్ బదిలీలు చేసి 13 జిల్లాలను బ్లాక్‌లో పెట్టారని తెలిపారు. సీఎం కేసీఆర్ పెద్ద మనసుతో ఈ సమస్యకు పరిష్కారం చూపించాలని కోరారు. ఇటీవల 615 స్కూల్ అసిస్టెంట్ స్పౌజ్ బదిలీలను మాత్రమే చేపట్టారని తెలిపారు. 2100 దరఖాస్తులొస్తే కేవలం 30 శాతం మేరకే బదిలీలు చేపట్టారని చెప్పారు. డైరెక్ట్ రిక్రూట్మెంట్ అనే సాకు చూపించి ఎస్జీటీ, పీఈటీ, భాషా పండితుల బదిలీలను నిలిపేయడం అన్యాయమన్నారు. 80 నుంచి 90 శాతం వరకు ఇబ్బంది పడుతున్నది మహిళా ఉపాధ్యాయులేనని తెలిపారు.

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేదు



- నకిలీ భూ పట్టాలతో వచ్చే వారిని తరిమికొట్టాలి : సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు జి.నాగయ్య

నవతెలంగాణ-భూపాలపల్లి/గోవిందరావుపేట

కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వాలకు పేద ప్రజల పట్ల చిత్తశుద్ధి లేదని, సీపీఐ(ఎం) పోరాటాలకు నిలయమని, ఎన్ని కేసులైనా భయపడేది లేదని, జైలుకెళ్లడంతోపాటు ప్రాణాలైనా అర్పిస్తామని, పేదలకు పట్టాలు ఇచ్చి, ఇల్లు నిర్మాణానికి రూ.5లక్షలు కేటాయించాల్సిందేనని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు జి. నాగయ్య స్పష్టంచేశారు. జయశంకర్-భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని పాత ఎర్ర చెరువు శిఖం భూమిలో సర్వేనెంబర్-280, 283, 284, 285లోని సుమారు 24 ఎకరాల్లో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పది రోజులుగా సుమారు 3500 గుడిసెలు వెలిశాయి. వీరికి మద్దతు తెలిపేందుకు ఆదివారం వచ్చిన నాగయ్యకు స్వాగతం పలికేందుకు గుడిసెవాసులు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. సీఆర్ నగర్ నుంచి గుడిసెల ప్రాంతం వరకు కోలాటాలు డప్పు చప్పుళ్ళు, నృత్యాలు, డీజే పాటలతో భూపాలపల్లి ప్రాంతమంతా ఎర్రమయమయింది. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి బందు సాయిలు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో నాగయ్య పాల్గొని మాట్లాడారు. ప్రతి కుటుంబానికి భూమి ఇవ్వాలని రాజ్యాంగంలో ఉన్నప్పటికీ ప్రభుత్వాలు పేదల పట్ల కఠినంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. ఎన్నికల ముందు అనేక వాగ్దానాలు చేసి నేడు విస్మరించాయన్నారు. నిరుపేదలకు సొంత ఇల్లు నిర్మిస్తామని హామీ ఇచ్చి తుంగలో తొక్కారని, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఒక్క ఇల్లు కూడా కట్టిన పాపాన పోలేదని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం అక్కడక్కడ డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు నిర్మించినా ప్రజలకు పంపిణీ చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. ఈ క్రమంలో రాష్ట్రవ్యాప్తంగా సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో భూ పోరాటాలు జరుగుతున్నాయని అన్నారు. భూపాలపల్లి పట్టణంలో గూడు కోసం గుడిసెలు వేసుకుంటే అధికారులు శిఖం భూమికి పట్టాలు రావని చెప్పడం దారుణమన్నారు. బడా భూస్వాములకు శిఖం భూములను ఎలా కట్టబెట్టారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఇదే చెరువు శికం భూమిలో మార్కెట్ యార్డు, ఆటో నగర్ నిర్మాణం కోసం రూ.9లక్షలు కేటాయించి శంకుస్థాపన ఎలా చేశారని ప్రశ్నించారు. ఇక్కడ సుమారు 10,000 వేల మంది ప్రజలు ఇండ్లు లేని వారు ఉన్నారని, అందరికీ డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేదంటే సమరశీల పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. అనంతరం ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం పస్రా గ్రామంలో నిర్వహించిన గుడిసెవాసుల సమావేశంలోనూ నాగయ్య పాల్గొని మాట్లాడారు. విలువైన భూముల కోసం నకిలీ పట్టాలు సృష్టించుకొని వచ్చేవారిని తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. పస్రాలోని 109 సర్వే నెంబర్‌లో పేదలు వేసుకున్న గుడిసెలకు పట్టాలు ఇచ్చి పక్కా ఇల్లు నిర్మించాలని కోరారు. రాష్ట్రంలో ఇండ్ల స్థలాలు లేని నిరుపేదలు 40లక్షల మంది ఉన్నారని, ప్రభుత్వం ఇప్పటివరకు మూడు లక్షల మందికి మాత్రమే ఇండ్లు ఇచ్చిందని, ఇలా ఇస్తే మిగతా వారికి ఇవ్వడానికి ప్రభుత్వానికి ఎన్ని రోజులు పడుతుందని ప్రశ్నించారు. ప్రభుత్వాల మీద నమ్మకం లేకనే పేద ప్రజలు ప్రభుత్వ భూములు ఆక్రమించుకుని గుడిసెలు నిర్మించుకుంటున్నారని చెప్పారు. ఈనెల 9న హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ ఎదుట ధర్నాచౌక్‌లో జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఆయా కార్యక్రమాల్లో.. వ్యకాసా రాష్ట్ర నాయకులు బీరెడ్డి సాంబ శివ, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దమెర కిరణ్, జిల్లా కమిటీ సభ్యులు డబ్బా రాజన్న, వంగల రామస్వామి, గుర్రం దేవేందర్, అత్కురి శ్రీకాంత్, సంఘం నాయకులు ప్రీతి, గుడిసె వాసుల కమిటీ నాయకులు, ములుగు జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

భూపాలపల్లిలో.. 'మేడారం జాతర'...

- ఉవ్వెత్తున లేస్తున్న భూ ఉద్యమం

నవతెలంగాణ-భూపాలపల్లి

జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో నిరుపేదలు వేసుకున్న గుడిసెవాసుల పోరాటం మేడారం జాతరను తలపిస్తోంది. మేడారం జాతరను తలపిస్తోంది. జాతర మాదిరిగా గుడిసెలతోపాటు చిరు వ్యాపారాలు అధిక సంఖ్యలో వెలిశాయి. గుడిసె వాసుల నిమిత్తం టీ స్టాల్స్, భోజనం హెూటల్స్, పాన్‌షాప్‌లు, కిరాణా షాపులు, బొమ్మల షాపులు, దుకాణాలు ఏర్పాటు కావడంతో గుడిసెల ప్రాంతంలో నిత్యం వేలాది మందితో జాతరలా కోలాహలంగా కనబడుతోంది. మేడారం జాతరకు వెళ్లాల్సిన ప్రజలు ఆదివారం సెలవు దినం కావడంతో తమకు ఇంటి స్థలం రావాలని గుడిసెల ముందు ముగ్గులు వేసి, ఎదురు కోళ్లతో సమ్మక్క- సారలమ్మకు మొక్కులు చెల్లించుకున్నారు. గుడిసెలో పాలు పొంగించి వంట వార్పు కార్యక్రమం చేపట్టారు. కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి సామూహిక భోజనాలు చేసి నిరసన వ్యక్తం చేశారు.

నామిని రచన - భాషకు నమూనా


కథా రచనకు కావలసిన దినుసులు... వస్తువు, శిల్పం, వర్ణనలు, పాత్ర చిత్రణ, భాష, రచయిత కంఠస్వరం. వీటిలో వస్తువును వ్యక్తం చేసే భాష చాలా ముఖ్యం. కథా రచయిత తాను పుట్టి పెరిగిన పరిసరాల్లోని భాషా ప్రత్యేకతల్ని వాడుకుంటే కథకు గొప్ప వ్యక్తీకరణశక్తి చేకూరుతుంది. సహజత్వం చక్కగా ఉంటుంది. తెలుగువాళ్ళందరికీ ఈ రచన అర్థం కాకపోయినా ముందు కథా కారుని బాధో, బాగో రచయిత తాలూకు ప్రాంత పాఠకులకు అద్భుతంగా చేరుతుంది. ఏ రచయితైనా తన సంవేదనను, అనుభవాన్ని, సన్నివేశాన్ని, సంఘర్షణను జీవద్భాషలో ఆవిష్కరిస్తే ఆ సృజనలో ప్రాణశక్తి ఉంటుంది. ఒక ప్రాంతంలో జీవంతో తొణికసలాడే ఆ రచనను ఇతర ప్రాంతాల వాళ్ళు ఓపిగ్గా తెలుసుకుంటూ చదువుకుంటారు. అది సాహిత్యమ్మీద ఆసక్తి గల చదువరుల పని. అట్లా చిత్తూరు జిల్లా భాషలో రాసిన నామిని రచనల్ని దాదాపు అన్ని ప్రాంతాల పాఠకులూ ఆదరించారు. అందుక్కారణం... ఆ కథల్లోని జీవితంతో పాటు అక్కడి భాష కూడాను.



- నలిమెల భాస్కర్
9704374081

"ఎర్రని ఎండలో మా అమ్మ కడుపు" అనే రచనలో "మా పలుకొటం అయ్యోరికి గెడారం వుండేది గాదు"... ఇది మొదటి వాక్యం. ఇందులో 'పలుకొటం' ఏమిటి? అది 'పళ్ళిక్కూట్టం' అనే తమిళజన్యం అర్థం.. పాఠశాల అని, తమిళనాడుకు చిత్తూరు సరిహద్దు జిల్లా కనుక ఈ పదం ఇటు వచ్చేసింది. ఇటు నుంచి అటూ, అటు నుంచి ఇటూ జరిగే ఈ ఆదానప్రదానాలు సరిహద్దుల్లో దాదాపు ప్రధానంగా జరిగేవే! పై వాక్యంలో 'గెడారం' అంటే గడియారం. 'గడియారం' అనే మాట మాత్రమే తెలిసిన వాళ్ళు 'అయ్యో! భాష పాడైపోయిందే? ఈ గెడారం ఏమిటి? అని ముక్కు విరుస్తారు. కానీ, అటువంటి పెదవి విరుపులు అవసరం లేదు. ఎందుకని? 'గడియారం' కూడా ఆ లెఖ్ఖన తప్పే! అది వాస్తవంగా. 'ఘటీకారము'. కనుక.. మూలపదంతో పోల్చితే గడియారం ఎంత తప్పొ, గడియారంతో పోలిస్తే గెడారం అంతే తప్పు. నిజం చెప్పుకోవాలంటే, ఏదీ తప్పు కాదు.ప్రజలు మాట్లాడుతున్న రూపాలన్నీ దాదాపు సాధురూపాలే. భాషలో దైనందిన బవన సంఘర్షణలో ఉచ్చారణా వేగంతో చదువుకోని కారణంగా ప్రజలు అలా పలుకుతారు. భాషా శాస్త్రవేత్తలకు ప్రతిపలుకూ శిరోధార్యం.

ఈ కథలోనే నామిని ఓ చోట 'ఇష్కూలు' అంటాడు. ఆంగ్లపదం స్కూలును పలుకలేక ముందు 'ఇ' చేర్చుతారు. ఇది ఉర్దూ సంప్రదాయం. అడవి బాపిరాజు రాసిన 'గోనె గన్నారెడ్డి'లో 'లాక్కుంటూ'కు బదులు 'ఉళాక్కుంటూ' వుంది. దాదాపు గ్రాంథిక భాషకు దగ్గరగా ఉన్న అందులోనే ఇది ఉంది. కారణం ప్రాంతీయ ముద్ర కూడా. అలాగే ఆంగ్లం మాట 'పర్మినెంటు', నామిని భాషలో 'పర్మనెట్టు' ఆయిల్ మిషన్ అనేది ఆయిన్ మిషినీ. నిజమే! టిఫిన్ సెంటర్‌ను సీమలో చోట్ల 'టిఫినీ' అని అనగా విని రాయగా చూసినవాణ్ణి!



ఇందాకటి వాక్యంలో 'అయ్యోరు' ఉన్నారు. ఆయన అయ్యవారు. అంటే బడిపబంతులు. అయ్యవారు మారిన రూపం దాల్చి అయ్యోరయ్యారు. 'అయ్యో! ఎంత ఘోరం!' అనేస్తారేమో మరలా పండితులు. శ్రామిక జనం తమకు అవసరమైన పద్ధతిలో మూల పదం మార్చుకుంటారు. ఈ కథలోనే 'పెద్దోళ్ళు, వోడు, వోళ్ళు' ఇలాంటి పదాలున్నాయి. ఇవి క్రమంగా 'పెద్దాళ్ళు, వాడు, వాళ్ళు'. మరి... ఈ 'వాడు, వాళ్ళు' సరైనవేనా? కాసేపు పండితుల మాటే అంగీకరిద్దాం. కాదు, అవి క్రమంగా 'అవండు, అవర్‌గన్' నుండి వచ్చిన రూపాలు. అందుకే పూర్వం 'వాడు'లో 'వా' తరువాత అరసున్నా ఉండి 'డు' ఉండేది. 'వాడు' ఇలా మారాడు. వాడు మారాక వాళ్ళూ మారిపోయారు. ఆ వాళ్ళకు ముందు పెద్ద విశేషణం చేర్చగానే పెద్దోళ్లయిపోయారు చిత్రంగా.

ఈ కథలో 'పిలకాయలు'న్నారు. 'పిల్లలు, పిల్లవాళ్ళు'లో లేని కాయలు రాయలసీమలోఉన్నాయి. పిల్లగాండ్లకు శిష్ట వ్యావహారికంలోని



నామిని ఈ మొదటి రచనలో ఓ చోట 'నన్ను తోడుకొని' అంటాడు. అదే మూలం. తృతీయా విభక్తులు తెలుగులో 'చేతన్, చేన్, తోడన్, తోన్'లు. ప్రాచీన పద్యం భాషలో 'తోడ్కొని' అని ఉంటుంది. ఈ 'తోడుకొని' అంతేగానీ 'తీసికొని' వేరు. ఈ చిత్తూరు 'తోడుకొని' అనేదే తెలంగాణలో 'తోలుకొని'.

'ఎంౖడి'కి తెలంగాణలో 'కాయ' చేరలేదూ! (ఎండ్రికాయ) తెలుగువాళ్ళందరి 'తల' అప్పుడప్పుడు 'తల కాయ' కావడం లేదా?

ఇంకో ముఖ్యమైన విషయం నామిని కథలో 'కాకువు' కనిపించడం. చెప్పదలచుకున్న దాన్ని ఒక ఒడుపుతో చెప్పి గొప్పగా భావాన్ని గోచరింపచేయడం "కాకువు" ఓ చోట... 'నిజ్జం' అంటాడు. ఇది 'నిజం' కదా! మరి 'నిజ్జం' గా అవతారం ఎత్తిందేమిటి అంటే, 'నిజం' కన్నా 'నిజ్జం' అంటే మరింత వాస్తవం అని. ఇక 'నిజ్జం' అంటే చిత్తూరు ప్రాంత విశిష్టత. 'భయం' అనేదాన్ని మనం సందర్భోచితంగా 'బయ్యం' అనటం లేదూ అడపాదడపా! ఇంకా "మద్దేనం, గెంట, అచ్చిరాలు, లంబ, ఆకిలి (ఆకలి), మునం పట్టి (మునుం), నీళ్ళు ఎత్తకపోయి (ఎతుకు పోయి)' ఇటువంటి ఉచ్చార ణలోని ఒడుపులు అడుగడుక్కీ చూడగలం. 'అబద్ధం' అనే మాట మనందరికీ తెలుసు. నామినిలో అది 'అపద్దం' అంటే 'బ' అనేది 'ప'అయ్యింది. బాపురే! తెలంగాణలో అబద్ధం 'అపద్దం'గా మారింది. 'బ' అనేది 'ప'గా మార్పు చెందింది. భావార్థం ఒక్కటేగా! మరిలాగైతే భాష పూర్తిగా మారిపోతుంది కదా అని ప్రశ్నిస్తే మరి తెలుగు భాషలోని 'ఒకటే' అనే మాటలకు ఏభై రెండు రకాల రూపాంతరాలు ఎందుకూ? ఈ ప్రశ్న నాది కాదు – గిడుగు వంటి వాళ్ళు వేశారు ఎనుకటనే! అదుగో 'వెనుకట' (పూర్వం) అనేది 'ఎనుకట' అయ్యింది. పదం మొదట ఉన్న 'వ'కారం లోపిస్తుంది ప్రజల నోట, ఎందుకూ నండూరి 'వెంకి' పాటలు రాశాడా? 'ఎంకి'యా?

నామిని తన మొదటి రచనలో ఇట్లా 'యెనకా న్నించి, యెంటికలు, యెధవా, యినిపిస్తాయి, ఇచ్చిత్రం'లలో పదానిది వకారలోపం బిరిగిన మాటల్ని ఉపయోగించాడు. అదీగాక సిత్తూరు, సెంద్రగిరి, సేతికి, సాటుమాటుగా, సిన్నప్పుడు, సిరంజీవుడు, సోట, అరిసి (అరిచి), మరిసిపోయి (మరిచి), సిన్నతనం'... వీటిలోల చకారం సకారంగా మారిన రూపాలు చూపాడు. అన్నట్టు... అబద్ధం అనే మాట 'అపద్దం' అయిపోతే, చిత్తూరులో 'శబ్దం' అనేది 'శపద్దం'గా వినిపిస్తుంది. ఎంత చిత్రం! శబ్దంలోని 'బ' అనే పొల్లు 'ప'గా మారిపోవటమే గాక ఒత్తుగా ఉన్న 'ద' చిత్రంగా 'ద్ద'గా పర్యవసించింది.

ఇంకొక మాట 'పెక్యాసి'. ఇది 'ప్రఖ్యాతి' ఎంత మార్పు! ఇలా అనొచ్చా? బెంగాలీలో 'ముఖ్య మంత్రి'ని 'ముక్కొమొంది' (మొంతి)అని అంటారు. అన్నట్టు.. తెలుగులో 'దగ్గర' అనే మాట ఉంది. ఇది శిష్టవ్యావహారికంలో ఇవాళ 'దగ్గెర' అయి కూచుంది. తెలంగాణలో 'దగ్గెర'. చిత్తూరులో 'దగ్గిరికి'. అన్నీ 'దగ్గర'కు దగ్గిర రూపాలే! ఇంకా.. మరాఠీలోని 'జవళ్'కు ఇది దగ్గర అని నా ప్రతి పాదన. ఎలాగంటే 'దగ్గర' అనేది దగ్గర, దగ్గెర, దగ్గిర నే మూడు రూపాల్లో కలిపిస్తున్నది కదా. అది 'దగర' కూడా అయి ఉండాలి. ఈ 'ద'కూ మరాఠీ 'జవళ్'లోని 'జ'కూ సామీప్యం ఎక్కువ. 'సందెవేళ', 'సంజ వేళల్లో 'ద' అనేది 'జ'గా కన్పిస్తున్నది కదా! ఇక... 'దగ్గర'లోని రెండవ అక్షరం 'గ' మరాఠీలో రెండోది 'వ' (జవళ్). గ, వ ... రెండూ పరస్పరం మారుతాయి. ఉదా॥ పగలు, పవలు. చివరి అక్షరం 'ర' (దగర). 'మహారాష్ట్రలో 'ళ్' అది హ్రంతం కనుక దాన్ని ఓమారు 'ళ' అని అజంతంగా చూద్దాం. ఇప్పుడు తెలుగు చివరి 'ర' (ఱ), మరాఠీ ఆఖరి 'ళ' చాలా దగ్గర. ఈ రెండూ మారుతుంటాయి. ఎవరు, ఎవలు...లో 'రు' అనేది 'లు'గా కనిపిస్తున్నది కదా! భాషాదృష్టి అలవడినపుడు మనకు పదాల మధ్య సాజాత్య సారూపాలు తెలిసే వీలు కలుగుతుంది.

నామిని కథల్లో నేటివిటీ బాగా కన్పిస్తుంది. 'సంగటి' రాయలసీమదే కదా! దానిలోని కలుపు కునే 'గోగాకు ఊరుబిండి అక్కడిదే! గోగాకు అంటే గోగుచెట్టు ఆకు. ఆ చెట్టువి గూగుపూలు. ఆ గోగాకులతో చేసిన పచ్చడి 'గోంగూర'. అది బహుశ సిత్తూరులో 'గోగాకు వూరుబిండి'.

ఓ చోట 'అవీట్ని' అని ఉంటుంది. శిష్టభాషలో దాన్ని 'వాటిని' అని అంటారు. 'అవీట్ని' చాలా ప్రాచీనం. వ్యాకరణ పరిభాషలో దీన్ని అమహద్వాచక బహువచన సర్వనామం అంటాం. అవి కి 'ని' (ద్వితీయా విభక్తి) కలిపితే 'అవీట్ని' అవుతున్నది. ఇది తెలంగాణలో 'అవ్వీటిని'గా ఉంది. ఇదే.. మళయాళంలో 'అవట్టగళె'. తమిళంలో 'అవత్రైగళై' ఇవి తెలియనివాళ్ళు 'వాటిని' అనాలిగానీ, 'అవీట్ని' ఏమిటి అని మరలా ఎగతాళి చేస్తారు. కానీ మూలరూపానికి దగ్గరైన పదాలు వెనకబడిన ప్రాంతాల్లోనే ఉంటాయని గమనించాలి. ఇదే మొదటి కథలో 'రాబో, తేబో' అనే మాటలున్నాయి. ఇవి 'రాపో, తేపో' వరుసగా సంస్కృత 'అబద్ధం'లో 'బ' 'ప'గా అపద్దంలో కనిపిస్తుంటే, తెలుగు 'పో' చిత్తూరులో 'బో' అయ్యింది.

'యాష్టపోతుంది' (విసుగు చెందుతుంది), 'అసోబుసో మని గసపోసుకుంటూ' (రొప్పుతూ రోజుయా), 'కలుపు పెరకతా' (కలుపు తీస్తూ / పీకుతూ), 'వరపడినానా?' (వరం అడిగినానా?' 'పట్టా పరుగు' (ఒకటే పరుగు) 'ఏం వారుకున్నాను (ఏం బావుకున్నాను)... ఇట్లా ప్రాంతీయ పరి మళం నామని కథల్లో అంతటా ప్రసరిస్తది. 'కూలిపోయిన దేముడా!' 'నా బట్టా' మొదలైన చిత్తూరు చీవాట్లు విన్పిస్తాయి చెవులకింపుగా. 'ఉండాయి' అనే క్రియా పదం ఎంతో ప్రాచీనం. మరలా తెలియని వాళ్ళు 'ఉన్నాయి' కదా ఉండా ల్సింది అంటారు. 'ఉండాయి' అనేదే మూలం. అది క్రమంగా 'ఉన్నాయి' అయ్యింది. తెలుగులో 'మిన్నకుండి పోయాను' అని ఓ క్రియ ఉంది. అంటే మౌనంగా అని. ఇది 'మిన్నక' కాదు, 'మిండక'. ఈ 'మిండక' తెలుగు నిఘంటువు లోనే ఉండదు. కానీ మలయాళంలో ఉంది. అక్కత 'మిండాతె ఇరిక్కూ' అంటే 'మిన్నక ఉండు' అనీ అర్థం.

నామిని ఈ మొదటి రచనలో ఓ చోట 'నన్ను తోడుకొని' అంటాడు. అదే మూలం. తృతీయా విభక్తులు తెలుగులో 'చేతన్, చేన్, తోడన్, తోన్'లు. ప్రాచీన పద్యం భాషలో 'తోడ్కొని' అని ఉంటుంది. ఈ 'తోడుకొని' అంతేగానీ 'తీసికొని' వేరు. ఈ చిత్తూరు 'తోడుకొని' అనేదే తెలంగాణలో 'తోలుకొని'.

'అన్నాక, చెప్పినాక'... ఇటువంటివి వాస్తవంగా 'అన్న వెనుక, చెప్పిన వెనుక'ల నుంచి మారిన బాబతు. ఇవే తెలంగాణలో 'అన్నంక, చెప్పినంక'లుగా ఉంటాయి. 'నిజ్జంతో పచ్చ నాకు సత్తెంగా' చెబుతున్నాను. నామిని భాషలో జీవం ఉంది. శిష్టవ్యావహారికం మరో గ్రాంథికంలా శిలాసదృశం కారాదు. ఎవరి భాషలో వాళ్ళు రాస్తేనే అందులో జీవితమూ ఉంటుంది. జీవమూ ఉంటుంది.

చెరువుగట్టు

దిక్కులన్నీ శూన్యమైన వేళ
చెరువే పెద్దదిక్కయ్యింది,
నన్ను నేను చేరుకోడానికి
చెరువుగట్టు విలువైన దారినిచ్చింది!

అడుగులు క్షణాలతో బాటు
కలగలసి నడుస్తున్నాయి,
ఏ ఒక్క క్షణాన్నీ వృథా చెయ్యకుండా
అన్నీ ఒకేవైపు పయనించాయి!

ఎగసిపడే ఆలోచనా కెరటాలు
తీరాన్ని దాటాలని చూసినా,
చెరువు గుండె కరిగిపోయి
చేయందిస్తూ అక్కున చేర్చుకుంది,
గట్టు దాటి వెళ్ళలేవని
అమ్మ కొంగులాంటి ఓదార్పునిచ్చింది!

ఒడ్డున పడ్డ మనసుచేపను
తన ఒడిలోకి తీసుకుంది,
అలజడిని అల్లకల్లోలాన్నీ
తనలోకి చల్లగా కలుపుకుంది!

ఎర్రబడ్డ సూర్యుడు నీడనిస్తూ
మెల్లగా జారిపోయాడు,
మబ్బులు కమ్ముకుంటూ
పగలు రాత్రి ఒకటని ఏకం చేసింది,
వెలుగైనా చీకటైనా
పంచుకుంటేనే అందమనీ
విడమరచి చెప్పింది!

ఒక్కోసారి చెరువు
మనకు ఎదురుగానే కాదు,
కళ్ళలో కూడా చేరుకుంటుందని
పలుమార్లు నిరూపించింది!

ఇప్పుడు చెరువు ఒక్కటే కాదు
శూన్యం ఎక్కడున్నా
నన్ను నేను ముక్కలు చేసి విసిరేస్తాను
మళ్ళీ ఒక్కటై నాలోకి చేరుకుంటాను!

- పుట్టి గిరిధర్, 9494962080

ఆధునిక వచన కవిత్వంలో బౌద్ధ తత్వాన్ని
తొలిసారి ఆకర్షణీయంగా ఆవిష్కరించిన కవిత

ఇదొక కవనం, ఇదొక సవనం. ఇదొక సమర శంఖానాదం. ఇదొక ఆత్మ హాహాకారాలతో ముందుకు సాగుతున్న ఆహవ యాత్ర. ఈ యాత్రలో బుద్ధుని పునరాగమనం కోసం నిరీక్షిస్తున్న కపిలవస్తు పుర ప్రజలం మనం. శాంతి ఎల్లవేళలా తెలుపే కానక్కర్లేదని, 'ప్రజల శాంతి / ప్రపంచ శాంతి / ఎర్రగా కూడా ఉంటుంది.' అంటారు. అది నీలం కూడా కావచ్చని, అప్పుడే అది వినీలం, విలీనమూ అవుతుందని అంటున్నాడని మనమూ ఆకాంక్షించవచ్చు. బుద్ధోదయంలోని ఎరుపును సంగ్రహించమని సూచన కూడా ఉంది. ఏం చూస్తున్నాడు కవి?

"సమరంలోనే శాంతి /సమరంలోనే కాంతి /సమర సన్నాహమే /ఈ యుగధర్మం" అనే చాటింపును చెవులకు చూపుతున్నాడు. అయితే – దీనికి కొనసాగింపు పార్శ్వం కూడా ఒకటుంది.

Dogmatism and intolerance are the most harmful things in the intellectual world. (P.Laxminarasu)

ఏ హాని కారకాలు ఉండకూడదని మనం భావిస్తున్నామో అవే రాజ్యమేలుతున్నాయి. అందరినీ చుట్టుముట్టిన శక్తులు, విపత్తులు, పెను ఆపదలు ఏవో అందరి అనుభవానికొచ్చిన విషయాలే. అయినప్పటికీ తిరిగి తిరిగి 'రాజు గారి గుడ్డలు' కథల్లానే పునః పునః మన ప్రయాణాలు, ప్రస్థానాలు సాగుతున్నై. జోరుగా, హుషారుగా. నోరు తెరుచుకోదు. గొంతు విప్పుకోదు. స్వరం జ్వరగ్రస్తం. అంతటా భయావహ స్థితి. సమస్తమూ భీతి ఆవరించి ఉంది. ఇటువంటి తరుణంలో 'సమరమే శాంతి' అంటూ నిట్టనిలువునా పగులుతున్నాడు కవి.

దుర్భేద్యమైన అఖండమైన అసహన అజ్ఞాన ఆవరణలోకి వెలుగు పూలు చల్లుతున్నాడు కసిగా పసిగా.

"శీలం ఆరిపోయింది /జ్ఞానం జారిపోయింది /సమాధి పారిపోయింది /ఆవురుమన్న 'అర్ధ సత్యం ముందు / ఆర్య సత్యాలు ఆవిరై పోయాయి / ఏడుస్తున్నాను." అని ప్రకటిస్తున్నాడు. దుఃఖమో, శోకమో అనకుండా ఏడుస్తున్నానంటాడేమిటి. ఈ ఏడుపులోని నిస్సహాయతను గుర్తించిన వారు ధన్యులు. వారు ఓదార్చబడెదరు. తన ఏడుపుకి మూల కారణాలను ఈ దీర్ఘ కవితలో పలు దఫాలుగా విపులంగానే చెప్పుకుంటూ, విప్పుకుంటూ పోయాడు. ఆలకించుకుంటూ పోవడమే మనం చేయాల్సిన పని.

సంవేదనలతో కూడిన, పలు నిశ్చయాలు నిండిన స్థిర ప్రకటన ఒకటి, ప్రతిపాదన మరొకటి ఇలా ముందు పెడుతున్నాడు.

"మరణిస్తే యుద్ధంలో మరణించు /జీవిస్తే బౌద్ధంలో జీవించు /బౌద్ధంలో జీవించడానికి / యుద్ధంలో మరణించాలి / యుద్ధంలో మరణించడానికి / బౌద్ధంలో జీవించాలి".


ఇతని నిశ్చయ వాక్య అంతరంగం ఏమిటో క్షణమాగి, ఆలోచించి అడుగేయండి.

బుద్ధుడు హింసను, యుద్ధాన్ని ప్రేరేపించలేదు. అహింస గురించి చెప్పిన సంగతి తెలియనిదేమీ కాదు. మరెందుకు కవి జీవితం, యుద్ధం, మరణం అంటూ ఒక అనివార్యతను ప్రస్తావిస్తున్నాడు? గత రెండు దశాబ్దాలలో బౌద్ధం ప్రవర్తిల్లిన ఆయా దేశాలలో హింస ప్రజ్వరిల్లింది. ముఖ్యంగా మయన్మార్, కాంబోడియా, శ్రీలంక, థాయ్‌లాండ్ లాంటి చోట్ల హింసోన్మత్తత పెరిగింది. బౌద్ధ బిక్షువులు తలపెట్టిన హింస అది. దానిని సమర్థించుకోవడానికి వారు బౌద్ధ రచనలను ఉదహరించారు. ప్రసాదమూర్తి తాను చూసిన ఈ వైపరీత్య స్థితిని చెప్పడానికి, బౌద్ధ ధర్మం కాని వాటిని అమలు చేసిన పరిస్థితులను తేటతెల్లం చేయడానికి పై విధంగా వ్యాఖ్యానించాడా? యుద్ధం బౌద్ధమే. జీవనం బౌద్ధమే. మరణం బౌద్ధమే.

తనకు యుద్ధం అంటే మరొక అర్థం కూడా ఉంది. అది విస్తృతం కావడం. విస్తరణం దాని లక్ష్యం. తాను యుద్ధానికిచ్చే నిర్వచనమే వేరుగా ఉంది.

"ఆయుధాలు అవసరం లేని /సైన్యాలు అక్కర్లేని /సరిహద్దు కాపలాలతో పని లేని /కాలంలోకి ప్రయాణించే / అసలు యుద్ధమే బుద్ధుడు" జయించాల్సినవి ఎన్నో ఉన్నవి. సాధించాల్సినవి అనేకం. వాటన్నిటి మీద సాగించాల్సిన యుద్ధం గురించి కూడా ఈ దీర్ఘ కవిత ప్రస్తావనకు తెస్తుంది.

ఒకానొక ఐరానిక స్థితిని, పారడాక్సిక గతిని కలిపి ఉద్వేగ సంభరితంగా వ్యాఖ్యానిస్తున్నది ఈ కవిత. అందుకే ఈ కవితకు 'విడంబన' అనేది ముఖ్య అభివ్యక్తి వ్యూహంగా ఉపకరించింది. బుద్ధుడు సకల సౌఖ్యాలను వదిలి సత్యాన్వేషణ కోసం వెళ్లిపోయాడు. రాజ్యాన్ని త్యజించి, పదవి, అధికారం, రాజ్య కాంక్షను వదులుకొని వెళ్లిన బుద్ధుని సిద్ధాంతాన్ని అనుసరిస్తున్న వ్యవస్థలు అవ్యవస్థలుగా, అరాచకపు వ్యవస్థలుగా మారిన వైనాన్ని గూర్చి చెపుతాడు.



వ్యక్తులను హింసోన్మత్తత అవహించి సృష్టించే విధ్వంసం ఎంత ఉంటుందో ఊహించటం కష్టమేమీ కాదు. దీనిని నివారించాలంటే శాంతి కోసం యుద్ధం చేయాలి. ఇది మతాధిపత్య యుద్ధం కాకూడదు. మనిషి తనలో తాను సాగించాల్సిన యుద్ధం వైపుకు నడవాలని ఆకాంక్ష.

"రాజ్య మోహాన్ని వీడినవాడే/ రాజ్యం కావడం విడంబన /సన్యాసులు సైనికులు కావడం విడంబన /హింస నుంచి విముక్తికి /హింసను ఆయుధం చేయడం విడంబన /హిందూ మహా సముద్ర తీరంలో /కాషాయాధికార స్థాపన కోసం / సైనిక ప్రస్థానం ఒక విడంబన /బుద్ధుడు సైనిక శిబిరాల /జెండాగా మారడం ఒక విడంబన /బౌద్ధాన్ని రాజులు ఆశ్రయించిన చోట /రాజ్యాన్ని బౌద్ధం ఆశ్రయించడం విడంబన" అంటూ పలు పరిణామాలను మోసుకు తెస్తున్న సకల వ్యవస్థల పట్ల తనకు గల అభ్యంతరం ఈ దీర్ఘ కవితకు బీజ సూత్రం. అంతవరకే చెప్పి ఉంటే ఇదొక ఖండికగానే మిగిలిపోయేది. అంతకు మించిన ప్రయోజనం కవి ఆశిస్తున్నాడు. అదేమంటే జాతీయ, అంతర్జాతీయ మత రాజకీయాలను ప్రశ్నించటం, బౌద్ధం ఒక మతంగా కాక ఒక ఆచరణగా ఎంత ఉదాత్తమైనదో, ఉత్కృష్టమైనదో తెలియజెప్పి, బౌద్ధం పట్ల సానుకూల దృష్టిని కలిగేట్లు చేయటం. ఈ లక్ష్యంతోనే ఒక ఖండికా మాత్ర కవితగా కాక, దీర్ఘ కవితగా విస్తరించగలిగేట్లు చేయగలిగాడు.



- సీతారాం

బౌద్ధాన్ని ఆశ్రయించి చెప్పినా ఈ కవిత బుద్ధిస్టు జాతీయవాద ప్రమాదాన్ని గురించి గుర్తించి హెచ్చరిస్తుంది. కవికి గల జాతీయ, అంతర్జాతీయ మత రాజకీయాలపట్ల అవగాహన వల్లనే ఇలా అనగలిగాడు.

"బౌద్ధ రాజ్యం బర్మాలో/ బుద్ధిస్ట్ బిన్ లాడెన్ /ఆశిన్ విరాత్తు ఎలా పుట్టాడు?" అని అడిగినా..

"తీరమంతా / బుద్ధుడి ద్వీపాలు పెట్టుకున్న /సింహళ ద్వీపం / దారి పొడవునా మనిషి నెత్తురే / ఎందుకు తాగిందని ప్రశ్నించినా..

"శ్రీలంకలో దుతుగమనుడు ఏంచేశాడు/ సన్యాసులు సైనికులైన వైనం ఏమిటి? /మైనారిటీల మీద / మెజారిటీల దండయాత్ర దేనికీ?"

మెజారిటీ ఉగ్రత్వంలోని ఉన్మాదం గురించి కవి ఆందోళన "ఆశిన్ విరాత్తు" ఎట్లా పుట్టాడనే ప్రశ్న తేలికగా తీసివేయగలిగిందేమీ కాదు. ఈ ప్రశ్నలో 969 ఉద్యమం, మయన్మార్‌లోని ముస్లింల ఊచకోత గురించి తీవ్ర కలత కవితను వెన్నాడుతూ వస్తున్నది. విరాత్తు 969 ఉద్యమానికి మయన్మార్‌లో ఎంతో మద్దతు ఉంది. ఆ ఉద్యమం మయన్మార్‌ని కాపాడాలని దేశంలో పెరుగుతున్న ముస్లింల సంఖ్య గురించి, దాన్లోని పొంచి వున్న ప్రమాదం గూర్చి అపోహలున్నాయని గుర్తించాడు కవి. ఇటువంటి మత ప్రాతిపదికతో కూడిన హింసను నమ్మిన జాతీయ వాదాలు ఉత్పన్నం చేయగల పరిస్థితుల పట్ల కవికి గల అవగాహనతో వర్తమానానికి అన్వయించి ఇలా అంటారు.

"కాషాయంలో బుద్ధుడు కనపడడు/ శిరోముండనమే బౌద్ధ శిరోధార్యం కాదు/గుండెలతో కడితేనే ఆ రామం/ కత్తులతో శాంతి స్తూపం చెక్కలేరు"

కాబట్టి హింసోన్మాదాన్ని వదిలి పెట్టాల్సిందేనని ఉద్బోధ. వ్యక్తులను హింసోన్మత్తత అవహించి సృష్టించే విధ్వంసం ఎంత ఉంటుందో ఊహించటం కష్టమేమీ కాదు. దీనిని నివారించాలంటే శాంతి కోసం యుద్ధం చేయాలి. ఇది మతాధిపత్య యుద్ధం కాకూడదు. మనిషి తనలో తాను సాగించాల్సిన యుద్ధం వైపుకు నడవాలని ఆకాంక్ష.

కొన్ని కోరికలను తాను నిర్వచించాడు. వాటిలో 'ఆధిపత్యం కోరిక' 'పాలించడం కోరిక' అంటాడు. తనను తాను గెలుచుకున్న ప్రతి వ్యక్తీ గౌతముడే కవి దృష్టిలో. తన మీద తాను సాగించే యుద్ధంలో 'సమస్త జీవరాశితో నీ మమతాను బంధం' ఎంతో అంచనాలకు రమ్మంటాడు కవి. అలాగే

"రాగద్వేష మోహరహిత ధ్యానం నీ యుద్ధం /సమతా దృష్టి సత్సంకల్ప దయా వృష్టి /సహృదయ వాక్కు.... సద్ధర్మ కర్మ /సాధు సాధన... సంఘ జీవన /సమస్తమూ యుద్ధమే /యుద్ధమే శాంతి" అని ప్రతిపాదన. ఇదొక సమ్యగ్వృత్తం.

అంతకు ముందే పుట్టిన చెడును వొదిలిపెట్టే ప్రయత్నం, ఇంకా పుట్టని చెడును పుట్టకుండా ఆపటం. ఇంకా ఉద్భవించని మంచిని ఉద్భవించేట్లు పురికొల్పటం, ఇంతకు ముందే పుట్టి ఉన్న మంచిని మరింత పెంచే ప్రయత్నం. ప్రసాదమూర్తి తన కవితా సంవేదనను, ఉద్వేగాలను మరొక తాత్త్విక తలంలోకి తీసుకుపోయిన సఫలయత్నం. ఇందులో ప్రసాదమూర్తి చెప్పినవి బుద్ధుని గుప్పిటలోని ఆకులతో సమానం. కవి బోధించాలనుకున్నది అడవిలోని మొత్తం ఆకులకు సమానం.

(ప్రసాదమూర్తి దీర్ఘకావ్యం 'యుద్ధమే శాంతి' ముందు మాటలో కొంత భాగం)

పిచ్చి ఏనుగు!

నిరంతరం ప్రవహించే నదీ పాయలు
నిశ్శబ్దంగా నిష్క్రమిస్తున్నాయి!

వేయిరేకల వెన్నెల పువ్వు
నేల వైపు వాలుచూపు చూస్తోంది!

సప్తవర్ణాలు లుప్తమైన ఇంద్రధనుస్సు
వివర్ణమై ఆకాశాన్ని వీడుతోంది!

నడిచి వచ్చిన నిన్నటి పాదముద్రలు
నానాటికీ చెదిరిపోతున్నాయి!

వివిధాలను విభిన్నాలను
వివాదాస్పదం చేయడం సులువైన విద్యే

యదార్థాన్ని గ్రహించే లోపే
జరగరాని ఘోరం జరిగిపోతుంది

మూతులుకుట్టేసి చేతులుకట్టేసి
విద్వేషాగ్నుల్ని రగిలించడం ఎంతసేపు?

సంయమన సాధనా! దాని ఫలితం
అంత సులభం కాదుకదా!

ఆకలీ అవసరం అమాయకత్వాలు
శాశ్వతత్వాన్ని ఆపాదించుకున్న మైదానంలో!
చేయితిరిగిన ఆటగాళ్ళు చెలరేగిపోరూ?

అచ్చోసిన ఆంబోతులకు
ముకుతాళ్ళు బిగించకపోతే
మంకుతనంతో రంకెలు వేయవూ?

వేటాడటం నిషేధించబడినా
వేటమీద పడుతున్న వేటగాళ్లు!
వీళ్ళు మనుషులా?మనుషుల్ని తినే పులులా?
దంతాలున్న ఒక పిచ్చి ఏనుగు!
దానిపై చెదలు పట్టిన అంబారీ!!
చోద్యాలు చూసే మావటీలు!!!

- కరిపె రాజ్ కుమార్, 8125144729

సాహితీ వార్తలు

10న పసునూరి "కండీషన్స్ అప్లయ్" ఆవిష్కరణ

పసునూరి రవీందర్ నూతన కథా సంపుటి "కండీషన్స్ అప్లయ్" ఆవిష్కరణ సభ లిఖిత ప్రెస్ ఆధ్వర్యంలో ఈ నెల 10న రవీంద్రభారతిలో సాయంత్రం 5గం.లకు నిర్వహించనున్నారు. ప్రొ.ఘంటా చక్రపాణి సభాధ్యక్షులుగా వ్యవహరించే ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆచార్య కొలకలూరి ఇనాక్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తారు. గౌరవ అతిథులుగా ఏకె.ప్రభాకర్, ఖదీర్‌బాబు, విశిష్ట అతిథిగా సినీ దర్శకులు వేణు ఊడుగుల, ఆత్మీయ అతిథులుగా పెద్దింటి అశోక్ కుమార్, వెల్దండి శ్రీధర్, అపర్ణ తోట పాల్గొని ప్రసంగిస్తారు. సమన్వయకర్తలుగా ఒమ్మి రమేష్‌బాబు, కె.సజయ వ్యవహరిస్తారు. వివరాలకు 9848799092 నంబరు నందు సంప్రదించవచ్చు.

11న విమల సాహితీ సమితి బహుమతి ప్రదానోత్సవ సభ

విమల సాహితీ సమితి - పాలపిట్ట సంయుక్తంగా నిర్వహించిన గుర్రం జాషువా స్మారక కవితల పోటీలో విజేతలకు బహుమతి ప్రదానోత్సవ సభ శనివారం 11 ఫిబ్రవరి 2023 నాడు ఉదయం 10 గంటలకు త్యాగరాయ గానసభలో నిర్వహించనున్నట్లు విమల సాహితీ సమితి అధ్యక్షులు డాక్టర్ జె. విద్యాధర్ రావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సభలో కొలుకలూరి ఇనాక్, నిఖిలేశ్వర్, ఏనుగు నరసింహారెడ్డి, రూప్‌కుమార్ డబ్బీకార్, జి.వి. రత్నాకర్, బిక్కి కృష్ణ, శైలజామిత్ర మొదలయినవారు ప్రసంగిస్తారు. కవులు తమ కవితలని వినిపిస్తారు.

వచన కవితా సంపుటాలకు ఆహ్వానం

వెన్నెల సాహితీ సంగమం ఆధ్వర్యంలో నిర్వహించే "వెన్నెల సాహితీ పురస్కారం-2022" కు వచన కవితా సంపుటాలను ఆహ్వానిస్తున్నారు. ఆసక్తి కలిగిన వారు 2022లో ప్రచురితమైన వచన కవితా సంపుటాలను కొండి మల్లారెడ్డి, ఇం.నెం.19-61/5/C, విద్యా నగర్, రోడ్.నెం.3, మిలన్ గార్డెన్ రోడ్, కుశాల్ నగర్, సిద్ధిపేట - 502103 చిరునామాకు ఈ నెల 28 లోగా పంపవచ్చు. వివరాలకు 9652199182, 9299909516 నంబర్ల నందు సంప్రదించవచ్చు.

- పెర్కపల్లి యాదగిరి

శ్రీశైల సాంస్కృతిక సమాఖ్య అట్లాంటా కథ, కవితల పోటీలు

శ్రీశైల సాంస్కృతిక సమాఖ్య అట్లాంటా ఆధ్వర్యంలో కథలు, కవితల పోటీలు నిర్వహించనున్నారు. కథల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.30,000/-, రూ.25,000/-, రూ.20,000/-, కవితల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.15,000/-, రూ.12,000/-, రూ.10,000/- అందివ్వనున్నారు. ఆసక్తి కలిగిన వారు కథలు ఎ4లో ఆరు పేజీల నిడివి మించకుండ మార్చి 1లోగా srisailaputrinadh@ gmail.com ఈ మెయిల్‌కు పంపవచ్చని నిర్వాహకులు పేర్కొన్నారు.

బడ్జెట్ భలే గ'మ్మత్తు'గా.....

అమృత కాలమ్‌లో
అడుగు పెట్టానని అంటే
గమ్మత్తు అనిపించింది
ఒక్కసారి గుడిసె బయటికీ వచ్చి
అటు ఇటు వెదికి నా
ఎక్కడ వున్నోన్ని అక్కడే వున్నానని
ఇంటామే గిల్లి మరీ చెప్పింది..

ఆత్మ నిర్భరత అన్నప్పుడు
గుండె పొంగి పోయింది
ఇక ఎదిగి పోయినట్లే నని
సబ్కా సాత్ లో నా వికాసముందని
చీకట్లు తొలిగి పోయాయని

ఫికర్ పడకని ఆమెకు చెబితే
ముందు పొయ్యి మీది సంగతి చూడమంది ...

తలసరి ఆదాయం
లక్షలు దాటింది అన్నప్పుడు
ఈ పూట కూలికి వెళ్ళబుద్ధి కావట్లేదు
బడ్జెట్ వార్త తిప్పి తిప్పి చదువుతుంటే
పైసలన్నీ మన కోసమే అంటే
ధన్ మని వురికొచ్చి
పార చేతికిచ్చి వెన్ను చరిచింది.....

బడ్జెట్ రోజు న
భలే గమ్మత్తుగా వుంటాది
ఏ మాట కా మాటే
కనికట్టు చేయడానికి ఎంత కష్ట పడ్డారో.....

- దాసరి మోహన్, 9985309080

మార్పులకు కంగారుపడొద్దు



గర్భం ధరించిన తర్వాత శరీరంలో ఎలాంటి మార్పులు చోటుచేసుకుంటాయో.. అలాగే ప్రసవానంతరం కూడా శారీరకంగా కొన్ని మార్పులు రావడం సహజం. అయితే తొలిసారి బిడ్డకు జన్మనిచ్చిన వారిలో చాలామంది ఇలాంటి మార్పులు జరగడం వల్ల కంగారు పడుతుంటారు. కానీ ప్రసవం తర్వాత జుట్టు రాలిపోవడం, కాళ్లలో వాపు, వక్షోజాల్లో పెరుగుదల.. వంటి పలు శారీరక మార్పులు సహజమేనని, అందుకు పెద్దగా కంగారు పడాల్సిన అవసరం లేదంటున్నారు ఆరోగ్య నిపుణులు. ఇవన్నీ కొన్ని రోజుల వరకు కొనసాగి, ఆ తర్వాత పరిస్థితి సాధారణమవుతుందంటున్నారు. మరి బిడ్డకు జన్మనిచ్చిన తర్వాత తల్లి శరీరంలో జరిగే ఆ మార్పులేంటో తెలుసుకుందాం...

- ప్రసవం తర్వాత కలిగే శారీరక మార్పుల్లో బ్లీడింగ్ ఎక్కువగా అవడం కూడా ఓ భాగమే. బిడ్డకు జన్మనిచ్చిన తర్వాత దాదాపు రెండు మూడు వారాల వరకు ఎక్కువ మొత్తంలో బ్లీడింగ్ అవుతుందని నిపుణులు చెబుతున్నారు. గర్భంలో నుంచి బిడ్డ బయటికి వచ్చిన తర్వాత అందులోని మలినాలు, మిగిలిన వ్యర్థ పదార్థాలన్నీ రక్తం రూపంలో బయటికి వెళ్లిపోయి గర్భసంచి శుభ్రపడడమే ఇందుకు కారణం. ఇక ఆ తర్వాత మళ్లీ నాలుగైదు నెలలు లేదంటే ఆరు నెలల అనంతరం మహిళల్లో నెలసరి ప్రారంభమవడం గమనించవచ్చంటున్నారు వైద్యులు. కాబట్టి ఈ సమయంలో బ్లీడింగ్ ఎక్కువవుతోందని భయపడకుండా నిపుణుల సూచనలు శ్రద్ధగా పాటిస్తే మేలని సూచిస్తున్నారు.
- ప్రసవం తర్వాత మలబద్ధకం, మూత్రవిసర్జన సమయంలో మంట.. వంటి సమస్యలు కూడా చాలామందికి ఎదురవుతుంటాయి. కాబట్టి ఈ సమయంలో నీరు, పండ్ల రసాలు, పాలు.. వంటి ఫైబర్ అధికంగా ఉండే ఆహార పదార్థాలు తీసుకోవడం వల్ల సమస్యను సత్వరమే తగ్గించుకోవచ్చంటున్నారు.
- బిడ్డకు జన్మనిచ్చిన తర్వాత దాదాపు ఆరువారాల వరకు శరీరంలో శక్తి స్థాయిలు తగ్గుతాయి. అలాగే రాత్రుళ్లు చెమటలు పట్టడం, కాస్త ఒత్తిడి.. వంటివి కూడా గమనించవచ్చు. మరి వీటన్నింటి నుంచి త్వరగా బయటపడాలంటే నిపుణుల సలహాతో ద్రవపదార్థాలు ఎక్కువగా తీసుకోవడం, సమతులాహారం తినడం.. వంటివి చేయడం ఉత్తమం.
- అలాగే కాళ్లు, పాదాల్లో వాపు రావడం కూడా ప్రసవం తర్వాత ఎక్కువమందిలో గమనించవచ్చు. అయితే డెలివరీ తర్వాత బరువు తగ్గే క్రమంలో ఈ వాపు నెమ్మదిగా తగ్గిపోతుంది.
- గర్భంలో నుంచి బిడ్డ బయటికి వచ్చిన తర్వాత పొట్ట తిరిగి నాజూగ్గా తయారవడానికి కాస్త సమయం పడుతుంది. అంతవరకు పొట్ట కాస్త ఎత్తుగానే కనిపిస్తుంది. అంతేకాదు.. గర్భధారణ సమయంలో చర్మం క్రమంగా సాగుతుంది. అలాగే ప్రసవానంతరం సాగిన చర్మం ముడుచుకోకుండా (స్ట్రెచ్ మార్క్స్) రూపంలో చర్మంపై కనిపిస్తాయి. కాబట్టి పొట్ట తగ్గించుకోవడానికి నిపుణులు సూచించిన బెల్టును ధరించడంతో పాటు వైద్యుల సూచనల మేరకు (స్ట్రెచ్ మార్క్స్) పోగొట్టుకోవడానికి సరైన చిట్కాలు పాటిస్తూ, తగిన వ్యాయామాలు చేయడం కూడా ఎంతో అవసరం. తద్వారా ఈ శారీరక మార్పును త్వరగా కవర్ చేసుకోవచ్చు.

సముద్రతీర ప్రాంతాల్లో కొబ్బరి, తాటి చెట్లు విపరీతంగా పెరుగుతాయి. కొబ్బరి చెట్టులోని ప్రతి భాగమూ మనకు ఉపయోగపడేదే. అనారోగ్యంగా ఉన్నప్పుడు కొబ్బరినీరే పుష్టికరమైన ఆహారం. కొబ్బరి గుజ్జును ఇంట్లోని ఆహార పదార్థాలన్నింటిలో ఉపయోగిస్తారు. కొబ్బరి చెట్టు కాండాన్ని ఇంటి కలపగా ఉపయోగిస్తారు. కొబ్బరి ఆకుల్ని పందిళ్ళు వేయడానికి, ఆకులోని ఈనెల్ని చీపుర్లుగా వాడుకోవడానికి ఉపయోగిస్తారు. "కోకాస్ న్యూసిఫెరా" అనే శాస్త్రీయనామం కలిగిన కొబ్బరి చెట్టులోని కొమ్మరెమ్మ ఆకు కాయ అన్నీ ప్రజలు వాడుకునేవే. కొబ్బరి చెట్టు ముప్పైమీటర్ల ఎత్తు వరకు పెరుగుతుంది. సముద్ర ప్రాంతాల్లో ప్రతి ఇంట్లో నాలుగైదు కొబ్బరి చెట్లుంటాయి. కొబ్బరి నీళ్ళలో పొటాషియం, సోడియం వంటి ఖనిజాలుంటాయి. డయేరియా వంటి జబ్బుల్లోనూ, శరీరంలో డీహైడ్రేషన్ ఏర్పడినప్పుడు కొబ్బరి నీరు ఎక్కువగా వాడతారు. భారతదేశంలో కేరళ రాష్ట్రం కొబ్బరి కాయల ఉత్పత్తిలో ప్రథమ స్థానంలో ఉన్నది.

నేర్చుకుందాం

కొబ్బరాకుల కళాకృతులు

మా ఇంట్లో నాలుగు కొబ్బరి చెట్లుండేవి. మా చిన్నతనంలో కొబ్బరి ఆకులతో బూరలు, వాచీలు, ఉంగరాలు తయారు చేసి పెట్టుకునే వాళ్ళం. మా బంధువులందరి ఇళ్లలోనూ కొబ్బరి చెట్లుండేవి. పిల్లలందరికీ వీటితో బొమ్మలు చెయ్యటమే పని. కొబ్బరి చెట్టు ఆకుల మధ్యలో మెత్తగా పొడిలాంటిది అతుక్కుని ఉండేది. దాన్ని తీసుకొని నెమలి ఫించాలకు మేత అని పుస్తకాలలో పెట్టుకునే వాళ్ళం. ఆ మేత తిని నెమలి ఫించం పెద్దగా పెరుగుతుందని నమ్మకం. మా అమ్మ, పెద్దమ్మలు కొబ్బరాకులతో చిలకలను తయారు చేసేవారు. అదే తయారీని చూసి పిల్లలంతా వైరుతో చిలకలను అల్లేవాళ్ళం. సరే ఇప్పుడు కొబ్బరాకులతో కొన్ని బొమ్మలు తయారు చేద్దాం..

చిలకమ్మను చేద్దాం




కొబ్బరాకులలో ఈనెను వదిలి ఆకును కత్తిరించుకోవాలి. మధ్య ఈనెను వదిలేస్తే రెండు కొబ్బరాకులు వస్తాయి. ఆ రెండు ఆకులను ఉపయోగించి చిలకను చెయ్యాలి. ఒక ఆకును మడిచి క్రాస్‌గా పట్టుకుని రెండో ఆకును క్రాస్ చుట్టూతా తిప్పి కిందకున్న తోకలు మధ్యలో నుంచి దూరిస్తే ఒక ముడి వలె వస్తుంది. అయితే దాన్ని గట్టిగా లాకుండా కొద్దిగా వదులుగా ఉంచితే చిలక శరీరం తయారవుతుంది. శరీరానికి వెనక వైపున్న ఆకుల్ని తోకలా సన్నగా కత్తిరించి మిగతాది తీసేయాలి. శరీరానికి ముందు వైపున్న దాన్ని తలలా కత్తిరించి కన్ను గీసుకోవాలి. ఇలా కొబ్బరాకుల చిలకను చేయవచ్చు.

అమ్మాయి, అబ్బాయి బొమ్మ



కొబ్బరాకులతో చాపలు, బుట్టలు, ద్వారానికి తోరణాలు ఇలా ఎన్నో చేసేవారు. గతంలో పెండిండ్లకు అంటే కొబ్బరాకుల పందిళ్ళదే హవా. కొబ్బరాకుల స్తంభాలు కట్టి పైన కొబ్బరాకులు కప్పి నాలుగు వైపులా చిలకలు, బాతులతో తోరణాలు వేలాడదీసి అద్భుతంగా అల్లేవారు. ఆడపిల్లలయితే పెండ్లి కూతురు పెండ్లి కొడుకు బొమ్మలు తయారు చేసి బొమ్మల పెండ్లి చేస్తూ ఆనందపడే వారు. మా అమ్మ మా నాయనమ్మ కొబ్బరాకుల బుట్టలు చిన్నవి తయారు చేసి ముగ్గులేసుకునే నాము పెళ్ళలు పెట్టి గూట్లో పెట్టేవారు. నేను పెండ్లి కూతురు, పెండ్లి కొడుకు బొమ్మలు చేసి ఆటలాడుకున్నాను. ఆ బొమ్మలే ఈ తరానికి పరిచయం చేద్దాం. కొబ్బరాకులోని ఈనెను తీసేసి పొడుగ్గా ఉన్న ఆకును పక్కనుంచుకోవాలి. మధ్యలోని ఈనెను తీసేస్తే రెండు ముక్కలు అవుతాయి. రెండు ముక్కలు ఒకదానికొకటి క్రాస్‌గా పెట్టి వెనక్కి ముందుకి చుట్టాలి. కొద్దిగా చుట్టాక పొడుగైన ఆకును పైకి పోనిచ్చి తల భాగాన్ని తయారు చేయాలి. కిందికి కాళ్ళను చేయాలి. అడ్డంగా ఉన్న ఆకుతో చేతులు పెట్టాలి. ఇది అబ్బాయి బొమ్మ అమ్మాయి బొమ్మకైతే జడ పెట్టాలి అంతే. తల భాగంలో కండ్లు, ముక్కు, నోరు పెట్టాలి. ఇంట్లో మిగిలిన వస్త్రపు ముక్కలతో అమ్మాయికి చీర, జాకెట్టు చుట్టాలి. అబ్బాయికి పంచె, కండువా కట్టాలి. రెండింటినీ పెట్టి పెండ్లి వేడుక చేసి సంతోషపడేవారు. బాగున్నాయా..!

ద్వారానికి తోరణాలు



కొబ్బరాకు అంటే చాలా పెద్దగా ఉంటుంది కదా! మధ్యలో పెద్ద కాడకు అటూ ఇటూ ఎన్నో సన్నని రిబ్బన్లలాగా ఉంటాయి. సన్నని రిబ్బన్ల లాంటి నాలుగు ఆకులు కోసుకుంటే చాలు. ద్వారానికి రెండు వైపులా అటు రెండు ఇటు రెండు తగిలిస్తే బాగుంటుంది. ఈ ఆకుకు మధ్య ఈనెను తీసేయకూడదు. బారెడు పొడుగున ఉండే ఈ ఆకుకు అక్కడక్కడా చిన్న గాట్లు పెట్టాలి. గాట్ల దగ్గర ఆకును చీల్చి మడవాలి. రెండు వైపుల ఆకుల్ని అటుదిటు, ఇటుదటు పోనిచ్చి ముడేయాలి. ఇలా బారెడు పొడవు పుల్లలో ఐదారు మడుల్లాగా వస్తాయి. ఇలా కాకుండా మొదటనే ఈనె మొత్తం తీసేసి ఆకులు విడిగా చేయాలి. చిన్న చిన్న ముక్కలుగా కత్తిరించుకుని పక్కన పెట్టాలి. ఇప్పుడీ ముక్కలకు చివర్న రెక్కలుగా కత్తిరించాలి. రెండు ముక్కలను క్రాస్‌గా పెట్టి ఈనెతో గుచ్చాలి. ఒక ఈనెకు నాలుగైదు ఆకుల పువ్వుల్ని గుచ్చి తోరణాలు చేయాలి. ఈ ఆకు పచ్చని తోరణాలను వాకిలికి అమర్చుకుంటే బాగుంటుంది.

మిడతను చేద్దాం



కొబ్బరి చెట్లు వంద సంవత్సరాలు బతికి ఉంటాయి. ఏడు సంవత్సరాల నుంచి పూతకు వస్తుంది. కాండం పగుళ్ళు పగుళ్ళుగా, బిరసుగా ఉంటుంది. నేను ఈ కాండం మీద ఏర్పడే అనేక చిత్రాలను ఫొటోలు తీశాను. బెరడు ఊడిపోతూ, గీతలతో పగుళ్ళతో అందమైన ఆకృతులు ప్రకృతి సిద్ధంగా ఏర్పడతాయి వాటిలో పెద్ద పెద్ద రాజకోటలు, భవనాలు, గుహలు ఆకారాల్లో కనిపించాయి. వాటిని చక్కని ఫొటోలు తీసి ఎగ్జిబిషన్లు పెట్టాను. మనం మిడతను ఎలా తయారు చేయాలో చూద్దాం. నేనిది 'ఓరిగామి'లో మడతల్ని చూసి కొబ్బరాకుతో ప్రయత్నించాను. దీనికి ఈనె తీసివేయకుండా ఉంచాలి. అటూ ఇటూ ఆకును కొద్దిగా చీల్చి అటు ఆకును ఇటువైపు, ఇటు ఆకును అటు వైపుకు పెట్టి జడ అల్లకంలా అల్లాలి. ఇది మిడత శరీరం అవుతుంది. ఈనెను మిడత కాళ్ళ వలె చూపించాలి. రెక్కలకు ఆకును చుట్టాలి. పొలల్లో చెట్ల మీద వాలే ఆకుపచ్చ మిడత తయారవుతుంది.

ఫ్లవర్ బొకే

దీని కోసం ఆరు దళాల పుష్పం లేదా



హృదయాకారంలను తయారు చేసుకోవాలి. ఇలా ఐదారు చేసుకుని రంగులు వేసుకుంటే కొత్తరకంగా ఉంటుంది. ఇలా చేసుకున్న హృదయాలను పల్లకు గుచ్చి పెట్టుకోవాలి. తర్వాత ఈనె తీసేసిన కొబ్బరాకులను క్రాస్‌గా మడిచి ఉంచాలి. ఇవి రెండు మూడు చేసి ఉంచుకోవాలి. కొన్ని ఆకులను మడిచి పాములా చేసి పెట్టుకోవాలి. దీన్ని మా చిన్నప్పుడు పాము అని ఆడుకునే వాళ్ళం. కొన్ని ఆకుల్ని కొద్దిగా మెలితిప్పి ఉంచాలి. వీటన్నింటినీ కలిపి ఒక ఫ్లవర్‌వేజ్‌లో పెడితే అందమైన పూల కుండీ తయారవుతుంది.

– డాక్టర్ కందేపి రాణీప్రసాద్

ఇట్ల చేద్దాం



నిమ్మరసంలోని సిట్రికామ్లం పాత్రలకు అంటుకున్న పదార్థాల వాసనను దూరం చేయడంలో మరింత సమర్థంగా పనిచేస్తుంది. ఇందుకోసం నిమ్మచెక్కతో ఆ పాత్రను ఓసారి రుద్ది.. ఆపై సబ్బునీటితో కడిగేయాలి.

దేశాభివృద్ధికి ప్రజారవాణా జీవనాడి

(మొదటిపేజీ తరువాయి)

నివేదికను ప్రవేశపెట్టారు. అనంతరం లక్ష్మయ్య మాట్లాడుతూ..కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న నయా ఉదార విధానాలను మొదట ప్రయోగించింది ప్రజా రవాణా రంగంపైన్నేనని తెలిపారు. అందులో భాగంగానే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్టీసీ సంస్థలకు ఇచ్చే మూలధన పెట్టుబడిని నిలిపివేశాయని తెలిపారు. వాటిని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ప్రయివేటు బస్సు ఆపరేటర్లకు లబ్ది చేకూర్చటం కోసం ఆర్టీసీ బస్సులను కుదిస్తూ పోతున్న తీరును ఆయన వివరించారు. ఆర్టీసీపై కోవిడ్ ప్రభావం కూడా పడిందని చెప్పారు. మోడీ ప్రభుత్వం ప్రజా రవాణా వ్యవస్థను మొత్తానికి మొత్తంగా ప్రయివేటు గుత్త కంపెనీలకు(ఊబర్, ఓలా, తదితరాలకు) అప్పగించడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నదని విమర్శించారు. అందులో భాగంగానే మోటారు వాహనాల చట్టం-2019 తీసుకొచ్చిందన్నారు. విద్యుత్ బస్సులను తీసుకురావడం, బల్క్ డీజిల్ సప్లయ్‌పై భారాన్ని మరింత మోపడం, ఒకేదేశం-ఒకే పర్మిట్ విధానం తేవడం, ప్రయాణికులపై విపరీత చార్జీల భారం, ఆర్టీసీ సిబ్బందిపై విపరీత పనిభారం మోపడం, కొత్తకొత్త విధానాలు తీసుకురావడం వంటి చర్యలన్నీ ప్రయివేటీకరణ దిశగా వేస్తున్న అడుగుల్లో భాగమేనని విమర్శించారు. ప్రజారవాణా వ్యవస్థను దెబ్బతీయడం అంటే పర్యావరణ సమస్యలను ఏరికోరి తెచ్చుకోవడమేనని చెప్పారు. అర్ముద నయనార్ మాట్లాడుతూ.. ప్రజలకు తక్కువ ఖర్చుతో భద్రతతో కూడిన ప్రయాణం అందించేందుకే ఎస్‌టీయూలు ఏర్పడ్డాయని గుర్తుచేశారు. దేశవ్యాప్తంగా అవి సంక్షోభంలో ఉన్నాయనీ, వాటి పరిరక్షణ కోసం, సిబ్బంది హక్కుల కోసం జాతీయ స్థాయిలో ఐక్య ఉద్యమ నిర్మాణం దిశగా అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. దేశంలోని 90 శాతం ప్రయాణికులు రోడ్డు మార్గం ద్వారానే ప్రయాణిస్తున్నారనీ, 60 శాతం సరుకు రవాణా కూడా ఇదే మార్గం ద్వారా కొనసాగుతున్నదని వివరించారు. దేశంలో ఏటా లక్షన్నర మంది చనిపోతున్నారనీ, ప్రయివేటు వాహనాల ప్రమాదాల్లోనే మరణాలు ఎక్కువగా ఉంటున్నాయని వివరించారు. ప్రజారవాణా రంగంపై ఖర్చుపెట్టే ప్రతి డాలర్ కూడా జీడీపీని నాలుగు డాలర్లకు పెంచుతుందంటూ వరల్డ్ ఎకనామిక్ సెంటర్ నొక్కి చెబుతున్న విషయాన్ని ప్రస్తావించారు. గ్లోబల్ వార్మింగ్‌ను ఎదుర్కోవడానికి, ప్రమాదాలను తగ్గించడానికి ఏకైక మార్గం ప్రజా రవాణా వ్యవస్థను బలోపేతం చేయడమేనన్నారు. ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ జాతీయ కార్యదర్శి వీఎస్‌రావు మాట్లాడుతూ..ఆర్టీసీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహాయం చేయాలనీ, సబ్సిడీలను తిరిగి చెల్లించాలని కోరారు. ఈ మీటింగ్‌లో ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వీరాంజనేయులు, ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ కోశాధికారి హరిక్రిష్ణన్, కార్యదర్శులు వినోద్, కొప్పుస్వామి, ఇంద్రకుమార్ బందానా, జాతీయ నాయకులు పి.రవీందర్‌రెడ్డి, 27 రాష్ట్రాల నుంచి 100 మంది ప్రతినిధులు పాల్గొన్నారు.

డిమాండ్లు ఇవే...

- ఆర్టీసీ చట్టం 1950 ప్రకారం మూలధన పెట్టుబడిని పునరుద్ధరించాలి.
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్‌లో నిధులు కేటాయించాలి.
- డీజీల్‌పై ఎక్సైజ్ సుంకం, అమ్మకం పన్ను నుంచి ఎస్టీయూఎస్‌లను మినహాయించాలి.
- ఆర్టీసీ బస్సులకు టోల్ చార్జీల నుంచి మినహాయింపునివ్వాలి.
- విద్యుత్ బస్సుల నిర్వహణ బాధ్యతను ఆర్టీసీలకే అప్పగించాలి.
- ప్రజా రవానా వాహనాలకు రోడ్లపై ప్రత్యేక లైన్లు ఏర్పాటు చేయాలి.

ఓటర్ల సంఖ్య 94.50 కోట్లు

(మొదటిపేజీ తరువాయి)

శాతం 67శాతం నమోదైంది. దాదాపు 30కోట్లమందికిపైగా ఓటర్లు ఓటింగ్‌కు దూరమున్నారని ఈ గణాంకాలు చెబుతున్నాయి. 2014 సార్వత్రిక ఎన్నికల సమయానికి ఓటర్ల సంఖ్య 83.40 కోట్లకు చేరుకుంది. ఇందులో 66.44శాతం మంది ఓటేశారు. ఈ ఏడాది రాజస్థాన్, కర్నాటక, మధ్యప్రదేశ్ సహా కీలక రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు జరగబోతున్నాయి. ఓటింగ్ శాతాన్ని పెంచే చర్యలపై కేంద్ర ఎన్నికల సంఘం సమాలోచనలు జరుపుతోంది. వలస కార్మికులు, కూలీలు పోలింగ్ సమయంలో ఓటేయలేక పోతున్నారని, 'రిమోట్ ఓటింగ్' సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించటం ద్వారా ఓటింగ్ శాతాన్ని పెంచొచ్చని కేంద్ర ఎన్నికల సంఘం ప్రతిపాదించింది.

రైతు రాజ్యం రావాలే..!



(మొదటిపేజీ తరువాయి)

బీఆర్‌ఎస్ బహిరంగ సభ ఆదివారం జరిగింది. ఈ సభకు సీఎం కేసీఆర్ హాజరై ప్రసంగించారు. బీఆర్‌ఎస్ ఏర్పాటు తర్వాత ఇతర రాష్ట్రంలో బహిరంగ సభ ఏర్పాటు చేయడం ఇదే మొదటిసారి. మొదట నాందేడ్‌కు చేరుకున్న సీఎం కేసీఆర్.. గురుద్వారాలో ప్రార్థనలు చేశారు. అనంతరం సభా వేదికకు వచ్చారు. మొదట స్థానిక నాయకులకు బీఆర్‌ఎస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ప్రసంగానికి ముందు వేదికపై ఏర్పాటు చేసిన ఛత్రపతి శివాజీ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్, జ్యోతిబాపూలే తదితర మహనీయుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బహిరంగ సభను ఉద్దేశించి ప్రసంగించారు.

దేశంలో గుణాత్మక మార్పు రావాలని, పరిపాలన విధానం మారాలని అన్నారు. 75 ఏండ్లలో ఎంతోమంది పెద్ద పెద్ద నాయకులు పీఎంలు, సీఎంలు అయ్యారని, కానీ నేటికీ వ్యవసాయానికి సాగునీరు, ఉచిత కరెంటు ఎందుకు ఇవ్వలేకపోయారని ప్రశ్నించారు. మహారాష్ట్రలో అత్యధికంగా రైతు ఆత్మహత్యలు ఎందుకు జరుగుతున్నాయో ఆలోచించాలని సూచించారు. దేశానికి అన్నం పెట్టే రైతన్న పండించిన పంటకు మద్దతు ధర రాక, పెట్టుబడులు పెరిగి అప్పులు పెరుగుతుండటంతో దిక్కుతోచని స్థితిలో ఆత్మహత్య చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పార్లమెంటులో, అసెంబ్లీల్లో గంభీర ప్రసంగాలు, ఉపన్యాసాలు దంచికొట్టే నాయకులు ఆత్మహత్యలను ఎందుకు నిలువరించడం లేదని ప్రశ్నించారు. దీన్ని రైతులు అర్థం చేసుకోవాలని, రైతులు ధర్మం పేర, రంగురంగుల పార్టీల జెండాల పేర, మతం పేర విడిపోకుండా ఐక్యమైతేనే దీనికి పరిష్కారం దొరుకుతుందని స్పష్టంచేశారు. దేశంలో రైతులు, రైతు కూలీల జనాభా 50 శాతం కన్నా ఎక్కువ ఉందని, కేంద్రంలో ప్రభుత్వ ఏర్పాటుకు ఇంతకంటే ఎక్కువ అవసరం లేదని అన్నారు. ఎమర్జెన్సీ విధిస్తే జేపీ నారాయణ పిలుపుతో దేశమంతా ఒక్కటై అప్పటి మహామహా నేతలనే కూకటివేళ్లతో పెకిలించివేశారని గుర్తుచేశారు. అదే విధంగా.. రైతులు నాగళ్లే కాదు.. పెన్నులు పట్టి చట్టాలు చేసేలా మరోసారి చైతన్యవంతులు కావాలని పిలుపునిచ్చారు. దేశంలో సంపత్తికి కొదవ లేదని, కానీ అది ప్రజలకు చేరడం లేదని చెప్పారు. దేశంలో 50 శాతం వ్యవసాయాధిరిత భూమి ఉందని, కానీ సాగునీరు అందించలేకపోతున్నారని వాపోయారు. కేంద్ర గణంకాల ప్రకారం ప్రతియేటా 50 వేల టీఎంసీల నీరు సముద్రంలో కలుస్తుంటే కేంద్రంలోని నేతలు తమాషా చూస్తున్నారని ఆరోపించారు. మహారాష్ట్రలో కృష్ణ, గోదావరి, పెన్‌గంగ, మంజీరా, ఇంద్రావతి, ప్రాణహిత తదితర నదులు ప్రవహిస్తున్నా.. బొగ్గు నిక్షేపాలున్నా.. ఇక్కడి రైతులకు సాగు నీరు, కరెంటు లభించడం లేదని వాపోయారు. రిజర్వాయర్లు నిర్మించలేని కేంద్ర సర్కారు.. ట్రిబ్యునళ్ల పేరిట కాలయాపన చేస్తున్నదని ఆరోపించారు. ప్రధానికి రైతులంటే గౌరవం లేదని కేసీఆర్ స్పష్టం చేశారు. 13 నెలల పాటు దేశ రాజధాని సరిహద్దుల్లో రైతులు ధర్నా చేస్తే ఒక్క మాట కూడా మాట్లాడలేదని, 750 మంది రైతులు చనిపోతే కనీసం ఆరా తీయరా అని ప్రశ్నించారు. రైతు ఆత్మహత్యలు ఆగాలన్నా, తాగు, సాగునీరు లభించాలన్నా, నాణ్యమైన ఉచిత కరెంటు రావాలన్నా రైతు సర్కారుతోనే సాధ్యమని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణలో అమలు చేస్తున్న ఉచిత కరెంటు, రైతుబంధు, రైతుబీమా, దళితబంధు, గొర్రెల పంపిణీ పథకాలను వివరించారు. మహారాష్ట్రలోనూ తెలంగాణ పథకాలు అమలు కావాలంటే 'గులాబీ జెండా' ఎత్తాలని పిలుపునిచ్చారు. మహారాష్ట్రలో గులాబీ సర్కారును తీసుకొస్తే.. రెండేండ్లలో 24 గంటల పాటు ఉచిత నాణ్యమైన కరెంటు అందజేస్తామని చెప్పారు. ఈ బహిరంగ సభకు ఎమ్మెల్సీ కవిత, ఎమ్మెల్యేలు బాల్క సుమన్, మైనంపల్లి హన్మంతరావు తదితరులు హాజరయ్యారు.

వర్గ పోరాటాల కేంద్రంగా సీఐటీయూ కార్యాలయం

(మొదటిపేజీ తరువాయి)

పూర్వ ప్రధాన కార్యదర్శి ఆర్ సుధాభాస్కర్ మాట్లాడుతూ కార్మికోద్యమాలకు నాయకత్వం వహిస్తున్న సీఐటీయూ..నూతన భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టటం సముచితమేనన్నారు. కార్యక్రమంలో ఏఐఐఈఏ పూర్వ ప్రధాన కార్యదర్శి కె వేణుగోపాల్, ఏఐడీఈఎఫ్ జాయింట్ సెక్రటరీ జీటి గోపాల్‌రావు, సీజీ కాన్ఫడరేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె నాగేశ్వర్‌రావు, అజీజ్, ఎస్‌సీజెడ్ఐఈఎఫ్ జోనల్ జనరల్ సెక్రటరీ కె రవీంద్రనాథ్, ఎల్ఐసీ నాయకులు జి తిరుపతయ్య, జీఐసీ నాయకులు వై సుబ్బారావు, రైల్వే యూనియన్ నాయకులు శివకుమార్, పెన్షనర్స్ యూనియన్ నాయకులు ఎంఎస్‌రెడ్డి,ఐలు జాతీయ ఉపాధ్యక్షులు కె పార్థసారధి, పట్నం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డీజీ నర్సింహారావు, సీఐటీయూ సీనియర్ నాయకులు పి రాజారావు, నవతెలంగాణ చీఫ్ జనరల్ మేనేజర్ పి ప్రభాకర్, సీఐటీయూ ఆఫీసు బేరర్లు ఎస్ వీరయ్య, జె వెంకటేశ్, ఎస్‌వీ రమ, భూపాల్, పి జయలక్ష్మి, జె మల్లిఖార్జున్, కళ్యాణం వెంకటేశ్వరరావు,పద్మశ్రీ, వంగూరు రాములు, టి వీరారెడ్డి, జె చంద్రశేఖర్, బి మధు, బీరం మల్లేశ్,ముత్యం రావు, రాగుల రమేశ్, ఎం వెంకటేశ్, టి రాజారెడ్డి, పి శ్రీకాంత్, కూరపాటి రమేశ్,గోపాలస్వామితో పాటు వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధ్యక్షులు బుర్రి ప్రసాద్, సీనియర్ నాయకులు పీఎస్ఎన్ మూర్తి, ఎం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పౌర హక్కులను కాలరాయటమే

(మొదటిపేజీ తరువాయి)

ప్రధాన బాధ్యుడు ఆనాటి రాష్ట్ర సీఎంగా ఉన్న నరేంద్రమోడీ..అని బీబీసీ డాక్యుమెంటరీ విశ్లేషించింది. రెండు భాగాలుగా ఈ డాక్యుమెంటరీ రూపొందగా, వీటి ప్రసారాలు భారత్‌లో మోడీ సర్కార్ నిషేధించింది. ఈ వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వ తీరును విమర్శిస్తూ శాస్త్రవేత్తలు, విద్యావేత్తలు ఆదివారం ఒక బహిరంగ ప్రకటన విడుదల చేశారు. ఐఐఎస్‌కు చెందిన అరిత్రా ఛటర్జీ, బిట్స్ పిలానీకి చెందిన కింజాల్ బెనర్జీ, కేంబ్రిడ్జ్ వర్సిటీకి చెందిన రోణాక్ సోని..మొదలైనవారు ఉన్నారు. డాక్యుమెంటరీ ప్రసారాలను అడ్డుకోవటం భారత పౌరుల ప్రాథమిక హక్కులను కాలరాయటంగా వారు పేర్కొన్నారు. సమాజం, ప్రభుత్వానికి చెందిన ముఖ్య సమాచారం అందుబాటులో లేకుండా, దానిపై చర్చించకుండా చేయటమే మోడీ సర్కార్ లక్ష్యమని విద్యావేత్తలు, శాస్త్రవేత్తలు ఆరోపించారు. ప్రకటనలో వారు పేర్కొన్న వివరాలు విధంగా ఉన్నాయి. డాక్యుమెంటరీ ప్రదర్శనను అడ్డుకునేందుకు పలు విశ్వవిద్యాలయాల యాజమాన్యం తీసుకున్న నిర్ణయం కూడా సరైంది కాదు. ఇది విద్యా స్వేచ్ఛ సూత్రాలను ఉల్లంఘిస్తోంది. సామాజిక, రాజకీయ సమస్యలపై బహిరంగ చర్చలను వర్సిటీలు ప్రోత్సహించాలి.

ప్రజాస్వామ్య సమాజం సక్రమంగా పనిచేయడానికి ఇలాంటి చర్చలు చాలా కీలకం. యూనివర్సిటీలు ప్రభుత్వాన్ని విమర్శిస్తున్నందున అభిప్రాయాల వ్యక్తీకరణను అడ్డుకోవటం ఆమోదయోగ్యం కాదు.

జవాబుదారీ ఎవరు?

జవాబుదారీ ఎవరు వహిస్తారన్నది తేలకపోతే, దేశంలో మరిన్ని మత ఘర్షణలు చెలరేగే ప్రమాదముంది. మత ఘర్షణలు, మత విద్వేషాన్ని అడ్డుకోవాలంటే గుజరాత్ 2002 మారణకాండ బాధ్యులెవరన్నది తేలాలి. మత ఏకీకరణతో దేశాన్ని రెండుగా విభజించే శక్తుల్ని ఎదుర్కోవటం చాలా ముఖ్యం. మత ఘర్షణలకు జవాబుదారీ ఎవరు ? అని డాక్యుమెంటరీ ప్రశ్నిస్తోంది. ఈనేపథ్యంలో బీబీసీ డాక్యుమెంటరీ లేవనెత్తిన ప్రశ్నలు అత్యంత ముఖ్యమైనవి. డాక్యుమెంటరీపై నిషేధం విధించటం ద్వారా బాధితుల గొంతును కేంద్రం అణచివేసింది. గుజరాత్ అల్లర్లపై విశ్వసనీయ సమాచారం అందుబాటులో ఉంది, ఆనాటి భయంకర ఘటనలపై సామాజిక, హక్కుల కార్యకర్తలు కీలక పత్రాలు విడుదల చేశారు. వీటిని చదవాలని బీబీసీ డాక్యుమెంటరీ చూసిన వీక్షకుల్ని శాస్త్రవేత్తలు, విద్యావేత్తలు కోరారు.

ఉత్తరాఖండ్ రిక్రూట్‌మెంట్ కేసు బీజేపీ నేత అరెస్టు

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వం మరో వివాదంలో చిక్కుకుంది. ఉత్తరాఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన జూనియర్ ఇంజనీర్ (జేఈ), అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ) పరీక్ష పేపర్ లీక్ కేసులో బీజేపీ మండల్ ప్రెసిడెంట్ సంజయ్ ధరివాల్ ప్రధాన నిందితుడిగా కేసు నమోదైంది. అతడితోపాటు మరో 9మంది ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. సంజయ్ ధరివాల్ మధ్యవర్తిగా వ్యవహరించాడని, ఈ కేసులో నిందితులుగా ఉన్న 9మంది వెనుక రూర్కీకి చెందిన మరో బీజేపీ నాయకుడు ఉన్నాడని తెలిసింది. ఈ కేసు వివరాల్ని ఎస్ఎస్‌పీ హరిద్వార్ అజయ్ సింగ్ మీడియాకు తెలుపుతూ, "పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన జేఈ, ఏఈ పరీక్షల్లో ప్రశ్న ప్రతాన్ని లీక్ చేశారన్నది ముఖ్యమైన ఆరోపణ. ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ముగ్గురు నిందితులు సంజీవ్‌కుమార్, నితిన్ చౌహాన్, సునీల్ సైనీలను అదుపులోకి తీసుకొని విచారణ జరిపింది. పెద్ద మొత్తంలో నగదు ,వివిధ బ్యాంకుల ఖాళీ చెక్కులు వారి వద్ద ఉన్నాయి. ఈ కేసులో బీజేపీ నాయకుడు సంజయ్ ధరివాల్ పాత్రపై పోలీసులకు పలు అనుమానాలున్నాయి" అని అన్నారు. ఈ సంగతి మీడియాలో విడుదల కాగానే ధరివాల్ తన పార్టీ పదవికి రాజీనామా చేశారు. గత కొద్ది రోజులుగా ధరివాల్ పార్టీ వ్యవహారాలకు దూరంగా ఉంటూ వస్తున్నారు. పేపర్ లీకేజీ కేసు ఉత్తరాఖండ్‌లో రాజకీయంగా తీవ్ర దుమారం రేపుతోంది. ఈ కుంభకోణంలో అధికార బీజేపీకి చెందిన నాయకులే ఉన్నారని కాంగ్రెస్ ఆరోపణలు చేస్తోంది. తాజాగా పోలీసులు మీడియాకు విడుదల చేసిన పేర్లు కూడా బీజేపీకి చెందినవారివే ఉండటంతో ఈ అంశం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. పేపర్ లీకేజీతో సంబంధమున్న హాకీం సింగ్‌ను అరెస్టు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కాంగ్రెస్ డిమాండ్ చేస్తున్న తరుణంలో బీజేపీ మండల్ ప్రెసిడెంట్ సంజయ్ ధరివాల్ పేరు తెరపైకి వచ్చింది. "ఈ కుంభకోణంలో బీజేపీ నాయకుల పాత్రను తాజా పరిణామం బయటపెట్టింది. బీజేపీకి చెందిన సీనియర్ నాయకులు ఈ పేపర్ లీకేజ్ కుంభకోణం వెనుక ఉన్నారు" అని కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి గరీమా మహారా డాసోని అన్నారు. ఈ కేసులో ఇప్పటివరకూ 54 మంది నిందితుల్ని పోలీసులు అరెస్టు చేశారు.

బాల్య వివాహాల కేసుల్లో అసోం సర్కార్ దూకుడు

చేసింది. తమ ఇష్టపూర్వకంగానే వివాహాలు జరిగాయనీ, తమవారిని విడిచిపెట్టాలని మహిళలు చేస్తున్న అభ్యర్థనలను పోలీసులు పట్టించుకోవడం లేదు. పైగా పోలీస్‌స్టేషన్ల ముందు గుమిగూడుతున్న మహిళలపై పోలీసులు లాఠీచార్జీకి దిగుతున్న ఘటనలు రాష్ట్రంలో అనేక చోట్ల చోటుచేసుకుంటున్నాయి. పోలీసుల అరెస్టులతో కుటుంబాలు విడిపోతున్నాయని బంధువులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బాల్య వివాహాల అణచివేత ప్రణాళికను అసోం ముఖ్యమంత్రి హిమంత బిస్వా శర్మ గత నెలలో ప్రకటించారు. 15 రోజుల్లో బాల్యవివాహాలపై 4,004 కేసులను పోలీసులు నమోదు చేశారనీ, ఫిబ్రవరి 3 నుంచి దీనిపై చర్యలు తీసుకుంటామని కూడా చెప్పారు. 14 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న బాలికలను వివాహం చేసుకున్న వారిపై లైంగిక నేరాల నుంచి చిన్నారుల రక్షణ (పోక్సో) చట్టం, బాల్య వివాహాల నిరోధక చట్టం 2006 కింద ఈ కేసులను నమోదు చేశారు. 14 నుంచి 18 ఏండ్ల వయస్సు ఉన్న బాలికలను వివాహం చేసుకున్న వారిపై కేసులను నమోదు చేసినట్టు అసోం ప్రభుత్వం చెబుతోంది. బాల్య వివాహం చేసుకున్న వారిని అరెస్టు చేస్తామనీ, వివాహాలు అక్రమమని ప్రకటిస్తామని తెలిపింది. వివాహం చేసుకున్న బాలుడు కూడా 14 ఏండ్ల లోపు వాడైయితే వారిని రిఫార్మ్ హౌస్‌కు పంపుతామని ప్రభుత్వం చెప్పింది. ఇప్పటి వరకూ ఈ కేసుల్లో 2,200 మందికిపై వ్యక్తులను అరెస్టు చేసింది. మైనర్లుగా పెండ్లి చేసుకుని, ఇప్పుడు పెద్దలుగా మారిపోయి, కొంత మంది పిల్లలకు తండ్రులు అయిన వారిని కూడా పోలీసులు అరెస్టు చేస్తున్నారు. అలాగే, కుటుంబాల్లో ప్రధాన సంపాదనపరుడైన వ్యక్తిని అరెస్టు చేయడంతో ఆ కుటుంబాలు వీధిన పడుతున్నాయి. బీజేపీ ప్రభుత్వం చేస్తున్న ఈ అరెస్టులపై తీవ్ర నిరసనలు వ్యక్తమవుతున్నాయి. ఈ బాల్య వివాహాలపై ఇంతకాలం ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోలేదని అనేక మంది ప్రశ్నిస్తున్నారు.

మార్చి 31వరకు స్కాలర్‌షిప్ దరఖాస్తు గడువు పెంపు

నవతెలంగాణ-సిటీబ్యూరో

పోస్టు మెట్రిక్ స్కాలర్‌షిప్‌ల కోసం దరఖాస్తు గడువును రాష్ట్ర ప్రభుత్వం పొడిగించింది. మార్చి 31వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించింది. ఇంటర్మీడియట్ ఆపై విద్యను అభ్యసిస్తున్న సాధారణ, ప్రొఫెషనల్ కోర్సులకు సంబంధించిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు 2022-23 విద్యా సంవత్సరానికి సంబంధించి తాజా, రెన్యువల్ పోస్టు మెట్రిక్ స్కాలర్‌షిప్‌ల కోసం కళాశాలలు, విద్యార్థులు టీఎస్ ఈ-పాస్ పోర్టల్‌లో తమ వివరాలు నమోదు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి పి.యాదయ్య తెలిపారు.

అర్హులైన పోస్ట్ మెట్రిక్ విద్యార్థులందరూ తమ వివరాలను ఈ-పాస్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో మార్చి 31లోపు నమోదు చేసుకోవాలని సూచించారు. సదరు దరఖాస్తుల నమోదు నిర్ణీత గడువులోగా పూర్తిచేసేందుకు ఆయా కళాశాల ప్రిన్సిపాల్స్ ప్రత్యేక చర్యలు చేపట్టాల్సిందిగా ఆయన కోరారు.

మరమ్మతుల్లో నిర్లక్ష్యం ప్రయాణీకులకు ప్రమాదం



నవతెలంగాణ-సంతోష్‌నగర్

ఐఎస్ సదన్ డివిజన్ పరిధిలోని చౌరస్తా, సంతోష్‌నగర్ రోమన్ రెస్టారెంట్ వద్ద నెల రోజులుగా డ్రైనేజీ మ్యాన్హోల్ మరమ్మతులను అసంపూర్తిగా వదిలేశారు. ధ్వంసమైన పాత మూతను తొలగించి కొత్తది పెట్టారు. ప్లాస్టరింగ్ చేయకుండా బారికేడ్లను అడ్డుగా పెట్టాలి, కానీ అంతటితో పనులు ఆపేశారు. దీంతో రద్దీ వేళల్లో ట్రాఫిక్ ఇక్కట్లు ఏర్పడుతున్నాయి. ఈ ప్రాంతంలో వీధి దీపాలు సక్రమంగా వెలగక.. ఇటుగా వెళ్లే ప్రయాణికులు ప్రమాదాల బారినపడుతున్నారు.

అర్హులందరికీ ఇండ్లు, ఇండ్ల స్థలాలు వెంటనే ఇవ్వాలి

- జాన్ వెస్లీ కేవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు





నవతెలంగాణ-తుర్కయాంజల్

అర్హులైన పేదలందరికీ ఇండ్లు, ఇండ్ల స్థలాలు, డబుల్ బెడ్ రూమ్‌లు వెంటనే మంజూరు చేయాలని కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్ వెస్లీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తుర్కయంజాల్ మున్సిపాలిటీ ప్రజా సంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో ఆదివారం తుర్కయంజాల్ రొక్కం సత్తిరెడ్డి గార్డెన్లో సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు డి.కిషన్ అధ్యక్షతన ఇళ్ల స్థలాల అర్జీదారులతో సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షులు జాన్ వెస్లీ హాజరై మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఎనిమిది సంవత్సరాలు అయినప్పటికినీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన ప్రధాన హామీలైన అర్హులైన నిరుపేదలందరికీ ఇండ్లు, ఇండ్ల స్థలాలు మరియు డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు మంజూరు చేయలేదని, అదేవిధంగా ఇంటి స్థలం ఉండి ఇల్లు నిర్మించుకోలేని పేదవారికి మూడు లక్షలు ఇస్తామని హామీ ఇచ్చినా ఇప్పటికి నెరవేర్చలేదనీ ఆగ్రహం వ్యక్తంచేశారు. జీవనోపాధి నిమిత్తం అనేక సంవత్సరాలుగా వందల కుటుంబాలకు పైగా వలస వచ్చి ఈ ప్రాంతంలోనే రేషన్ కార్డు ఆధార్ కార్డు ఓటర్ కార్డు తదితర అన్ని ఆధారాలు కలిగి ఉండి నేటికీ కిరాయి ఇండ్లలో ఉంటూ అద్దె కట్టుకోలేక తీవ్రమైన ఇబ్బందుల్లో నిరుపేదలు ఉన్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఓ వైపున ఉపాధి లేక మరోవైపున ఉండడానికి ఇల్లు లేక పేదలు నానా ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. అనేక దఫాలుగా ప్రభుత్వానికి ఇండ్లు కావాలని అర్జీ పెట్టుకున్నప్పటికి అధికారులు, ప్రభుత్వం స్పందించకపోవడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. అందుకే ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఇంటి స్థలం కోసం దరఖాస్తు పెట్టుకున్న వారికి ప్రభుత్వం వెంటనే న్యాయం చేయకపోతే ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసి పోరాటాలకు సిద్ధమవుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అందులో భాగంగానే అసెంబ్లీ సమావేశాలు నడుస్తున్న ఈ తరుణంలో ఫిబ్రవరి 9వ తేదీన ప్రజాసంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో హైదరాబాదులోని ఇందిరాపార్క్ దగ్గర ఇండ్ల స్థలాల కోసం పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమాన్ని చేపట్టామని ఈ కార్యక్రమానికి ఇండ్లు, ఇళ్ల స్థలాల కోసం అర్హులైన పేదలందరూ వేలాదిగా రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వృత్తిదారుల సంఘం జిల్లా నాయకులు మంచాల మాజీ జడ్పీటీసీ పగడాల యాదయ్య, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు డి.జగదీష్, రైతు సంఘం జిల్లా నాయకులు రామకృష్ణారెడ్డి, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ప్రకాష్ కారత్, ఐద్వా జిల్లా కార్యదర్శి కే సుమలత, సీఐటీయూ జిల్లా నాయకులు టి.నరసింహ,వ్యవసాయ కార్మిక సంఘం రంగారెడ్డి జిల్లా కమిటీ సభ్యులు మంది జంగయ్య, కెవిపిఎస్ నాయకులు భాస్కర్, మాల్యాద్రి, మహిళా సంఘం నాయకులు శారద, రత్నమ్మ, రోజారాణి, డివైఎఫ్ఐ ఎస్ఎఫ్ఐ నాయకులు డి భాస్కర్, ఎం స్టాలిన్, శివ ప్రసాద్ గౌడ్, మేతరి నవీన్, కుమార్, శ్రీను నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అశోక్‌నగర్ కాలనీలో వెలసిన మైసమ్మతల్లి ఆలయ రెండవ వార్షికోత్సవంలో ఓపీసీసీ ఉపాధ్యక్షులు తోటకూర వజ్రేశ్ యాదవ్, కార్పొరేటర్ తోటకూర అజయ్ యాదవ్‌లు ఆదివారంపాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రతినిధులు వారిని శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ పరిధిలోని వివిధ కాలనీలవాసులు పాల్గొన్నారు.

ఎల్బీనగర్ నియోజకవర్గాన్ని సుందరంగా తీర్చి దిద్దుతాం

ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి



నవతెలంగాణ -ఎల్బీనగర్

ఎల్.బి.నగర్ నియోజకవర్గ పరిధిలోని సాగర్ రింగ్ రోడ్డు నుంచి ఇబ్రహీంపట్నం వైపు వెళ్లే డివైడర్ మధ్యలో ఉన్న చెట్లను సుందరికారణ పనులు చేపడుతామని ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుదీర్ రెడ్డి తెలిపారు. ఆదివారం ఎల్.బి.నగర్ శాసన సభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి జోనల్ కమిషనర్ పంకజ ఇతర అధికారులచే కలిసి సాగర్ రింగ్ రోడ్డు వద్ద పర్యటించారు.ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ డివైడర్ మధ్యలో ఉన్న చెట్లను అత్యంత సుందరంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. ఎల్బీనగర్ నియోజకవర్గం చూసే వారికి అందంగా కనిపించాలి అన్నారు. రోడ్డపై వెళ్లే వారికి ప్రయాణించే ప్రయాణికులకు రోడ్లు శుభ్రంగా ఉండి అందమైన చెట్లతో కనువిందు చేసే విధంగా తీర్చిదిద్దుతామని తెలిపారు.ఎల్.బి.నగర్ నియోజకవర్గ రూపురేఖలు మార్చి అద్భుతంగా తీర్చిదిద్దుతాము అని ఎమ్మెల్యే తెలిపారు.ఎల్బీనగర్ నియోజకవర్గంలో ఎల్బీనగర్ చౌరస్తా లో నిర్మించిన ఫ్లైఓవర్, అండర్ పాస్ చూస్తే మనకు విదేశాల్లో ప్రయాణిస్తున్నట్లు ఉంటుంది అన్నారు. రెండు రోజుల్లో సుందరీకరణ పనులు ప్రారంభం కానున్నాయి అని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఈ.అశోక్ రెడ్డి, సిటీ ప్లానర్ ప్రసాద రావు, హార్టికల్చర్ అధికారి రాజ్‌కుమార్, ఎల్.బి.నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సురేందర్ రెడ్డి మరియు ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.

స్వంత నిధులతో కాలనీ అభివృద్ధి

- జన్నేపల్లి శ్రీనివాసరెడ్డి



నవతెలంగాణ-ఎల్బీనగర్

జీహెచ్ఎంసి పరిధిలోని కొలను శివారెడ్డి నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కాలనీలో ఖాళీగా ఉన్న ప్లాట్‌లలో పిచ్చి మొక్కలు, చెత్తాచెదారంను అసోసియేషన్ నాయకులు జన్నేపల్లి శ్రీనివాస్ రెడ్డి తన స్వంత నిధులతో తొలగించారు. మదర్ డయిరీ ఫారెస్ట్ ఉండటం వలన పాములు, దోమలు, పందుల బెడద విపరీతంగా ఉంది. కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సొంత నిధులతో పిచ్చి మొక్కలను రోడ్లను శుభ్రం చేయడం జరిగిందని అసోసియేషన్ నాయకులు జన్నేపల్లి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. మా కాలనీ జీహెచ్ఎంసికి చివరి కాలనీగా ఉండటం వలన అధికారులు ఇటువైపు చూడడం లేదన్నారు. కాలనీలో విపరీతమైన దోమల బెడద, పందుల సంచారం ఉంటుంది అన్నారు. వారానికి ఒక్కసారైనా రోడ్లు శుభ్రం చేయడానికి స్వీపర్సు రావడం లేదని శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. దోమల మందు పిచికారి చేయడానికి సిబ్బంది రావడం లేదు అన్నారు. అధికారులు స్పందించి తమ సమస్యను పరిష్కరించాలని కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కొలను నరేందర్ రెడ్డి, జన్నేపల్లి శ్రీనివాస్ రెడ్డి ,పవన్ కుమార్, కొండల్ రెడ్డి, యశ్వంత్ కుమార్, సురేందర్ రెడ్డి, లింగరాజ్ కాలనీ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఎల్బీనగర్‌లో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తాం



- మల్ రెడ్డి రాంరెడ్డి

నవతెలంగాణ-ఎల్బీనగర్

ఎల్బీనగర్ నియోజకవర్గంలో కాంగ్రెస్‌ను బలోపేతం చేయడం కోసం 'హాత్ సే హాత్ జోడో' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎల్బీనగర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మల్‌రెడ్డి రాంరెడ్డి తెలిపారు. ఆదివారం హస్తినాపురంలో 'హాత్ సే హాత్ జోడో' కార్యక్రమాన్ని మల్‌రెడ్డి రాంరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఎల్బీనగర్‌లో కాంగ్రెస్ జెండాను ఎగురు వేస్తాం అన్నారు. రాష్ట్రంలో పేదల అణిచివేత జరుగుతుందని, బీజేపీతో లోపాయికారి ఒప్పందం బీఆర్ఎస్‌కు ఉంది అన్నారు. రాష్ట్రంలో సాగు నీటి పేరుతో దోపిడీ జరుగుతుంది అన్నారు. రాష్ట్రంలో ధరల పెరుగుదలను ప్రభుత్వం పట్టించుకోవడంలేదని, గ్యాస్ ధర ప్రజలకు భారంగా మారిందన్నారు. టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి ఫిబ్రవరి 6 నుండి 'హాత్ సే హాత్ జోడో' యాత్ర చేపడుతున్నట్లు తెలిపారు. ఈ యాత్రకు ఎల్బీనగర్ నియోజకవర్గం నుండి పెద్ద ఎత్తున కార్యకర్తలు తరలి వెళ్ళనున్నట్లు తెలిపారు. దేశం, రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన రావాలని ప్రజలు కోరుకుంటున్నారని చెప్పారు. ఎల్బీనగర్‌లో జోడో యాత్రను కొనసాగిస్తు ప్రతి గడప గడపకు వెళ్లి ప్రజలను చైతన్యపరిచి తిరిగి కాంగ్రెస్ పాలనను తీసుకొస్తాం అన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్బీనగర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మల్‌రెడ్డి రాంరెడ్డి, జీహెచ్ఎంసి ఫ్లోర్ లీడర్ దర్పల్లి రాజశేఖర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ లీడర్ జక్కిడి ప్రభాకర్ రెడ్డి, ఐఎన్‌టీయూసీ నాయకులు జితేందర్, హస్తినపురం డివిజన్ అధక్షుడు దిండి శశిధర్ రెడ్డి, హయత్‌నగర్ డివిజన్ అధ్యక్షులు గుర్రం శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు మకుటం సదాశివుడు, సత్యనారాయణ, శ్రీపాల్‌రెడ్డి, లింగాలకిషోర్ గౌడ్, శ్రీనివాస్ రావు, శశిధర్ రెడ్డి, సురేందర్ రెడ్డి, మతిన్ భాయ్, జైపాల్ రెడ్డి, చరణ్ రెడ్డి, మెరుగు రమేష్, మక్బుల్ భాయ్, గణేష్ రెడ్డి, నారాయణ, శరత్, నాగార్జున, శ్రీధర్ గౌడ్, మంజుల, కల్పన, సౌమ్య, కవిత, లత పాల్గొన్నారు.

అంజనేయ నగర్ కాలనీ నూతన కమిటీ ఎన్నిక



నవతెలంగాణ-బోడుప్పల్

బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అంజనేయ నగర్ కాలనీ సంక్షేమ సంఘం నూతన కమిటీని ఆదివారం నాడు ఎన్నికల ద్వారా ఎన్నుకున్నారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా వ్యవహరించిన రమేష్ చంద్ర ఎన్నికల ఫలితాలను వెల్లడించారు. కాలనీలో మొత్తం119 ఓట్లు పోలవ్వగా అధ్యక్షుడిగా ఎన్నికైన ఫణికిషోర్ రెడ్డికి 114 ఓట్లు వచ్చాయి, అధ్యక్షుడిగా పోటీలో ఉన్న మరో అభ్యర్థి కడారి బలేశంకు కేవలం మూడు ఓట్లు మాత్రమే పోలయ్యాయి మరో రెండు ఓట్లు చెల్లుబాటు కాలేదని తెలిపారు.ఉపాధ్యక్షుడిగా ఎ.సుధాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా జి.శ్రీనివాస్, కోశాధికారిగా టీ.సుధీర్, సంయుక్త కార్యదర్శిగా శ్రీరాములు కార్యవర్గ సభ్యులుగా ఎం.కొండల్ రెడ్డి, కృష్ణ బుషణ్ లు ఎన్నికైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎలక్షన్ అధికారులు రమేష్ చంద్ర, కిరణ్, సంతోష్, మానోజ్‌లతో పాటు కాలనీ వాసులు ఫక్కీర్ హరినాథ్ రెడ్డి,జయసింహ తదితరులు పాల్గొన్నారు.

బృంగి హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



నవతెలంగాణ - హస్తినాపురం

బి.ఎన్ రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని టీచర్స్ కాలనీ ఫేజ్-2 లో బృంగి హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని స్థానిక కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బృంగి హాస్పిటల్ వారు ఉచిత వైద్య శిబిరం నిర్వహించినందుకు ఎంతో సంతోషకరమని హాస్పిటల్ సిబ్బందిని అభినందించారు. బృంగి హాస్పిటల్ ఎం.డి శిరీష్ కుమార్ మాట్లాడుతూ పేద, మధ్య తరగతివాళ్లకు ఇదొక చక్కని అవకాశం అని, కాలనీలోని ప్రతి ఒక్కరూ ఈ వైద్య శిబిరాన్ని ఉపయోగించుకోవాలని, తక్కువ ఖర్చులో పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ చైర్మెన్ శిరీష్ కుమార్, కాలనీ అధ్యక్షులు శివ కుమార్, ప్రధాన కార్యదర్శి మోహన్ రెడ్డి, మాజీ అధ్యక్షులు నరసింహారెడ్డి, మహిపాల్ రెడ్డి మరియు డివిజన్ ప్రధాన కార్యదర్శి ముడుపు సందీప్ రెడ్డి మరియు కాలనీ సభ్యులు సాయి రెడ్డి, దిలీప్ రెడ్డి, భావన, ఋషి తదితరులు పాల్గొన్నారు.

సంగీత శిఖరం కృంగిపోయింది

- కె.విశ్వనాథ్, వాణీ జయరాం సంస్మరణ సభ



నవతెలంగాణ-వనస్థలిపురం

సంప్రదాయ కళలైన సంగీతాన్ని, నృత్యాన్ని ఉన్నత శిఖరాలకు చేర్చిన మహానుభావుడు కె.విశ్వనాథ్ అని తెలంగాణ రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మెన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్త కొనియాడారు. ఆదివారం వనస్థలిపురం హిల్ కాలనీలో ప్రముఖ సంస్థ ఆకృతి ఆధ్వర్యంలో కె.విశ్వనాథ్, వాణీ జయరాం సంస్మరణ సభ నిర్వహించారు. ఈ కార్య క్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన శ్రీనివాస్‌గుప్త వారి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సంగీతానికి ఒక గౌరవాన్ని, గుర్తింపును తెచ్చిన మహనీ యుడు విశ్వనాథ్ అన్నారు. ఆయన సినిమాలలో మానవ సంబంధాలకు పెద్దపీట వేసిన గొప్ప దర్శకుడు అన్నారు. జాతీయ, రాష్ట్ర స్థాయిలో ఆయన ప్రతి చిత్రం ఏదో ఒక అవార్డు పొందినది అన్నారు. ఆలాగే మరో సంప్రదాయ గాయని వాణీజయరాం మనని విడిచి వెళ్ళడంతో బాధ రెట్టింపు అయ్యింది అన్నారు. విశిష్ట అతిథిగా విచ్చేసిన హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్ర కుమార్ ప్రసంగిస్తూ తెలుగు సినిమా లకు గొప్ప గౌరవాన్ని, జాతీయ అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చారని అన్నారు. విశ్వనాథ్, వాణీజయరాం నిష్క్రమణ తో సంగీత శిఖరం కృంగిపోయింది అన్నారు. గౌరవ అతిథి, కేంద్ర ఫిల్మ్ సెన్సార్ బోర్డు సభ్యుడు సిరిపురం అప్పారావు మాట్లాడుతూ శంకరా భరణం అనంతరం యువతలో సంగీతం, నృత్యం నేర్చుకోవాలనే అభిలాష పెరిగిందన్నారు. సభకు ఆకృతి సుధాకర్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో రెడీతో సర్వ్ ప్రతినిధులు శంకర్, శివ, షిప్పింగ్ కార్పొరేషన్ మాజీ అధికారి సుబ్రహ్మణ్యంలతో పాటు పలువురు సంగీతాభి మానులు పాల్గొన్నారు.

నిరుద్యోగులు జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి





ప్రధాన కార్యదర్శి బేరా బాలకిషన్

నవతెలంగాణ- సరూర్‌నగర్

ఈనెల 11న సరూర్‌నగర్ స్టేడియంలో శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ఆధ్వర్యంలో యువజన సర్వీసుల శాఖ సహకారంతో పెద్ద ఎత్తున జాబ్ మేళా నిర్వహించబడుతుందని, నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మహేశ్వరం నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి బేర బాలకిషన్ (బాలన్న) అన్నారు. ఆదివారం ఉదయం సరూర్‌నగర్ వి.ఎం హోం గ్రౌండ్‌లో వి.ఎం హోమ్ వాకర్స్ అసోసి యేషన్ ఆధ్వర్యంలో జాబ్ మేళా పోస్టర్లను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ తెలంగాణా లో మొట్ట మొదటి సారీగా 108 కంపెనీలతో పదివేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించే జాబ్ మేళాను ఎల్బీనగర్ నియోజకవర్గంతో పాటు మహేశ్వరం నియోజకవర్గంలోని సరూర్ నగర్, ఆర్కేపురం డివిజన్ నిరుద్యోగులు కూడా ఉపయోగించుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. ముఖ్య అతిథులుగా యువజన సర్వీసుల శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్, విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ,హోం మంత్రి మహమూద్ అలీ హాజరవుతారు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో జక్కుల శ్రీశైలం యాదవ్ , వియంహోమ్ వాకర్స్ అసోసియేషన్ నర్సింగ్ గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, గిరిగౌడ్, ఐలయ్య యాదవ్, రామారావు, విజయ్, రమణ, ధనంజయ, పార్షపు శ్రీధర్, దుబ్బాక శశిధర్ రెడ్డి, కొత్త వెంకట్రావు పాల్గొన్నారు.

హస్తినాపురం:

ఎల్బీనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి సమక్షంలో ఈనెల 11న నిర్వహించనున్న జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని హస్తినాపురం కార్పొరేటర్ బానోత్ సుజాతానాయక్, మాజీ కార్పొరేటర్ రమావత్ పద్మనాయక్ నిరుద్యోగ యువతను కోరారు. ఇంద్రప్రస్థ కాలని కమ్యూనిటి హాలులో జాబ్ మేళా ప్రచార వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించి నిరుద్యోగులకు సమాచారం అందించేందుకు వీలుగా ప్రచార కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఎల్బీ నగర్ సమీపంలో గల ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన జాబ్ మేళాలో పాల్గొని యువత అవకాశాలను అందిపుచ్చుకోవాలని అన్నారు. ఈ బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు ఆందోజ్ సత్యంచారి, వర్కింగ్ ప్రెసిడెంట్ మేరెడ్డి ఉదయ్ కుమార్ రెడ్డి, ఉపాధ్యక్షులు బి.శ్రీరాములు గౌడు, ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు గజ్జెల మధుసూధన్ రెడ్డి, డి.కృష్ణ, జి.చంద్రశేఖర్రెడ్డి, శ్రీనివాస్ నాయక్, నారగోని శ్రీనివాస్ యాదవ్,నాగేశ్వర్ రావు, సల్వాచారి, శేషగిరి రావు, విజయ్, రోహిత్, తదితరులు పాల్గొన్నారు.

ప్రయివేటు సంఘాలకు ప్రభుత్వ స్థలం కేటాయించాలి

అందెల శ్రీరాములు యాదవ్



నవతెలంగాణ-బడంగ్‌పేట్

ప్రయివేటు సంఘాలకు ప్రభుత్వ స్థలం కేటాయించాలని, రాష్ట్రంలో అర్హులైన దళితులందరికీ దళిత బంధు, డబుల్ బెడ్‌రూం ఇండ్లు మంజూరు చేయాలని మహేశ్వరం నియోజకవర్గం బీజేపీ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్ అన్నారు. ఆదివారం రంగారెడ్డి జిల్లా, తేజస్ ప్రైవేట్ ఎలక్ట్రికల్ టెక్నీషియన్స్ ఫెడరేషన్ నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రానున్న ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి వస్తే ప్రతీ ప్రైవేటు యూనియన్‌లకు వారి సంక్షేమం కోసం, స్థలాలు కేటాయించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. రంగారెడ్డి జిల్లాకు చెందిన తేజస్ ప్రైవేట్ ఎలక్ట్రికల్ టెక్నీషియన్స్ ఫెడరేషన్ నూతన సంవత్సర క్యాలెండరును మహేశ్వరం నియోజకవర్గం బీజేపీ కార్యాలయంలో ఆవిష్కరించారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే ప్రతీ సంక్షేమ పథకాలు అమలు చేయడం జరుగుతుందన్నారు. అనంతరం బీజేపీ నాయకులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణ, వైస్ ప్రెసిడెంట్ శివకుమార్, సునీల్‌కుమార్, భీమేష్, విక్రమ్ సహా శివ, జగన్, జగన్, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణ, చదువుతోనే లక్ష్యాన్ని చేరుకోగలం

- శ్లోక స్కూల్ కరస్పాండెంట్ కృష్ణారెడ్డి
- ఘనంగా పాఠశాల వార్షికోత్సవం



నవతెలంగాణ-మీర్‌పేట్

విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన చదువుతోనే లక్ష్యాన్ని చేరుకోగలమని శ్లోక స్కూల్ కరస్పాండెంట్ పట్లోరి కృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం శ్లోక స్కూల్ 5వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మా పాఠశాలలో క్రమశిక్షణతో కూడిన విద్యను అందించటమే తమ ప్రధాన లక్ష్యం అని అన్నారు. విద్యార్థులు చిన్నప్పటి నుంచే క్రమశిక్షణ, అంకిత భావం, శ్రద్ధలతో మెలగాలని సూచించారు. విద్యార్థుల అభిరుచులను గమనించి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రోత్సాహించాలని తెలిపారు. విద్యార్థులను చదువుతోపాటు అన్ని రంగాల్లో ముందుంచేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థుల నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మెన్ దీపా రెడ్డి, డైరెక్టర్ అశోక్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు చంద్రమోహన్, ఉగేందర్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బోడుప్పల్ వక్ఫ్ బోర్డు సమస్యలను వెంటనే పరిష్కరించాలి

టీపీసీసీ ఉపాధ్యక్షులు తోటకూర వజ్రేశ్ యాదవ్ డిమాండ్



నవతెలంగాణ-బోడుప్పల్

బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో వక్ఫ్ బోర్డు భూముల సమస్యను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని టీపీసీసీ ఉపాధ్యక్షులు తోటకూర వజ్రేశ్ యాదవ్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన వక్ఫ్ బోర్డు బాధితుల ఐక్యవేదిక జెఎసి కన్వీనర్ శ్రీధర్ ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద కుటుంబ సభ్యులతో నిర్వహించిన భారీ ధర్నాకు సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా వజ్రేశ్ యాదవ్ మాట్లాడుతూ.. ఇరవై అయిదేళ్ల క్రితం ఇళ్ల స్థలాలను కొనుగోలు చేసి నిర్మించుకున్న స్థలాలు వక్ఫ్ బోర్డు స్థలాలంటూ రిజిస్ట్రేషన్లను ప్రభుత్వం నిలిపివేయడం వల్ల సుమారు ఏడువేల కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. ప్రజలు ఇబ్బందిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వెంటనే రిజిస్ట్రేషన్లను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ కుటుంబ పాలన సాగిస్తూ అవినీతి, అక్రమాలకు పాల్పడుతోందన్నారు. త్వరలో కేసీఆర్ అవినీతి పాలనకు చరమగీతం పాడాల్సిన సమయం ఆసన్నమైందని ఆయన పిలుపునిచ్చారు. ఈ ధర్నాలో బోడుప్పల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోగుల నర్సింహారెడ్డి, మేడ్చల్ నియోజకవర్గ 'బి' బ్లాక్ కమిటీ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్ గౌడ్, కార్పొరేటర్ కుంభం కిరణ్ కుమార్ రెడ్డి, మహిళా కాంగ్రెస్ నాయకురాలు వరలక్ష్మి, యువనేత రాపోలు ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీకొని ఇంజినీరింగ్ విద్యార్థి మృతి

నవతెలంగాణ-వనస్థలిపురం

అతివేగంగా, అజాగ్రత్తగా వస్తున్న కారు ఢీకొని ఇంజినీరింగ్ విద్యార్థి గాయాలపాలై, చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వనస్థలిపురం సీఐ కె.సత్యనారాయణ పర్యవేక్షణలో ఎస్ఐ పరమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. చెంపాపేట వైశాలినగర్, ఫ్లాట్ నెంబర్ 22లో నివసించే ముక్కింద్ పటేల్ (20), ఇబ్రహీంపట్నం సీఐ వీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో మూడో సంవత్సరం విద్య అభ్యసిస్తున్నాడు. శనివారం కళాశాల నుంచి టీఎస్07 జెఎఫ్ 8126 నెంబర్ గల ద్విచక్ర వాహనంపై వస్తుండగా గుర్రంగూడ చౌరస్తా, పెట్రోల్ బంక్ సమీపంలో అతివేగంగా, అజాగ్రత్తగా వస్తున్న టీఎస్ 07 హెచ్ టి0007 నెంబర్ గల కారు ఢీకొనటంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. వెంటనే స్థానికులు అంబులెన్స్‌కి సమాచారం ఇవ్వగా ముక్కింద్ పటేల్‌ను హస్తినాపురంలోని బృంగి ఆసుపత్రికి తరలించడంతో విద్యార్థికి రెండు కాళ్లు విరిగిపోయాయని డాక్టర్లు నిర్ధారించటంతో, మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం బంజారాహిల్స్ కేర్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ముక్కింద్ పటేల్ ఆదివారం ఉదయం మృతి చెందాడని డాక్టర్లు నిర్ధారణ చేసినట్లు పోలీసులు తెలిపారు. బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని చేస్తున్నట్లు తెలియజేశారు.

10వ తేదీ లోపు ఫైన్ లేకుండా పరీక్ష ఫీజు చెల్లింపు

నవతెలంగాణ-సిటీబ్యూరో

ఓపెన్ టెన్త్, ఇంటర్ పబ్లిక్ పరీక్షలు- 2023 ఏప్రిల్ లేదా మే నెలలో నిర్వహించాలని తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ(టాస్) నిర్ణయం తీసుకుంది. ఇందుకు సంబంధించిన పరీక్ష ఫీజును అధికారిక వెబ్‌సైట్ ద్వారా లేదా మీసేవ కేంద్రాల ద్వారా చెల్లించడానికి షెడ్యూల్‌నూ విడుదల చేసిన విషయం తెలిసిందే. ఎలాంటి ఆలస్య రుసుము లేకుండా ఈ నెల 10 వరకు పరీక్ష ఫీజు చెల్లించాలని డీఈవో ఆర్.రోహిణి, కో-ఆర్డినేటర్ ప్రభాకర్ రెడ్డి తెలిపారు. రూ.25 అపరాధ రుసుముతో 16 వరకు, రూ.50 అపరాధ రుసుముతో 22వరకు చెల్లించవచ్చని వివరించారు. అలాగే నామినల్ రోల్స్, ఇతర డాక్యుమెంట్లనూ 24వ తేదీలోపు సమర్పించాలని వారు తెలిపారు.

కుషాయిగూడ ఏసీపీగా వెంకట్ రెడ్డి బాధ్యతల స్వీకరణ

నవతెలంగాణ-కాప్రా



కుషాయిగూడ సబ్ డివిజన్ ఏసీపీగా వెంకట్ రెడ్డి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలతో సత్సంబంధాలను ఏర్పాటు చేసుకొని శాంతిభద్రతల పరిరక్షణ కోసం కషి చేస్తానని తెలిపారు. ప్రజల్లో పోలీసులపై నమ్మకం ఏర్పడే విధంగా తమ కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నూతన ఏసీపీకి సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సైలు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

మత్స్యకారుల సంక్షేమానికి రూ. 5వేల కోట్లు కేటాయించాలి

- 20న మత్స్య సొసైటీ డైరెక్టర్ల రాష్ట్ర సదస్సు
- టీఎంకేఎంకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెల్లెల బాలకృష్ణ



నవతెలంగాణ-సిటీబ్యూరో

మత్స్య పరిశ్రమ అభివృద్ధి, మత్స్య కారుల సంక్షేమం కోసం రూ.5000ల కోట్లు కేటాయించాలని 20న జరిగే సొసైటీ డైరెక్టర్ల రాష్ట్ర సదస్సులో తీర్మానం చేయనున్నామని తెలంగాణ మత్స్య కారులు, మత్స్య కార్మిక సంఘం(టీఎంకేఎంకేఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెల్లెల బాలకృష్ణ అన్నారు. తెలంగాణ మత్స్య కారులు, మత్స్య కార్మిక సంఘం గ్రేటర్ హైదరాబాద్ నగర కమిటీ విస్తృత కార్యకర్తల సమావేశం ఆదివారం వృత్తిదారుల భవన్ గోల్కొండ చౌరస్తాలో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన లెల్లెల బాలకృష్ణ మాట్లాడుతూ.. గ్రేటర్ హైదరాబాద్ నగరంలో కోటి మంది ప్రజలకు, నగరానికి వచ్చే పర్యాటకులకు పోషక విలువలు కలిగిన చేపల వంటకాలు అందించడానికి ప్రతీ టూరిజం కేంద్రాలలో ఫిష్ ఫుడ్ కోర్టులను ఏర్పాటు చేయాలని, ప్రతీ కార్పొరేషన్ డివిజన్‌లో రిటైల్ చేపల మార్కెట్లు నిర్మించాలని, అలాగే మహానగరంలో నాలుగు వైపులా 10 ఎకరాల స్థలం కేటాయించి రూ. 100 కోట్లతో అంతర్జాతీయ ప్రమాణాలతో హెూల్సేల్ చేపల మార్కెట్లను నిర్మించాలని కోరారు.

రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ మత్స్య సొసైటికి 10 లక్షల రూపాయలు ఆర్థిక సహాయం అందించేందుకు, వచ్చే బడ్జెట్ లో మత్స్య పరిశ్రమ అభివృద్ధి, మత్స్య కారుల సంక్షేమం కోసం రూ.5000ల కోట్లు కేటాయించాలని, 50 సంవత్సరాలు నిండిన మత్స్యకారులకు రూ.5 వేల రూపాయలు పింఛను ఇవ్వాలని, ఇందుకోసం ఈనెల 20న జరిగే రాష్ట్ర సదస్సులో తీర్మానం చేయనున్నామని తెలిపారు. మత్స్య సొసైటీ అధ్యక్షులు/డైరెక్టర్ల రాష్ట్ర సదస్సుకు పెద్ద సంఖ్యలో అన్ని మత్స్య సొసైటీలు భాగస్వాములై జయప్రదం చేయాలనీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ నగర వృత్తి సంఘాల జిల్లా కన్వీనర్ గుమ్మడిరాజు.నరేష్ పాల్గొని మాట్లాడారు.

సమావేశంలో 13 మందితోగ్రేటర్ హైదరాబాద్ నగర నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా కొప్పు పద్మ, ప్రధాన కార్యదర్శిగా ముఠా విజయ్ కుమార్, ఉపాధ్య క్షులుగా ముటా దశరథ్, గాండ్ల అమరావతి, సహాయ కార్యదర్శు లుగా చంద్రీ.పుష్ప, పూస నాగమణి, పంపరి మంజుల, కే విజయలక్ష్మి, కమిటీ సభ్యులుగా పూస.ప్రదీప్, గౌటి మధుసూధన్, కల్లూరి విమల, కల్చేటి.యాదగిరి, పి లక్ష్మమ్మ తదితరులు ఎన్నికయ్యారు.

ఉద్యోగులు కుటుంబానికి సమయం కేటాయించాలి

- మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్
- హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులతో జోష్ క్రీడ ఈవెంట్



నవతెలంగాణ-బేగంపేట్

విధి నిర్వహణలో భాగంగా నిత్యం పని ఒత్తిడితో ఉండే ఉద్యోగులు కొంత సమయాన్ని కుటుంబ సభ్యులతో గడిపేందుకు కేటాయించాల్సిన అవసరం ఎంతైనా ఉందని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఆదివారం సికింద్రాబాద్‌లోని ఆర్ఆర్‌సీ గ్రౌండ్ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులతో నిర్వహించిన జోష్ క్రీడా ఈవెంట్‌ను మంత్రి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వివిధ ప్రాంతాలలో పని చేస్తూ వివిధ హెూదాలలో ఉన్న ఉద్యోగులు తమ కుటుంబ సభ్యులతో ఒక వేదిక చేసుకొని కలుసుకోవడం ఎంతో సంతోషంగా ఉంటుందని పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాలతో ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యుల మధ్య స్నేహబంధాలు బలపడటమే కాకుండా పని ఒత్తిళ్ల నుంచి కొంత రిలీఫ్ పొందే అవకాశం ఉంటుందని చెప్పారు. ఎంతో పేరు ప్రఖ్యాతలు కలిగ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు యాజమాన్యం ఈ విధమైన కార్యక్రమాన్ని నిర్వహించడం పట్ల మంత్రి అభినందించారు. 2012 సంవత్సరం నుంచి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వహకులు మంత్రికి వివరించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు ప్రతినిధులు బీవీ ఎస్ రావు, బద్రి విశాల్, అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మంత్రిని కలిసిన మార్కెట్ కమిటీ చైర్మెన్, డైరెక్టర్‌లు

బోయిన్‌పల్లి మార్కెట్ కమిటీ నూతన చైర్మెన్‌గా నియమితులైన రాగిరి హారిక ఆనంద్ బాబు, డైరెక్టర్‌లుగా నియమితులైన మాడిశెట్టి గిరిధర్, దేవులపల్లి శ్రీనివాస్, శ్రీరాముల ప్రభాకర్‌లు ఆదివారం మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను వెస్ట్ మారేడ్ పల్లిలోని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి వారికి శుభాకాంక్షలు తెలిపారు.

విద్యార్థుల ఉన్నత భవిష్యత్తుకు డిగ్రీలు దోహదం

- ఓయూ ప్రొఫెసర్ శ్రీరాములు కాప్రా
- సాయి సుధీర్ కళాశాలలో విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేత



నవతెలంగాణ-కాప్రా



డిగ్రీ, పీజీ చదువుల పట్టాలతో విద్యార్థులు తమ జీవి తాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని ఉస్మానియా యూని వర్సిటీ బిజినెస్ మేనేజ్మెంట్ హెడ్ ప్రొఫెసర్ డి.శ్రీరాములు పేర్కొన్నారు. ఈసిఐఎల్‌లోని సాయి సుధీర్ డిగ్రీ, పీజీ కళాశాలలో ఎంబీఏ పూర్తి చేసుకున్న విద్యార్థులకు కళాశాల ప్రాంగణంలో సర్టిఫికెట్ల పంపిణీ(గ్రాడ్యుయేషన్ సెర్మనీ) ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్రీరాములు మాట్లాడుతూ ఎంబీఏ చదివిన విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి రంగాల్లోమంచి అవకాశాలు ఉన్నాయన్నారు. ఒక లక్ష్య సాధనతో చదివే విద్యార్థులు సమాజంలో అన్ని రంగాల్లో రాణిస్తారని తెలి పారు. ఆకాడమిక్ ఆడిట్ సెల్ జాయింట్ డైరక్టర్ ప్రొఫెసర్ జి. విద్యాసాగర్ రావు మాట్లాడుతూ ఉద్యోగం చేయడమే గాక సొంతంగా వ్యాపారం ఏర్పాటు చేసుకొని పది మందికి ఉపాధి కల్పించే కోర్సు ఎంబీఏ అని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కళాశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ ఆర్. ఉషారాణి, ప్రిన్సిపాల్ డాక్టర్ మీరారాణి, డాక్టర్ ఎల్. పద్మారాణి, అధ్యాపకులు, సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కుప్పకూలిన దక్కన్ మాల్ భవనం

- తప్పిన పెను ప్రమాదం

నవతెలంగాణ-బేగంపేట్



సికింద్రాబాద్ మినిస్టర్ రోడ్డులో ఇటీవల అగ్ని ప్రమాదానికి గురైన దక్కన్ మాల్ భవనం మరో భాగం పూర్తిగా కుప్పకూలింది. అయితే ఎవరికి ఎలాంటి ప్రమాదం జరుగలేదు. జనవరి 19న దక్కన్‌మాల్‌లో అగ్ని ప్రమాదం జరిగి 14 గంటలపాటు మంటల్లోనే భవనం ఉన్న విషయం విదితమే. అయితే భవనాన్ని కూల్చివేయాలని అధికారులు ఒక నిర్ణయానికి వచ్చారు. మాలిక్ ట్రేడర్స్‌కు పనులు అప్పగించి కూల్చివేత పనులు చేస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం భవనం ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. అయితే ఇంకో 10 శాతం భవనం అలాగే ఉన్నట్టు తెలిసింది. మరో రెండు రోజుల్లో భవనాన్ని పూర్తిగా కూల్చివేస్తామని అధికారులు చెబుతున్నారు.

వెస్లీ డిగ్రీ కాలేజీలో బాడీ బిల్డింగ్ పోటీలు



నవతెలంగాణ-బేగంపేట్

వెస్లీ డిగ్రీ కాలేజి(కోఎడ్)లో శనివారం రాత్రి ఉస్మానియా యూనివర్సిటీ ఇంటర్ కాలేజి, బాడీ బిల్డింగ్ కాంపిటేషన్ 2022-2023 వెయిట్ కేటగిరి 55 కేజీ 90 ప్లస్ ఏడు విభాగాలలో నిర్వహించారు. 70 నుంచి 75 కేజీల విభాగంలో డిగ్రీ కాలేజీ చదువుతున్న రాహుల్ యాదవ్ గోల్డ్ మెడల్ దక్కించుకున్నాడు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఓయూ రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మి నారాయణ విచ్చేసారు. ఈ కార్యక్రమాన్ని వెస్లీ డిగ్రీ కాలేజ్ (కో.ఎడ్) డైరెక్టర్, ప్రిన్సిపల్ డా . బి . విమల్ సుకుమార్ ఆధ్వర్యంలో ఫిజికల్ డైరెక్టర్ జె . అజయ్ కుమార్ నిర్వహించారు. భారీ ఎత్తున నిర్వహించిన పోటీలలో విజేత మిస్టర్ ఉస్మానియా యూనివర్సిటీ బాడీ బిల్డర్ టైటిల్‌ను ఓయూ రిజిస్ట్రార్ అందజేశారు



జమ్మిగడ్డలో జ్ఞానమాల కార్యక్రమం

నవతెలంగాణ-కాప్రా

బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాలు కొనసాగాలని ప్రతీ ఆదివారం వారి విగ్రహానికి, చిత్రపటానికి పూలమాల వేసే కార్యక్రమంలో భాగంగా ఆదివానం బి.జె.ఆర్ కాలనీ లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జమ్మిగడ్డ అంబేద్కర్ యువజన సంఘం నాయకులు తాడూరి గగన్ కుమార్ , కాలనీ అధ్యక్షులు ఎస్.ఏ రహీం, సంఘ జాషువా రాములు, రవి నాయక్, దయానంద్, నాగేష్, కొండల్, చెన్నప్ప తదితరులు పాల్గొన్నారు.

రెడ్డి సంఘం క్యాలెండర్ ఆవిష్కరించిన బండారి లక్ష్మారెడ్డి

నవతెలంగాణ-కాప్రా



నాచారం డివిజన్‌లో రెడ్డి సంఘం రూపొందించిన క్యాలెండర్‌ను బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బండారి లక్ష్మారెడ్డి ఆదివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మల్లాపూర్ కార్పొరేటర్ దేవేందర్ రెడ్డి, పద్మారెడ్డి, రాగిడి లక్ష్మారెడ్డి, మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్ రెడ్డి, పోగుల వెంకట్ రామ్ రెడ్డి, రెడ్డి సంఘం ప్రెసిడెంట్ ఎర్రం శ్రీనివాస్ రెడ్డి, భూపాల్ రెడ్డి అనిత రెడ్డి ,హరినాథ్ రెడ్డి, మధుకర్ రెడ్డి రవీందర్ రెడ్డి, మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదలను ఆదుకునే స్వభావం కలిగి ఉండాలి

నవతెలంగాణ-జవహర్ నగర్



ప్రతీ ఒక్కరు పేదవారిని ఆదుకునే స్వాభావం కలిగి ఉండాలని సేవారత్న అవార్డు గ్రహీత ఆరకల అనిల్ కూమార్ ముదిరాజ్ అన్నారు. ఆదివారం కార్పొరేషన్ లోని గబ్బిలాల్‌పేటలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అనిల్ కుమార్ మాట్లాడుతూ ముదిరాజ్‌లు అన్ని రంగాల్లో ముందుడాలని, పేదలకు సేవ చేయడంతో జీవితం ధన్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రొయ్యల కిష్టమూర్తి, ఆంజనేయులు ముదిరాజ్, బాలరాజు ముదిరాజ్, నర్సింహులు ముదిరాజ్, బాలమల్లు, తిరుపతి, సత్యనారాయణ, కరుణాకర్, భీమయ్య, శ్రీను, అనిత, మంజుల, కనకలక్ష్మి, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని అడ్డుకోవడమే ప్రతిపక్షాలు పనిగా పెట్టుకున్నాయి



- జవహర్‌నగర్‌లో ప్రగతి పుష్కలం
- జవహర్‌నగర్‌కు ఎంపీగా రెవంత్ రెడ్డి పైసా పనిచేయలేదు
- బీఆర్ఎస్ అధ్యక్షుడు కొండల్ ముదిరాజ్

నవతెలంగాణ-జవహర్‌నగర్

అభివృద్ధి చేస్తున్న మంత్రి మల్లారెడ్డిపై కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీకాంత్ యాదవ్ చేసిన అనుచిత వాఖ్యాలు సరికాదని, బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు కన్నెర్ర చేస్తే మాడిపోతారని... ఖబడ్దార్ అంటూ బీఆర్ఎస్ పార్టీ జవహర్‌నగర్ మండల అధ్యక్షుడు కొండల్ ముదిరాజ్ హెచ్చరించారు. జవహర్ నగర్ తన గుండెకాయ అని చెప్పే మంత్రి ఇప్పటికే రూ.75కోట్లతో కనీవిని ఎరగని రీతిలో చేసిన అభివృద్ధితో జవహర్ నగర్ కార్పొరేషన్ రూపురేఖలు పూర్తిగా మారిపోయాయన్నారు. ఆదివారం జవహర్‌నగర్ కార్పొరేషన్ కార్యాయలం ముందు పార్టీ కార్యకర్తలతో కలసి విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. దేశంలో కాంగ్రెస్ కనుమరుగైందని, బీఆర్ఎస్ పార్టీనే దేశప్రజలు ఆదరిస్తున్నారని అన్నారు. ఎంపీగా గెలిచిన రేవంత్ రెడ్డి జవహర్‌నగర్‌ను ఇసుమంతైనా అభివృద్ధి చేశారా అని ప్రశ్నించారు. నాయకుల మధ్య ఎల్లప్పుడు కొట్లాటలుండే కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఏం సాయం చేస్తుందని.. ప్రజలు కాంగ్రెస్ పార్టీని చీదరించుకుంటున్నారన్నారు. అనతి కాలంలోనే బీఆర్ఎస్‌ను దేశ ప్రజలు సాధారంగా స్వాగతిస్తూ... తెలంగాణలోని సంక్షేమ పథకాలు వారి రాష్ట్రాల్లో అమలు చేయాలని కోరుతుండటంతో తెలంగాణ ఆత్మగౌరవం ఎల్లలు దాటిందని సగర్వంగా చెప్పవచ్చని పేర్కొన్నారు. గత ప్రభుత్వాలలో జవహర్‌నగర్ అభివృద్ధికి ఆమడ దూరంలో ఉండేదని, నేడు మంత్రి మల్లారెడ్డి జవహర్‌నగర్‌ను ఉద్యమస్ఫూర్తిగా అభివృద్ధి చేస్తూ ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతున్నారని తెలిపారు. అభివృద్ధి కోసం పరితపించే తమ మంత్రిపై అసత్య ఆరోపణలు చేస్తే ఖబడ్దార్ అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్, కార్పొరేటర్ గొడుగు వేణు, కోఆప్షన్ సభ్యురాలు శోభారెడ్డి, నాయకులు జిట్టా శ్రీనివాస్ రెడ్డి, మహేష్, ప్రకాష్, ప్రసాద్ గౌడ్, మాధవరెడ్డి, నర్సింహా, పౌలు, వెంకటేష్ గౌడ్, బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా ఇంఛార్జీ పాషా, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

యంగ్ డైనమోస్ క్లబ్ ఆధ్వర్యంలో 5కే రన్

నవతెలంగాణ-కాప్రా



యంగ్ డైనమోస్ క్లబ్ వారి ఆధ్వర్యంలో ఈసీఐఎల్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నందు నిర్వహించిన 5కే రన్ లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి మెడల్స్, బహుమతులను ఉప్పల్ బి-బ్లాక్ కాంగ్రెస్ అధ్య క్షుడు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి, స్థానిక కార్పొరేటర్ సింగిరెడ్డి శిరీషా సోమశేఖర్ రెడ్డిలు అందజేశారు.



టీడీపీ నేతకు నివాళ్లు

నవతెలంగాణ-కాప్రా

టీడీపీ సీనియర్ నాయకులు కనజం శ్రీనివాసరావు దశదినకర్మ సందర్భంగా వారి చిత్రపటానికి పలువురు పూలమాలవేసి నివాళ్లర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు , మాజీ కౌన్సిలర్ రాములు యాదవ్, నీరుకొండ సతీష్ బాబు, ముదిగొండ పాండు, ఏనుగు సీతారాం రెడ్డి, కిరణ్, కుంటల కిషోర్, చారి, కృష్ణ, నాగేశ్వరరావు, కేఎస్ చారి తదితరులు పాల్గొన్నారు.

ఐరన్ షీట్ మీద పడి కార్మికుడు మృతి

- బాధిత కుటుంబానికి పరిహారం అందజేత

నవతెలంగాణ-కాప్రా



చర్లపల్లి పారిశ్రామిక ప్రాంతంలోని తసన్ కృప కంపెనీలో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుడు ప్రమాదవశాత్తు ఐరన్ షీట్ మీద పడి మృతి చెందాడు. ఈ నేపథ్యంలో సీఐటీయూ ఆధ్వ ర్యంలో యాజమాన్యంతో చర్చించి చనిపోయిన కార్మికుడి కుటుం బానికి 20 లక్షల రూపాయలు నష్టపరిహారం ఆదివారం ఇప్పిం చారు. ఈ చర్చలలో సీఐటీయూ మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి జే. చంద్రశేఖర్, సహాయ కార్యదర్శి జి. శ్రీనివాసులు, తైసన్ కృప వర్కర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు ఆర్. బాబురావు, కే .బాలరాజు తదితరులు పాల్గొన్నారు,

కేసీఆర్ కాలనీ అధ్యక్షుడుగా దొమ్మాటి కిరణ్ కుమార్ రావు



నవతెలంగాణ-కాప్రా

కాప్రా డివిజన్ పరిధిలోని కె.సి.ఆర్. (మల్లికార్జున) నగర్ కాలనీ అధ్యక్షులుగా దొమ్మాటి కిరణ్ కుమార్ రావు, ఉపాధ్యక్షులుగా షేక్ కాసీం, వాసంశెట్టి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా ఒంటెద్దు లింగస్వామి, కోశాధికారిగా ఎన్. రాజు లను కాలనీవాసులు ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కాలనీ అధ్యక్షుడు కిరణ్ కుమార్ రావు మాట్లా డుతూ తనపై ఎంతో నమ్మకంతో కాలనీ అధ్యక్షుడిగా మూడోసారి ఎన్నుకున్నందుకు కాలనీ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తా నని తెలిపారు. ఎన్నికైన వారిలో సంయుక్త కార్యదర్శులుగా అంకోజు ప్రవీణ్ చారి, చాగంటి బోసాయా, గుండు శ్రీనివాస్, సిరిపక శ్యామ్, ప్రచార కార్యదర్శులుగా మెరుగు మహేష్, షేక్ బాషా, గౌరవ అధ్యక్షులుగా వాసంశెట్టి రాంబాబు, సిరిపాక మల్లేష్, సలహాదారులుగా మహమ్మద్ అఫ్జల్, గడిపే రవి, బొజ్జ వెంకటేష్, నదునూరి ప్రభాకర్, మామిడిపెల్లి రాంబాబులు ఎన్నికయ్యారు.

కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న మాజీ కార్పొరేటర్

నవతెలంగాణ-సిటీబ్యూరో



చైతన్యపురి డివిజన్ హనుమాన్ నగర్ కాలనీలో మల్లేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన రేణుక ఎల్లమ్మ అమ్మవారి కళ్యాణ మహోత్సవ కార్యక్రమంలో చైతన్యపురి మాజీ కార్పొరేటర్ జిన్నారం విఠల్ రెడ్డి పాల్గొన్నారు. అలాగే తిరుమల్ రెడ్డి, వెంకటేష్, శ్రీనివాస్ యాదవ్ అంగత్ గౌడ్, జాఫర్, శివ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దర్శకుడు శేఖర్ కమ్ముల జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-అడిక్ మెట్

ఎన్నో సున్నితమైన అంశాలను మనస్సును స్పందించేలా సందేశత్మాకమైన సినిమాలకు దర్శకత్వం వహించి ప్రజలలో మంచి అభిమానాన్ని సంపాదించిన ప్రముఖ సినీ దర్శకుడు శేఖర్ కమ్ముల జన్మదిన వేడుకలను స్కై ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్కై ఫౌండేషన్ ప్రెసిడెంట్ సంజీవ కుమార్, వైస్ ప్రెసిడెంట్ ఓ.పావని పాల్గొన్నారు.



ఎమ్మెల్యే సహకారంతో డివిజన్ అభివృద్ధి

నవతెలంగాణ-అంబర్‌పేట

ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ సహకారంతో నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సంతోష్ అన్నారు. నల్లకుంట డివిజన్‌లోని ఇందిరా నగర్ బస్తీలో చెత్త, చెదరాలు, నిర్మాణ వ్యర్థాలు పేరుకుపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ దృష్టికి తీసుకురాగా, సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే సొంత ఖర్చుతో వాహనాన్ని ఏర్పాటు చేయించి పేరుకుపోయిన వ్యర్థాలను తొలగింపజేశారు. ఈ సందర్భంగా బస్తీ వాసులు ఎమ్మెల్యే ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, బస్తీ వాసులు తదితరులు పాల్గొన్నారు.



కమేళ ఆధునీకరణకు ఐక్య పోరాటానికి సిద్ధం కావాలి

- సీపీఐ(ఎం) సౌత్ జిల్లా కార్యదర్శి ఎండీ అబ్బాస్
- జియాగూడ కమేళాలో సీపీఐ(ఎం) సౌత్ కమిటీ ఆధ్వర్యంలో పాదయాత్ర



నవతెలంగాణ-ధూల్ పేట్

జియాగూడ కమేళ ఆధునీకరణకు వత్తి సంఘాలు, కార్మిక సంఘాలు ఐక్య పోరాట కార్యాచరణకు సిద్ధం కావాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, సౌత్ జిల్లా కార్యదర్శి ఎండీ అబ్బాస్ పిలుపునిచ్చారు. ఆదివారం జియాగూడ కమేళాలో సీపీఐ(ఎం) సౌత్ కమిటీ ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహించారు. ఈ పాదయాత్రలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని కమేల వత్తిదారులు, కార్మికులతో మాట్లాడారు. పలు కారణాలతో జియాగూడ కమేళా ఆధునీకరణ పనులు ముందుకు సాగటం లేదని కార్మికులు వాపోయారు. ఎండ కాలంలో దుబ్బ, దుమ్ము, ధూళితో, వర్ష కాలం లో బురదతో నిండి పోతుందని, తీవ్ర అసౌకర్యలతో ఇక్కడ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని సీపీఐ(ఎం) నాయకుల ముందు వారు వాపోయారు. ఈ సందర్భంగా ఎండీ అబ్బాస్ మాట్లాడుతూ కమేళా ఆధునికరణలో ప్రభుత్వ నిర్లక్ష్యం తగదన్నారు. ఎన్నో ఏండ్లుగా ఈ కమేళాపై ఆధారపడి కొన్ని కుటుంబాలు జీవనం కొనసాగిస్తున్నాయని తెలిపారు. ఆధునికరణకు అన్ని రకాల నివేదికలు ఉన్నప్పటికీ నిర్లక్ష్యం చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కమేళ ఆధునీకరణకు వెంటనే ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. మంత్రి కేటీఆర్ ఇచ్చిన హామీ అమలు చేయించుకోవడం కోసం వత్తి సంఘాలు, కార్మిక సంఘాలు ఒక ఏకాభిప్రాయానికి వచ్చి పోరాట కార్యాచరణతో ముందుకు వెళ్లాలన్నారు. తద్వారానే కమేళ ఆధునిక నిర్మాణం జీ హెచ్ఎంసీ ఆధ్వర్యంలో జరిగేలా సాధించుకొగలమని పేర్కొన్నారు. ఈ పాదయాత్రలో జియాగూడ కమేళ స్థానిక నాయకులు వి. ప్రమోద్ కుమార్, చుక్క నర్సింహ, శారదా బాయి, శ్రీశైలం, ఎస్.మల్లేష్, సీపీఐ(ఎం) జిల్లా నాయకులు జి.విఠల్, పి. నాగేశ్వర్, శశికళ, కోటయ్య, జంగయ్య, కిషన్, కళ్యాణ్, కార్యకర్తలు సత్యమ్మ, కురుమయ్య తదితరులు పాల్గొన్నారు.

బీసీల బడ్జెట్ రూ. 2 లక్షల కోట్లకు పెంచాలి

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, ఎంపీ ఆర్ కృష్ణయ్య



నవతెలంగాణ-అడిక్‌మెట్

బీసీల బడ్జెట్ రెండు లక్షల కోట్ల రూపాయలకు వెంటనే పెంచాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ బీసీ వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా హలో బీసీ చలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ మేరకు విద్యా నగర్ బీసీ భవన్ లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పార్లమెంట్‌లో బీసీ బిల్లు వెంటనే ప్రవేశపెట్టి బీసీల బడ్జెట్ రూ. రెండు వేల కోట్ల నుంచి రూ. 2 లక్షల కోట్లకు వెంటనే పెంచాలని డిమాండ్ చేశారు. పేదల కష్టంతో ఏర్పడిన బడ్జెట్‌ను కేంద్రం పెద్దలకు దోచిపెడుతూ నిరంకుశ వైఖరిని అవలంబిస్తుందన్నారు. బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్లు క్రిమిలేయర్‌ను వెంటనే తొలగించాలని కోరారు. రిజర్వేషన్లు కల్పించి ఫీజులు స్కాలర్ షిప్స్ ఇవ్వకుండా అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. కులవృత్తులపై ఆధారపడి జీవనం సాగిస్తున్న బీసీలకు ప్రతీ కుటుంబానికి రూ. 20 లక్షల నుంచి రూ. 50 లక్షల వరకు సబ్సిడీ రుణాలు వెంటనే మంజూరు చేయాలని కోరారు. బీసీ లకు కేంద్ర బడ్జెట్ లో రూ. రెండు లక్షల కోట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే బడ్జెట్‌లో రూ. 20 వేల కోట్ల కేటాయించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బీసీల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, బీసీ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు నీల వెంకటేష్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు భూపేష్ సాగర్, యువజన సంఘం రాష్ట్ర కన్వీనర్ రాజ్ కుమార్, అనంతయ్య, తదితర నాయకులు పాల్గొన్నారు.

కొలీజియం వ్యవస్థను రద్దుచేయాలి

- దక్షిణ భారత సమితి కన్వీనర్ ప్రొ. గాలి వినోద్ కుమార్ డిమాండ్

నవతెలంగాణ-ఓయూ



భారత రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ప్రపంచంలో ఎక్కడా లేనివిధంగా న్యాయమూర్తులే ఉన్నత న్యాయస్థా నాల్లో న్యాయమూర్తులను ఎన్నుకునే కొలీజియం నియామక పద్ధతిని వెంటనే రద్దుచేసి జాతీయ న్యాయ కమిషన్ పునరు ద్ధరించి ఉన్నత న్యాయస్థానాల్లో రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలు చేస్తూ యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఏ విధంగా అయితే పరీక్ష పద్ధతి ద్వారా అన్ని వర్గాల్లోని ప్రతిభావంతులకు అవకాశం ఇస్తున్నట్టుగానే ఉన్నత న్యాయ స్థానాల్లో కూడా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మత మైనార్టీ మహిళలకి రిజర్వేషన్లు అమలు చేసి వారికి న్యాయమూర్తులు అయ్యే అవకాశాన్ని కల్పించాలని దక్షిణ భారత సమితి కన్వీనర్ ప్రొ. డాక్టర్ గాలి వినోద్ కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 75 సంవత్సరాల స్వతంత్ర భారతదేశంలో 74 సంవత్సరాల స్వతంత్ర రాజ్యాంగ అమలు చరిత్రలో నేటికీ 80 శాతం అగ్రవర్ణాలే ఉన్నత న్యాయస్థానాల్లో ఆధిపత్యం చేస్తున్నారని తెలిపారు. వారి జనాభా కేవలం 15 శాతం మాత్రమేనని దేశవ్యాప్తంగా 85 శాతం ఉన్న బహుజనులకు కేవలం 20 శాతం అవకాశాలు కూడా ఉన్నత న్యాయస్థానాల్లో రావడంలేదన్నారు. అందుకు ప్రధాన కారణం న్యాయవ్యవస్థ స్వయంప్రతిపత్తి పేరుతో పైరవీలు, కులం, కుటుంబము, ఆధిపత్యం, డబ్బు, ప్రభావము లాంటి న్యాయ వ్యతిరేక పద్ధతులు అన్నారు. అందరికీ అవకాశాలు కల్పించాలన్న రాజ్యాంగం సమానత్వ సూత్రానికి విరుద్ధంగా ఉన్నత న్యాయస్థానాల్లో న్యాయ మూర్తులుగా నియమితులవుతున్నారని సాక్షాత్తు కేంద్ర న్యాయశాఖ మంత్రి భారత దేశ ఉపరాష్ట్రపతి లాంటి వారు బహిరంగంగానే విమర్శిస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని జాతీయ న్యాయ కమిషన్‌ను పునరుద్ధరించి ఉన్నత న్యాయస్థానాల్లో ఉత్తమ ప్రతిభా కలిగిన అన్ని వర్గాలకు అవకాశం కల్పించాల్సిందిగా డిమాండ్ చేశారు.



హైదరాబాద్ డిజైనర్లకు దేశంలోనే ప్రత్యేక స్థానం

- సింగర్ శ్రీ రామచంద్ర

నవతెలంగాణ-బంజారాహిల్స్

గతంలో సినిమా రంగంలో ముంబై, చెన్నై, బెంగళూరుకు చెందిన డిజైనర్లు పాపులర్‌గా ఉండేవారని కానీ ఇప్పుడు సీన్ మారిందని.. నగరానికి చెందిన ఎందరో డిజైనర్లు దేశ వ్యాప్తంగా పాపులర్ అవుతున్నారని సింగర్ శ్రీరామచంద్ర అన్నారు. ప్రముఖ సెలబ్రిటీ డిజైనర్ జీషన్ ఆజం బంజారాహిల్స్ రోడ్ నెం. 12లో నూతనంగా ఏర్పాటు చేసిన టెర్జీ బై జీషన్ పేరుతో ఏర్పాటు చేసిన సెలబ్రిటీ బొటిక్‌ను ఆయన ఆదివారం ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోజురోజుకు ఫ్యాషన్ రంగంలో వినూత్న మార్పులు వస్తున్నాయని తెలిపారు. వాటన్నింటిని అందిపుచ్చుకుంటూ నగర డిజైనర్లు ముందు వరుసలో ఉంటున్నారని ఇది సంతోషించదగ్గ విషయం అన్నారు. కోలీవుడ్, మాలీవుడ్, బాలీవుడ్‌లలోని సెలబ్రిటీలకు సైతం హైదరాబాద్‌కు చెందిన డిజైనర్లు దుస్తులను డిజైన్ చేస్తున్నారని అన్నారు. డిజైనర్ జీషన్ మాట్లాడుతూ ఇంట్లో ఏ వేడుక జరిగినా ఆ వేడుకకు తగ్గట్లు డిజైన్లు రూపొందించడం ఇప్పుడు సవాల్‌గా మారుతున్నదని.. అన్ని వందల రకాల డిజైన్లు వస్తున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో నటి చాందిని భగ్వానాని, ఎంటీవీ, స్ప్లింట్ విల్లాస్ విన్నర్ బసీర్అలీ, నికితా భమిడిపాటితో పాటు పలువురు ప్రముఖ డిజైనర్లు, నటులు పాల్గొన్నారు.

అంబర్‌పేటను విస్మరించిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

- అభివృద్ధిని చూసి బీఆర్ఎస్‌లో చేరికలు
- ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్



నవతెలంగాణ-అంబర్‌పేట

ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ నేతత్వంలో అంబర్‌పేట నియోజకవర్గంలో జరుగు తున్న అభివృద్ధిని చూసి ఇతర పార్టీల నాయకులు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ తెలిపారు. బీజేపీ డివిజన్ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్న బాగ్ అంబర్‌పేట డివిజన్ సాయిమధురానగర్‌కు చెందిన జమ్మిచెట్టు బాలరాజు ఆ పార్టీకి రాజీనామా చేసి ఆదివారం ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో బాలరాజుతో పాటు మరో వంద మంది స్థానికులు, మహిళలు కూడా బీజేపీలో చేరారు. వీరందరికి ఎమ్మెల్యే గులాబీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ బీజేపీలో కొన్నేండ్లుగా పని చేస్తున్న వారు నిరాశతో బయటకు వచ్చి తమ బస్తీలు, కాలనీలను అభివద్ధి చేసుకునేందుకు బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారని తెలిపారు. గతంలో 15 ఏండ్లు ఎమ్మెల్యేగా, మూడేండ్లుగా కేంద్ర మంత్రిగా పనిచేస్తున్న జి.కిషన్ రెడ్డి తనకు మెజార్టీని ఇచ్చిన అంబర్ పేటను పూర్తిగా విస్మరించారన్నారు. తన ఎంపీ నిధులను ఖర్చు చేయకపోవడంతో అవి మురిగి పోతున్నాయని వెల్లడించారు. ప్రస్తుతం ఆయనకు చెందిన పదికోట్ల నిధులు మురిగిపోవడానికి వచ్చాయని, తన పార్లమెంటు నియోజకవర్గంలో ఒక్కపైసా కూడా ఖర్చు చేయలేదన్నారు. సాయిమధురానగర్‌లో స్థానికుల కోరిక మేరకు ఒక కమ్యూనిటీహాల్ ను కట్టిస్తానని చెప్పారు. అలాగే మహిళలు ఐక్యంగా ముందుకు వచ్చి ఏదైనా ఉపాధి శిక్షణ పొందుతామంటే వారికి తగిన సహకారం అందజేస్తానని పేర్కొన్నారు. కుట్టు మిషన్లు వంటివి ఇప్పిస్తానని తెలిపారు. బస్తీలో ఏ సమస్య ఉన్నా తన దష్టికి తీసుకురావాలని సూచించారు. పార్టీలో చేరిన వారిలో ఎ. రాములు, ఎం.రాజు, కె. రాజు, టీవీ శేఖర్, శ్రావణ్, దుద్యాల శివ, తిరుమని వెంకట్, మురళీ, శేఖర్, సందీప్, ప్రణయ్, గురు, అరవింద్, ప్రసాద్, కుమార్, మల్లేష్, వెంకటచారి, కష్ణ, మహిళలు వేదవతి, మీనా, రేఖ, వరలక్ష్మి, ధనలక్ష్మి, రూప, రోహిణి, పద్మ తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు సీహెచ్ చంద్రమోహన్, సీనియర్ నాయకులు రవీంద్రరావు, కోట్ల సంతోష్, రమేష్ నాయక్, మిర్యాల రవీందర్, అరుణ్ కుమార్ రెడ్డి, సి.మల్లేష్ యాదవ్, శివాజీయాదవ్, బి.నర్సింగ్‌రావుయాదవ్, కె.ఎస్. ధనుంజయ, విజయ్, సునీల్, నవీన్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సంఘం నూతన కమిటీ ఏర్పాటు



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

సీఐటీయూ ఆధ్వర్యంలో మోతీ నగర్ లేబర్ అడ్డా వద్ద ఉన్న పార్కులో ఆదివారం జూబ్లీహిల్స్ నియోజకవర్గం భవన నిర్మాణ కార్మికుల సంఘం కమిటీ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ప్రజా సంఘాల నాయకులు టి సాయి శేషగిరి రావు ముఖ్యఅతి థిగా పాల్గొని కార్యక్రమానికి అధ్యక్ష వహించి మాట్లాడుతూ మోతీ నగర్ లేబర్ అడ్డాలో పనిచేసే వందలాది మంది కార్మికులు లక్షల ఇండ్లు నిర్మించి ఉంటారని, కానీ వారి కుటుంబాలు నివసించడానికి ఇండ్లు లేవన్నారు. కిరాయి ఇళ్లల్లో నివసిస్తారని, వచ్చిన సంపాదనలో సగం డబ్బులు కిరాయికే సరిపోతాయని, చాలా మంది డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు అప్లై చేసినా ఇంతవరకు ఇవ్వలేదని చెప్పారు. అప్లై చేయని వారు ఇంకా వేలమంది ఉంటారన్నారు. దరఖాస్తు చేసినవారికి, చేయని వారికి ఇండ్ల స్థలాలు, డబుల్ బెడ్‌రూం ఇండ్లు వెంటనే ప్రభుత్వం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈనెల తొమ్మిదవ తారీఖున ఇందిరా పార్క్‌లో జరిగే ఇండ్ల సమస్యల పోరాటానికి కార్మికులందరూ హాజరుకావాలని కోరారు. వేసవి కాలం రాబోతున్నందున జూబ్లీహిల్స్ నియోజకవర్గం లోని అన్ని అడ్డాల వద్ద అధికారులు మంచినీటి వసతి ఏర్పాటు చేయాలని, అడ్డాల వద్ద షెడ్లు నిర్మించి మౌలిక వసతి సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు .కొత్తగా ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులు, కే శ్రీనివాసులు, బాలు మాట్లాడుతూ, అడ్డాల మీద ప్రతీరోజు పని ఉండటం లేదని, ప్రభుత్వం కార్మికులకు పని కల్పించాలని, పల్లెల్లో అమలవుతున్న పనికి ఆహారం స్కీమును హైదరాబాద్ నగరంలో ప్రవేశపెట్టాలని, అడ్డా మీద కార్మికులకు ఏ సమస్య వచ్చినా సీఐటీయూగా మేము తమ కమిటీ అందుబాటులో ఉంటుందని తెలియజేశారు. తదుపరి అంబేద్కర్ విగ్రహం వద్ద ఇండ్ల స్థలాల కోసం, ఇండ్ల కోసం ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కె శ్రీనివాసులు, బాలు, సోమేశ్, అబ్బాస్ ,బాబా మియా, ఎల్లేష్ ,నాగేష్, మల్లేష్, రాజు, నరేందర్ ,బిక్షపతి ,వీరాస్వామి నరసింహ ,మహమూద్ తదితరులు పాల్గొన్నారు.



అనాథ పిల్లలందరి మధ్య వ్యాపార వేత్త కార్తీక్ కుమారుడి జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-బంజారాహిల్స్

జగమంత కుటుంబంతో కలిసి జన్మదిన వేడుకలు జరుపుకోవడం ఆనందంగా ఉందని ప్రముఖ వ్యాపార వేత్త కార్తీక్ అన్నారు. వ్యాపార వేత్త కార్తీక్ తన కుమారుడి రీయాన్ష్ జన్మదినోత్సవాన్ని ఆదివారం అనాథ పిల్లలందరి మధ్య జరిపి ఔదార్యాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పుట్టినరోజు అంటే ప్రతి ఒక్కరికీ పండుగేనని తెలిపారు. అలాంటి బర్త్ డేను కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులతో కలిసి జరుపుకో వాలని అంతా భావిస్తారనీ కానీ తమకంటూ ఓ కుటుంబం లేని వారితో జరుపుకోవాలనే ఆలోచన ఎంతమందికి నచ్చుతుందో తెలీదన్నారు. తమ కలల పంట అయిన కుమారుడి మొదటి జన్మదినోత్సవాన్ని తమకు ఉన్నంతలో ఆర్భాటంగా జరుపుకున్నామని చెప్పారు. బంధుమిత్రులు వస్తే ఆ పిల్లలకు ఇబ్బంది కలుగుతుందని భావించి, వారెవరినీ పిలవకుండా కేవలం అనాథ పిల్లలను మాత్రమే ఒక బ్యాంకిట్ హాల్‌కు తీసుకెళ్లి నిర్వహించానని కార్తిక్ వివరించారు. పిల్లలకు వివిధ రకాల ఆట,పాటలతో పాటు పసందైన విందును ఏర్పాటు చేశామన్నారు. సమాజమే తన కుటుంబంగా భావించానన్నారు.

స్త్రీ పురుష సమానత్వానికి పోరాడుదాం

- ఐఎఫ్‌టీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి జి అనురాధ



నవతెలంగాణ-అడిక్‌మెట్

మహిళల హక్కులు, స్త్రీ పురుష సమానత్వానికి పోరాడుదాం అని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి జి అనురాధ తెలిపారు. ఆదివారం విద్యానగర్‌లోని చంద్ర పుల్లారెడ్డి భవన్‌లో ప్రగతిశీల మహిళా సంఘం హైదరాబాద్ జిల్లా కార్యవర్గం ఆధ్వర్యంలో ప్రగశీల మహిళా సంఘం రాష్ట్ర మహాసభలు 7,8 లలో మహబూబాబాద్‌లో జరుగుతున్నాయని ఈ మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మహాసభల గోడపత్రికను ఆదివారం వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్, అసెంబ్లీలో సైతం మహిళా ప్రతినిధులకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలకు రిజర్వేషన్ బిల్లు 30 ఏండ్లుగా పార్లమెంటులో ఆమోదానికి నోచుకోవడం లేదన్నారు. ఆత్మగౌరవం కోసం స్త్రీపురుష సమానత్వం కోసం జరిగే ఉద్యమాలలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొనాలన్నారు. ఇందుకు మహబూబాబాద్‌లో జరుగుతున్న రాష్ట్ర మహాసభలలో చర్చించి తగిన కార్యక్రమాన్ని రూపొందించడం జరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు సరళ, ప్రధాన కార్యదర్శి భారతి, ఉపాధ్యక్షురాలు బండారు విజయ, జిల్లా నాయకురాలు రేణుక పాల్గొన్నారు.

పెరిగిన నిత్యావసరాల ధరలు తగ్గించాలి

- సీపీఐ(ఎం) అంబర్‌పేట జోన్ కన్వీనర్ ఎం మహేందర్

నవతెలంగాణ-అంబర్‌పేట



పెరుగుతున్న నిత్యావసరాల ధరలు తగ్గించాలని సీపీఐ(ఎం) అంబర్‌పేట జోన్ కన్వీనర్ ఎం మహేందర్ డిమాండ్ చేశారు. అంబర్‌పేట నియోజకవర్గంలోని బతుకమ్మ కుంటలో ఆదివారం సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలపై అనేక భారాల మోపుతున్నదన్నారు. పెట్రోల్ , డీజిల్, వంట గ్యాస్, ధరలను విపరీతంగా పెంచి పేద ప్రజల నడ్డి విరుస్తోందని తెలిపారు. పేదలు పనులు లేక గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాలకు వలస పోతున్నారని, పట్టణాలలో పనులు లేక ఇంటికి కిరాయిలు కట్టలేక ఉండడానికి సొంత ఇల్లు లేకపోవడంతో నానా అవస్థలు పడుతున్నారని చెప్పారు. ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు ఇస్తానని వాగ్దానం చేసి ఇప్పటికీ ఏ ఒక్క పేదవాడికి ఇల్లు నిర్మించలేదని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆవాస్ యోజన నివాస పథకం కింద కూడా ఏ ఒక్క పేదవాడికి ఇల్లు నిర్మించలేదన్నారు. ఇప్పటికైనా ప్రజలు తిరుగుబాటు చేయకముందే ప్రభుత్వం దిగివచ్చి పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలని, ప్రతీ పేదవాడికి ఇల్లు నిర్మించి ఇవ్వాలని, ప్రతీ ఒక్కరికి ఉపాధి అవకాశాలు కల్పించాలని ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ అంబర్ పేట జోన్ కమిటీ సభ్యులు జి.రాములు, బి సుబ్బారావు, పి శేషయ్య బస్తీ నాయకులు బాలనాగమ్మ, జరీనా, బాలమణి, స్వప్న, మీనా, తదితరులు పాల్గొన్నారు.

40 నెంబర్ బస్సును పాత రూట్‌లోనే నడపాలి

- హైదరాబాద్ జిందాబాద్ ఆధ్వర్యంలో బ్యానర్ పై సంతకాలు

నవతెలంగాణ-సిటీబ్యూరో



40 నెంబర్ బస్సును పాత రూట్‌లోనే నడపాలని కోరుతూ హైదరాబాద్ జిందాబాద్ కవాడిగూడ బోలాపూర్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం బ్యానర్ పై సంతకాలు చేసి నిరసన వ్యక్తం చేశారు. ముషీరాబాద్ నియోజకవర్గంలోని అశోక్‌నగర్ చౌరస్తాలో ట్రాఫిక్ పోలీసులు నాలుగు వైపుల దారిని యూటర్న్‌గా మార్చినందున 40 నెంబర్ బస్సు అశోక్ నగర్ నుంచి ఆర్టీసీ క్రాస్ రోడ్స్, నారాయణగూడ చౌరస్తా ద్వారా వెళుతున్నదని... దానివలన వందలాదిమంది ప్రయాణికులకు అదనంగా పది నిమిషాలు చొప్పున సమయం పడుతున్నదని.. అలాగే అశోక నగర్ కాలనీ ప్రాంతాలకు బస్సు సౌకర్యం లేకుండా పోతున్నదని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు.



ఈ సందర్భంగా హైదరాబాద్ జిందాబాద్ నగర సంయుక్త కార్యదర్శి ఎం. శ్రీనివాసరావు మాట్లాడుతూ నగర జీవనంలో ట్రాఫిక్ ప్రాధాన్యతల రీత్యా ఫుట్ పాత్ పాదచారులకు, ప్రజా రవాణాకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ప్రస్తుతం నగరంలో ఏకైక రవాణా సాధనం ఆర్టీసీ బస్సు మాత్రమేనని, 40 నెంబర్ ఆర్టీసీ బస్సు ప్రయాణానికి అశోక్ నగర్ చౌరస్తాలోని యూ టర్న్ అంతరాయంగా మారిందని అన్నారు. యూ టర్న్‌ను తొలగించి 40 వ నంబర్ బస్సు పాత రూట్ లోనే వెళ్లేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పేద, మధ్యతరగతి ప్రజానీకం ప్రయాణించే ప్రజా రవాణాకు ప్రాధాన్యత ఇవ్వవలసిందిగా ట్రాఫిక్ పోలీస్ అధికారులకు విజ్ఞప్తి చేశారు. బస్తీ వాసులు బ్యానర్‌పై సంతకాలు చేసి తమ నిరసన చేశారు పాత రోడ్ లోనే బస్సులు నడవాలని అశోక్ నగర్ చౌరస్తాలో యూటర్న్ రద్దు చేయాలని నినాదాలు ఇచ్చారు. కార్యక్రమానికి హైదరాబాద్ జిందాబాద్ కవాడిగుడ - భోలక్ పూర్ డివిజన్ కార్యదర్శి మోహన్ నగర ఉపాధ్యక్షులు ఆర్. ఈశ్వర్ బాబు,శ్రీనివాస్ నాయకత్వం వహించారు.

తక్కువ ఖర్చుతో ప్రపంచ స్థాయి చికిత్సలు

- ఒమేగా హాస్పిటల్స్ చైర్మెన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ మోహన్ వంశీ
- గచ్చిబౌలిలో ఒమేగా ఆస్పత్రి మల్టీ- స్పెషాలిటీ బ్రాంచ్ ప్రారంభం



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

క్యాన్సర్ చికిత్సలో అగ్రగామిగా నిలిచిన ఒమేగా హాస్పిటల్స్ నూతన బ్రాంచ్ ప్రపంచస్థాయి సదుపాయాలతో, అత్యంత అధునాతన టెక్నాలజీతో 500కు పైగా పడకల సామర్థ్యంతో ఆదివారం గచ్చిబౌలిలో ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా హాస్పిటల్ చైర్మెన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ మోహన్ వంశీ మాట్లాడుతూ, ప్రజలకు తక్కువ ఖర్చుతో ప్రపంచ స్థాయి చికిత్సలు అందించాలని, ఏకైక లక్ష్యంతో గచ్చిబౌలిలో ఒమేగా ఆస్పత్రిని అందుబాటులోనికి తెచ్చామన్నారు. క్యాన్సర్‌తో బాధపడుతున్న చాలామంది రోగులకు గుండె, ఆర్థోపెటిక్, మూత్రపిండం, పల్మనది, న్యూరోలాజికల్ సమస్యలకు డిసిప్లినరీ కేర్ అవసరమని, రోగుల సంరక్షణ దృష్టిలో ఉంచుకొని తాము సమగ్ర క్యాన్సర్ సంరక్షణను అందించడానికి, వివిధ సూపర్ స్పెషాలిటీల సేవలను ఐదు అంతస్తులలో అందుబాటులోకి తెచ్చామని అన్నారు. వైద్య రంగంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న సాంకేతికతను ఎప్పటికప్పుడు అందిపుచ్చుకుంటూ ముందుకు సాగడం ఎంతో అవసరం అన్నారు. ఒమేగా హాస్పిటల్స్ లో భారత దేశపు మొట్టమొదటి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ తో పనిచేసే రేడియేషన్ మిషన్ ,ఎతోస్ విప్లవాత్మకమైన కొత్త తెరపిని అందుబాటులోకి తీసుకువచ్చామని తెలిపారు. ఇది రోగి కేంద్రీకృతంగా పనిచేస్తుందని వివరించారు. చికిత్సకు సంబంధించి ప్రారంభ ప్రణాళిక నుంచి చివరి వరకు పూర్తిస్థాయిలో పర్యవేక్షిస్తుందని తెలిపారు. ప్రపంచంలోనే మొట్టమొదటిసారి ఆర్టిఫిషియల్, ఇంటెలిజెన్సీ తో ,పనిచేసే ఎథోన్ని ఉపయోగించి, పెట్‌జ/ఎంఆర్-గైడెడ్ అడాప్టీవ్ రేడియో థెరపీని ప్రారంభించామని వెల్లడించారు. ఇది క్యాన్సర్ రేడియేషన్ చికిత్సలో ఒక విప్లవం అని పేర్కొన్నారు. ఈ విధానంలో కొన్ని నిమిషాల వ్యవధిలోనే వ్యాధిని పూర్తిగా విశ్లేషించి చూడటం, ఆలోచించడం, ప్లాన్ చేయడం, చికిత్స అందించటం పూర్తి చేయవచ్చని వివరించారు. భారతదేశంలో డిజిటల్ పెట్, ఎంఆర్ డిజిటల్, పెట్ సిటీ పరికరాలతో కూడిన అత్యుత్తమ న్యూక్లియర్, మెడిసిన్ డిపార్ట్మెంట్‌ను ప్రారంభించిన మొదటి ఆస్పత్రి ఒమేగా హాస్పిటల్ అని డాక్టర్ మోహన్ వంశి పేర్కొన్నారు. మ్యాడ్యులర్ ఆపరేషన్ థియేటర్లు, ఐసియు, హై అండ్ క్యాట్ ల్యాబ్ ఫెసిలిటీస్ తో తమ అనుభవజ్ఞులైన క్రిటికల్ కేర్ టీం 24 గంటలు అత్యవసర సేవలను అందించడానికి అందుబాటులో ఉంటారన్నారు.



అసెంబ్లీలో ఓయూ విద్యార్థుల తరపున మాట్లాడాలి

- సీఎల్పీ నేత భట్టి విక్రమార్కకు ఓయూ పీడీఎస్‌యూ నేతల వినతి



నవతెలంగాణ-ఓయూ

ఓయూ స్టూడెంట్స్ ఎజెండా అమలుకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించేలాగా తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలలో ఓయూ విద్యార్థుల తరపున మాట్లాడాలని కోరుతూ కాంగ్రెస్ శాసనసభా నేత(సి.ఎల్పీ నేత) మల్లుభట్టి విక్రమార్కకు ఓయూ పి.డి.ఎస్.యూ నేతలు ఆదివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓయూ విద్యార్థులు కోరుతున్న ఓయూ స్టూడెంట్స్ ఎజెండా న్యాయమైన దన్నారు. ఎజెండా అమలుకు అవసరమైన నిధులు రాష్ట్ర ప్రభుత్వం కేటాయించేలాగా అసెంబ్లీలో తగిన చర్చ జరిగేలా కషి చేస్తామని తెలిపారు. పి.డి.ఎస్.యూ ఓయూ నేతలు ఎస్.నాగేశ్వరరావు, ఎస్.సుమంత్, కె.స్వాతిలు మాట్లాడుతూ. అసెంబ్లీ సమావేశాలలో ఓయూ విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు ఇవ్వాలని, విద్యా ప్రోత్సాహక పథకాలు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఓయూలో ఉచిత మెస్ వసతి లేకపోవడంతో విద్యార్థులకు ఆర్థిక భారాన్ని కలిగిస్తూ వారిని ఉన్నత విద్య కు దూరం చేస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే యూనివర్సిటీ విద్యార్థులకు ఉచిత మెస్ వసతి ప్రారంభించాలని డిమాండ్ చేశారు. స్కాలర్ షిప్స్ నెలకు మూడు వేల రూపాయల ఇవ్వాలని అన్నారు. ఓయూ విద్యార్థుల ఆరోగ్య భద్రతకు భరోసా కల్పిస్తూ ప్రభుత్వ హెల్త్ ఇన్సూరెన్స్ స్కీమ్‌ను ప్రారంభించాలని అన్నారు. వర్సిటీలో అన్ని సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులను రెగ్యు లర్ చేసి, ఫీజులు మొత్తం రీయంబర్స్ చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం ఉన్నదని గుర్తు చేశారు. ఓయూ అభివధి కోసం వెయ్యి కోట్ల రూపాయల బ్లాక్ గ్రాంట్స్ నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. లేనియెడల రాబోయే రోజుల్లో విద్యార్థుల ఉద్యమాలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. పి.డి.ఎస్.యూ ఓయూ నేతలు వెంకటేష్, భువన, నరేష్,సంపత్, శివ, వినీల్, కార్తిక్, అంజి పాల్గొన్నారు.

ఆత్మ గౌరవ భవన శంకుస్థాపనకు తరలివెళ్లిన కుమ్మరి నేతలు

నవతెలంగాణ-ఓయూ

ఉప్పల్ భగాయత్‌లో రాష్ట్ర కుమ్మర ఆత్మ గౌరవ భవనానికి శంకుస్థాపన కార్యక్రమానికి తార్నాక నుంచి ఆదివారం భారీ ఎత్తున తరలివెళ్లారు. కుమ్మర సంఘం నాయకులు మల్లికంటి వీరన్న, వై వెంకటేశ్వర్లు, నరేష్, శివానంద్, ఏ శ్రీనివాసులు, ప్రభాకర్ ,ఏ శంకర్ ,తార్నాక డివిజన్ కుమ్మరి సంఘం నాయకులు బయల్దేరివెళ్లారు.



ఆలయ కమిటీని అభినందించిన వడ్డేపల్లి

నవతెలంగాణ-కూకట్‌పల్లి

కూకట్‌పల్లి పాపారాయుడు నగర్‌లో ఆదివారం శ్రీ సంజీవని ఆంజనేయస్వామి వారి దివ్య విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో దేవాలయ కమిటీ ఆహ్వానం మేరకు కూకట్‌పల్లి బీజేపీ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వర్‌రావు పాల్గొని స్వామివారి విగ్రహ యంత్ర ప్రతిష్ట ప్రథమ దర్శనం చేసుకున్నారు, అనంతరం ఆయన మాట్లాడుతూ, సాంప్రదాయబద్ధంగా, ధార్మిక పద్ధతిలో ఆలయ నిర్మాణం చేశారని, ఆకర్షణీయంగా మరియు భక్తి భావంతో అన్ని ప్రతిష్టాపన పూజ ఏర్పాట్లు ఆలయ ప్రారంభోత్సవానికి చేసినందున ఆలయ కమిటీని అభినందించారు. వారిని పండితుల వేదమంత్రోచ్చారణతో ఆశీర్వదించి ఆలయ కమిటీ తరపున జ్ఞాపిక ను అందజేసి, శాలువాతో సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో చౌదరి వెంకట్రావు, తిరుపతిరావు, భాస్కరరావు, సివి రావు, దుర్గాప్రసాద్ రావు, నాగరాజు, శ్రీనివాసరావు, రామ్మోహన్ రావు, గోపాల్ రావు, భాస్కర్ రెడ్డి, సంజీవరావు, వీరు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన సూరారం కట్టమైసమ్మ ఆలయ కమిటీ సభ్యులు

నవతెలంగాణ - కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని సూరారం కట్టమైసమ్మ ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ని తన నివాసం వద్ద మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఈనెల 11 నుండి 15వ తేదీ వరకు నిర్వహించనున్న కట్ట మైసమ్మ జాతర ఏర్పాట్లపై ఎమ్మెల్యే కి వినతి పత్రాన్ని అందజేశారు. దీంతో ఎమ్మెల్యే ఆయా సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడారు. జాతరకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు.



ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మన్నె బాలేష్ , వారాల వినోద్ కుమార్, కే.యాది రెడ్డి, కే.వీరారెడ్డి, వారాల శేషు, ఈ సురేష్, మల్లేష్, అంజిరెడ్డి, సుధాకర్ రెడ్డి , మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కబ్జాదారుల నుంచి శ్మశానవాటికను కాపాడండి

బాలానగర్ సీపీఐ(ఎం) మండల కమిటీ డిమాండ్

నవతెలంగాణ-బాలానగర్

బాలానగర్ డివిజన్ పరిధిలోని ఐడిపిఎల్ గుడిసెల్లోని చుట్టుపక్కల అనుబంధ బస్తీల స్మశానవాటిక కబ్జాకు గురికాకుండా కబ్జాదారుల నుండి కాపాడాలని సీపీఐ(ఎం) డిమాండ్ చేసింది. ఐడీపీఎల్ గుడిసెల్లోని ఇందిరానగర్ రాజీవ్ గాంధీ నగర్, శ్రీశ్రీ నగర్, ఎన్టీఆర్ నగర్, వెంకటేశ్వర కాలనీ అనుబంధ బస్తీలకు సంబంధించిన హిందూ శ్మశానవాటికను కొంతమంది భూ కబ్జాదారులు కబ్జాలకు పాల్పడి హిందూ స్మశానవాటికలో ఉన్నటువంటి సమాధులను కూల్చివేశారు. ఇదేంటని స్థానిక ప్రజలు నిలదీయగా వారిని భయభ్రాంతులకు గురిచేస్తూ మిమ్మల్ని సంపుతామని బెదిరిస్తూ దాడులకు పాల్పడుతున్నారని సీపీఐ(ఎం) నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

బాలానగర్ పోలీస్ స్టేషన్‌కు రమ్మని పోలీస్ స్టేషన్లో పొద్దున్నుంచి రాత్రి వరకు కూర్చోబెడుతు న్నారు. గత రెండు రోజులుగా ఇదే తంతు జరుగుతున్నందున ఇట్టి విషయంపై సీపీఐ(ఎం) కూకట్‌పల్లి, బాలనగర్ మండల కమిటీల ఆధ్వర్యంలో ఆదివారం బాలానగర్ ఏసీపీకి ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన ఏసీపీ గంగారం బాలనగర్ సీఐని కలవండిని చెప్పారు. ఎంతటి వారైనా కబ్జాలకు పాల్పడే వ్యక్తులపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సీపీఎం కూకట్‌పల్లి మండల కార్యదర్శి ఎం శంకర్, బాలానగర్ మండల కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్, సీపీఐ(ఎం) నాయకులు కె.కృష్ణా నాయక్ మాట్లాడుతూ ఐడీపీఎల్ స్థలంలో గత 50 ఏండ్ల నుంచి దాదాపుగా 2 వేల గుడిసెలు వేసుకుని జీవనం కొనసాగిస్తున్న నిరుపేదలు ఎవరైనా చనిపోయినప్పుడు శ్మశానంలో పెట్టడానికి స్థలం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నటువంటి పరిస్థితుల్లో గతంలో ఉన్నటువంటి గత 2016 లో స్థానిక ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుతో మాట్లాడగా రెండు ఎకరాల స్థలం కేటాయించి అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారని, ఇట్టి స్మశాన వాటికలో ఇప్పటివరకు 100 సమాధులను కొందరు కబ్జాదారులు కూల్చివేశారని బాధ్యులైన వారిపై ప్రభుత్వ యంత్రాంగం, పోలీసు అధికారులు కబ్జాదారులపై చట్టరీత్యా చర్యలు తీసుకుని స్మశాన వాటికను కాపాడి అభివృద్ధిపరచి ప్రజా అవసరాలకు ఉపయోగించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) నాయకులు ఎ.రంగారెడ్డి, రాము, రాజులు, రమేష్ పాల్గొన్నారు.



నేటి విద్యార్థులే భావితరాల మేధావులు

- **ఎస్సై ఆంజనేయులు**
- **త్రివేణి కిడ్స్‌లో సందడిగా సైన్స్ ఉత్సవ్ 2023**

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట



నేటి విద్యార్థులే భావితరాల మేధావులని జీడిమెట్ల సబ్ ఇన్స్‌పెక్టర్ ఆంజనేయులు అన్నారు. ఆదివారం కుత్బుల్లాపూర్ సర్కిల్ చింతల్ బ్రాంచ్ త్రివేణి పాఠశాలలో (సైన్స్ ఎక్స్పో - ఆక్టివిటీ డే)సైన్స్ ఉత్సవ్-యాన్యువల్ సైన్స్ ఇంపోజియం 2023 (యూకేజీ నుండి 5వ తరగతి వరకు) ప్రదర్శనలను ఆయన తోపాటు పాఠశాల సైన్స్ అధికారి సుబ్బారావు, వైస్ ప్రిన్సిపల్ నళిని, జోనల్ ఇంచార్జ్ చక్రిలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్సై ఆంజనేయులు మాట్లాడుతూ విద్యార్థులు విద్యతోపాటు శాస్త్ర సాంకేతిక రంగాలలో రాణించి దేశ ప్రతిష్ట ఇనుమడింపజేయాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో ఇటువంటి వైజ్ఞాన ప్రదర్శనలు ఎంతో దోహదపడతాయని ఆ దిశగా విద్యార్థులు మేధా సంపత్తిని పెంచుకోవాలని సూచించారు. విద్యార్థులు దాదాపు 400 వివిధ రకాల ప్రాజెక్టులతో నమూనాలు తయారు చేశారు. అనంతరం పాఠశాల అధ్యాపక బృందంతో కలిసి ప్రదర్శనలను తిలకించారు .విద్యార్థులకు వారి ప్రాథమిక తరగతుల నుండి సైన్స్ పట్ల అవగాహన కల్పిస్తూ ఇలాంటి ప్రదర్శనలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. త్రివేణి సంస్థల సైన్స్ అధికారి సుబ్బారావు మాట్లాడుతూ ప్రాథమిక తరగతుల నుండి 10 వ తరగతి వరకు సైన్స్ క్లబ్ నిర్వహిస్తూ ప్రోజెక్టుల తయారీకి విద్యార్థులను సిద్ధం చేస్తున్నామన్నారు. ప్రతి విద్యార్థి పట్ల వ్యక్తిగత శ్రద్ధ తీసుకుంటూ ప్రతి యేడు ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నామని తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ నళిని మాట్లాడుతూ కరిక్యులంలో భాగంగా ఉపాధ్యాయుల పర్యవేక్షణ లో ప్రతీ సంవత్సరం ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు . ఈ కార్యక్రమంలో సిఆర్‌ఓ వెంకట్రావు, సబ్ ఇంచార్జి క్రాంతి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లితండ్రులు పాల్గొన్నారు.

డ్రగ్స్ కొనుగోలు చేస్తున్న ఐదుగురు అరెస్ట్

- **కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో వివరాలు వెల్లడించిన బాలానగర్ జోన్ డీసీపీ శ్రీనివాస్‌రావు**

నవతెలంగాణ-కూకట్‌పల్లి

చదువు పూర్తయి ఉద్యోగ వేటలో ఉండి, తొందరగా డబ్బు సంపాదించాలనే అత్యాశతో ఈజీ మనీ కి అలవాటు పడి, ఎమ్‌డిఎమ్ ఏ డ్రగ్స్‌తో పట్టుబడ్డ ఐదుగురు యువకులను మాదాపూర్ ఎస్.ఓ.టి, కూకట్‌పల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. పట్టు బడ్డ డ్రగ్స్ వివరాలు కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించిన బాలానగర్ జోన్ డీసీపీ శ్రీనివాస రావు మాట్లాడుతూ, సైబరాబాద్ సీపీ ఆదేశాల మేరకు,సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో డ్రగ్స్, వినియోగదారులు, డ్రగ్స్ పెడ్లర్స్ మీద నిఘా ఉంచడం జరిగిందని, అందులో భాగంగా బాలానగర్ జోన్ పరిధిలోని కూకట్‌పల్లిలో, ఎస్‌ఓటి మరియు కూకట్‌పల్లి పోలీసులకు వచ్చిన పక్కా సమాచారం మేరకు కూకట్‌పల్లి ఐడీఎల్ చెరువు వద్ద డ్రగ్స్ సరఫరాతోపాటు కొనుగోలు చేస్తున్న విజయవాడకి చెందిన హరి కృష్ణ (21), పవన్ కుమార్(24), కిరణ్ తేజ(20), సాయి కుమార్(24), రఘు(23) అనే ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. బెంగళూరు సాయికుమార్‌కు డ్రగ్స్ సరఫరా చేసిన నైజీరియన్, ఆలి అనే వ్యక్తి పరారీలో ఉన్నట్లు బాలానగర్ డీసీపీ శ్రీనివాసరావు వెల్లడించారు. సాయి కుమార్ అనే వ్యక్తి బెంగళూరులో ప్రవేట్ ఉద్యోగం చేస్తూ నైజీరియన్‌కి చెందిన వ్యక్తి దగ్గర నుండి డ్రగ్స్ తీసుకొని సప్లై చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ప్రస్తుతం సరఫరా చేస్తున్న వ్యక్తి కోసం గాలిస్తున్నామన్నారు. నిందితుల వద్ద నుండి 18 గ్రాములు ఎండీఎంఏ డ్రగ్స్‌తో పాటు నాలుగు సెల్ ఫోన్‌లను స్వాధీనం చేసామని తెలియజేశారు. వాటి విలువ లక్ష రూపాయలే అయినప్పటికీ డ్రగ్స్ దుష్ప్రభావం సమాజం మీద ఎక్కువగా ఉంటుందని, అలాగే, తల్లిదండ్రులు, బంధువులు, వారి పిల్లలపై నిఘా ఉంచి ఎలాంటి ఈజీ మనీకి, డ్రగ్స్ వంటి ప్రలోభాలకు లోను కాకుండా జాగ్రత్త పడాలని డీసీపీ శ్రీనివాసరావు వెల్లడించారు. ఈ సమావేశంలో కూకట్‌పల్లి ఏసీపీ చంద్రశేఖర్, కూకట్‌పల్లి సీఐ నర్సింగ్‌రావు, ఎస్సై రామకృష్ణ, ఎస్‌ఓటి మాదాపూర్ జోన్ పోలీసులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



ఘనంగా పార్శిప్రకాష్ జన్మదిన వేడుకలు

హాజరైన ఎమ్మెల్యే కేపీ వివేకానంద

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

ఆర్యవైశ్య మహాసభ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు, వ్యాపారవేత్త ,సంఘ సేవకులు, పార్శి ప్రకాష్ గుప్తా 60 వ జన్మదిన వేడుకలు ఆర్యవైశ్య మహాసభ మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పల చంద్రశేఖర్ గుప్తా, ఉపాధ్యక్షులు దారం సతీష్ గుప్తా, కన్వీనర్ తేరాల శ్రీనివాస్ గుప్తాల ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం కుత్బుల్లాపూర్ సర్కిల్ ఐడిపిఎల్ కాలనీ సమీపంలోని ఎం పి ఆర్ కన్వెన్షన్ హాల్లో కుటుంబ సభ్యులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు, ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ సభ్యులు ,ఆర్యవైశ్య సభ్యుల, మధ్య ఘనంగా జరిగాయి. ముందుగా పార్శి ప్రకాష్ గుప్తా, పార్శి లక్ష్మి దంపతులను వేద పండితులు ఆశీర్వచనం అందజేశారు. స్థానిక ఎమ్మెల్యే కేపీ వివేకానంద తోపాటు మేడ్చల్ జిల్లాలోని 14 మండలాలకు చెందిన ఆర్యవైశ్య కులస్తులు, వ్యాపారవేత్తలు ,పుష్పగుచ్చాలు ,అందజేసి శాలువాలతో గజమాలతో సన్మానించి కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పార్శి ప్రకాష్ గుప్త మాట్లాడుతూ తన జన్మదిన వేడుకలు అందరి మధ్య జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. భవిష్యత్తులో కూడా సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తానని, జిల్లాలోని ఆర్యవైశ్యుల సంక్షేమానికి ,పేద ఆర్యవైశ్య కులస్తుల కు అన్ని విధాలుగా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు .అనంతరం పలువురు హాజరై జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జగద్గిరిగుట్ట ఆర్యవైశ్య సంఘం మహిళా విభాగం, యువజన విభాగం, సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.





అభివృద్ధి సంక్షేమంలో డివిజన్‌ను ఆదర్శంగా నిలుపుతాం

- **కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి**



నవతెలంగాణ-బాలానగర్

కూకట్‌పల్లి సర్కిల్, బాలానగర్ డివిజన్ పరిధిలోని దాసరి బస్తీలో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డు మరియు పలు అభివృద్ధి పనులను బాలానగర్ డివిజన్ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి స్థానిక బీఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి ఆదివారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ దాసరి బస్తీ, బుడగ జంగాల బస్తీలో ఇటీవల చేపట్టిన అభివృద్ధి పనులను నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డు పనులను ఆయన పర్యవేక్షించారు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సహకారంతో డివిజన్‌ను అన్ని రంగాలలో అభివృద్ధి పరుస్తూ అన్ని వర్గాల వారిని కలుపుకుంటూ సంక్షేమ పథకాల అమలులోనూ నిర్విరామంగా కృషి చేస్తున్నామని అన్నారు. ప్రధానంగా డివిజన్ పరిధిలోని బస్తీలలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న విద్యుత్ స్తంబాలు, మంచి నీటి పైప్‌లైన్‌తోపాటు సీసీ రోడ్లు వేసినందుకు కాలనీవాసులు హర్షం వ్యక్తం చేస్తూ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బుడగ జంగం బస్తీ అధ్యక్షులు కొండపల్లి నర్సింహ, దాసరి బస్తీ అధ్యక్షులు ఆదిమూల నగేష్, బస్తీవాసులు టి.కృష్ణ, శేఖర్, రాము మరియు బీఆర్ఎస్ పార్టీ నాయకులు దేవులపల్లి కృష్ణమూర్తి, బాజాని నాగేందర్ గౌడ్, ఎం.సుధాకర్ రెడ్డి, ముత్యాల మురళీధర్ ముదిరాజ్ మరియు బస్తి వాసులు పాల్గొన్నారు.

ఆరు నెలలకోసారి హెల్త్ చెకప్ చేసుకోవాలి

వ్యాధి నయం చేసుకునే కంటే నివారించడం ఉత్తమం

సినీ నటుడు సుమన్

నవతెలంగాణ-కూకట్‌పల్లి

సీనియర్ నటుడు సుమన్ కూకట్‌పల్లి లోని ఓమ్ని హాస్పిటల్‌లో ట్విలైట్ లాంజ్ ద్వారా ప్రివెంటివే మెడిసిన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా నటుడు సుమన్ మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యం అని ,ఆరోగ్యం బాగుంటే ఏదైనా సాధించొచ్చు అని తెలుపుతూ ఏ రోగాన్నైనా ప్రారంభ దశలోనే గుర్తించినట్లైతే ఆ వ్యాధి నివారణ సులువవుతుంది అని పేర్కొన్నారు. 40 ఏళ్ల నిండిన ప్రతి వ్యక్తి ఆరు నెలలకు ఒకసారి, సంవత్సరానికి రెండుసార్లు, ప్రివెంటివ్ హెల్త్ చెకప్ చేయించుకోవడం చాలా అవసరం అని, వ్యాధి వచ్చిన తరువాత నయం చేసుకోవడం కంటే, ముందే గుర్తించి నివారణ చేసుకోవడం ఉత్తమం అని తెలిపారు. ఏ వ్యాధి అయిన పరీక్షిస్తే తెలుస్తుందని, క్యాన్సర్ వంటి వ్యాధులు 80 శాతం అడ్వాన్స్ స్టేజ్‌కు వస్తే గానీ బయటపడవని అందుకే ఆరు నెలలకు ఓసారి హెల్త్ చెకప్ చేసుకుని ఆరోగ్యంగా ఉండాలని, మనం ఏది సాధించాలన్నా ఆరోగ్యం ప్రదానం అని గమనించాలన్నారు. ఈ విషయాన్ని హాస్పిటల్ వారు జనంలోకి వెళ్లేలా చూడాలని అన్నారు. ఇదే కోణంలో ఓమ్ని హాస్పిటల్ వారు ప్రివేంటివ్ హెల్త్ చెకప్‌ల కోసం ఓ ప్రత్యేకమైన లాంజ్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ సందర్భంగా జర్నలిస్టు మిత్రులకు ఓమ్ని హాస్పిటల్ హెల్త్ చెకప్ కూపన్లు స్వాస్త్ కార్డ్ ద్వారా అందజేయడం జరుగుతుందని, స్వాస్థ్ కార్డ్ ద్వారా రూపాయలు 2 లక్షల 50 వేల వరకు యాక్సిడెంట్స్ బెనిఫిట్స్, 40 వేల రూపాయల వరకు రీయింబర్స్ మెంట్ సౌకర్యం, క్యాష్ బ్యాక్ సౌకర్యం, హెల్త్ చెకప్ బెనిఫిట్స్ ఉన్నాయని తెలిపారు. అనంతరం సుమన్ చేతుల మీదుగా విలేకరులకు స్వాస్త్ కార్డ్‌లు అందజేశారు. ఈ కార్యక్రమం లో,డాక్టర్ నగేష్ ఓమ్ని హాస్పిటల్ గ్రూప్ సి ఈ ఓ ,డాక్టర్ మంజునాథ్,డాక్టర్ హరీస్ గిగిల్స్, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

నాయకత్వ సవాల్

- రోహిత్‌కు అతిపెద్ద కెప్టెన్సీ పరీక్ష
- బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ టెస్టు సిరీస్

ఫిబ్రవరి 2022, భారత జట్టు టెస్టు పగ్గాలు రోహిత్ శర్మ చేతికి అందాయి. కాగితంపైనే మూడు ఫార్మాట్ల కెప్టెన్‌గా కొనసాగుతున్న రోహిత్ శర్మ.. నాయకుడిగా రెండు టెస్టులే ఆడాడు. ఐసీసీ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్ బెర్త్ ఊరిస్తున్న తరుణంలో టెస్టుల్లో నాయకుడిగా రోహిత్ శర్మ తొలిసారి కఠిన పరీక్ష ఎదుర్కొంటున్నాడు. ఆస్ట్రేలియాతో బోర్డర్-గవాస్కర్ టెస్టు సిరీస్ ఫిబ్రవరి 9న నాగ్‌పూర్ టెస్టుతో ఆరంభం కానుంది.





నవతెలంగాణ క్రీడావిభాగం

అసలు మొదలైందా?!

భారత జట్టు కెప్టెన్‌గా రోహిత్ శర్మ ప్రస్థానం ఏడాది కిందటే మొదలైంది. కానీ నిజానికి భారత క్రికెట్‌లో రోహిత్ శర్మ నాయకత్వ శకం మొదలైందా? అంటే కాదనే చెప్పాలి. వైట్‌బాల్ ఫార్మాట్‌లో రోహిత్ శర్మ నాయకత్వం కనిపిస్తున్నా.. టెస్టుల్లో అతడు ప్రయాణమే ఆరంభించలేదు. ఆల్‌ఫార్మాట్ కెప్టెన్‌గా భారత్ చివరి ఐదు టెస్టుల్లో రోహిత్ శర్మ ఏకంగా మూడు టెస్టులకు దూరమయ్యాడు. ఇంగ్లాండ్‌పై టెస్టు సిరీస్‌లో 2-1 ఆధిక్యం సాధించిన చారిత్రక విజయంలో 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు. అంతకుముందే, ఆస్ట్రేలియా గడ్డపై భారత్ చారిత్రక 2-1తో టెస్టు సిరీస్‌ను సొంతం చేసుకుంది. ఆ తర్వాత టెస్టుల్లో విదేశీ జైత్రయాత్రకు బ్రేక్ పడింది. జొహనెస్‌బర్గ్, కేప్‌టౌన్, బర్మింగ్‌హామ్ టెస్టుల్లో భారత్ విజయం సాధించే స్థితిలో ఉండీ పరాజయం పాలైంది. ఇటీవల బంగ్లాదేశ్‌తో టెస్టుల్లో సాధికారిక విజయాలు నమోదు చేయటంలో తేలిపోయింది. కానీ, స్వదేశంలో టీమ్ ఇండియా రికార్డు దుర్భేద్యం. బలమైన ఆస్ట్రేలియాతో ఒత్తిడితో కూడిన సిరీస్‌లో రోహిత్ శర్మ నాయకత్వ పటిమ తేలనుంది. టెస్టుల్లో నాయకుడిగా రోహిత్ శర్మ ప్రభావం ఈ సిరీస్ తేల్చనుంది.

పొంచిఉన్న ప్రమాదం

భారత జట్టు కెప్టెన్‌గా రోహిత్ శర్మ భవితవ్యం ప్రమాదంలోనే కొనసాగుతుంది!. మూడు ఫార్మాట్లలో రోహిత్ శర్మ కెప్టెన్సీ పగ్గాలు కోల్పోయే ప్రమాదంలోనే ఉన్నాడు. టీ20ల్లో హార్దిక్ పాండ్య అనధికార రెగ్యులర్ కెప్టెన్‌గా కొనసాగుతున్నాడు. 2022 ఐసీసీ టీ20 ప్రపంచకప్ అనంతరం రోహిత్ శర్మ పొట్టి ఫార్మాట్‌లో నాయకత్వం సంగతి అటుంచి, అసలు జట్టులోనే నిలువలేదు. ఇక వన్డే ఫార్మాట్‌లో ఈ ఏడాది స్వదేశంలో ఐసీసీ 2023 వన్డే వరల్డ్‌కప్ అతడి భవిష్యత్‌ను నిర్ణయించనుంది. సొంతగడ్డ అనుకూలత, టైటిల్ అంచనాలను సైతం మోసుకొస్తుంది. కప్పు నెగ్గాలనే ఒత్తిడి రోహిత్ శర్మపై ఉంటుంది. వరల్డ్‌కప్‌లో ఏమాత్రం తేడా వచ్చినా.. రోహిత్ శర్మ నాయకత్వం కోల్పోయే ప్రమాదం ఉంది. ఇక టెస్టు క్రికెట్‌లోనూ ఇదే పరిస్థితి కనిపిస్తుంది. 35 ఏండ్ల రోహిత్ శర్మ బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ నెగ్గటంతో పాటు ఐసీసీ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్లో చోటు సాధించాల్సి ఉంది.

ఆ సంగతి బాగా తెలుసు!

జాతీయ జట్టు నాయకుడి గొప్పతనం ద్వైపాక్షిక సిరీస్ విజయాల్లో ఉండదు. ఐసీసీ టోర్నమెంట్‌లో విజయమే నాయకుడి సామర్థ్యానికి కొలమానం. ఈ విషయం చీఫ్ కోచ్ రాహుల్ ద్రవిడ్‌కు బాగా తెలుసు. కెప్టెన్‌గా భారత్‌ను వన్డేల్లో విజయవంతమైన, దూకుడైన ఛేదించే జట్టుగా నిలిపిన రాహుల్ ద్రవిడ్.. నాయకత్వం విషయంలో ఎప్పుడూ 2007 ఐసీసీ వన్డే వరల్డ్‌కప్‌లో గ్రూప్ దశ నుంచి నిష్క్రమించిన జట్టు సారథిగానే కనిపిస్తాడు. ఇదే విషయం రోహిత్ శర్మకు సైతం వర్తించనుంది. 2021 ఐసీసీ టీ20 ప్రపంచకప్‌లో నాకౌట్‌కు అర్హత సాధించని టీమ్ ఇండియాను.. 2022 ఐసీసీ టీ20 ప్రపంచకప్‌లో రోహిత్, ద్రవిడ్ సెమీఫైనల్స్‌కు చేర్చారు. అయితే, వరుస టీ20 ప్రపంచకప్‌లలో టీమ్ ఇండియా పరాజయానికి కారణాలు ఒకటే కావటం గమనార్హం.

వేధిస్తున్న బలహీనతలు

కీలక బోర్డర్-గవాస్కర్ టెస్టు సిరీస్ ముంగిట, టీమ్ ఇండియా పలు సమస్యలు ఎదుర్కొంటుంది. గత రెండేండ్లుగా భీకర ఫామ్‌లో ఉన్న ముగ్గురు కీలక క్రికెటర్లు దూరమయ్యారు. రిషబ్ పంత్, శ్రేయస్ అయ్యర్‌లు పరుగుల వేటలో ముందున్నారు. పంత్ సిరీస్‌కు దూరమవగా.. స్పిన్‌పై అద్భుతంగా అయ్యర్ తొలి టెస్టులో ఆడటం లేదు. పేస్ దళపతి జశ్‌ప్రీత్ బుమ్రా సైతం అందుబాటులో లేడు. ఈ ముగ్గురు ఆటగాళ్లు లేకుండా బరిలోకి దిగుతుండటం ప్రత్యర్థి జట్టుకు అనుకూలించే పరిణామం. ఇక స్టార్ బ్యాటర్లు విరాట్ కోహ్లి, చతేశ్వర్ పుజారలు అంచనాల మేరకు రాణించటం లేదు. 2021 ఆరంభం నుంచి పుజార సగటు 34.61 కాగా, విరాట్ కోహ్లి సగటు 23.85. రోహిత్ శర్మ టెస్టు ఫామ్‌పై ఇప్పుడే ఏమీ చెప్పలేని స్థితి. ఎందుకంటే, మార్చి 2022 తర్వాత రోహిత్ శర్మ ఒక్క టెస్టు మ్యాచ్‌లో బరిలోకి దిగలేదు.

నాయకుడిగా నిలబడేనా?

బోర్డర్-గవాస్కర్ టెస్టు సిరీస్ విజయం సాధించినా, విఫలమైన రోహిత్ శర్మ నాయకత్వ శకం స్వల్పకాలికమే. ఈ సిరీస్ విజయం భారత ఐసీసీ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్ అవకాశాలను నిర్దేశించనుంది. 2013 నుంచి ఐసీసీ టైటిల్‌కు దూరంగా ఉంటున్న టీమ్ ఇండియాకు ఆ లోటు తీర్చేందుకు రోహిత్ శర్మకు వరుసగా మూడు అవకాశాలు ముందున్నాయి. 2023 వన్డే వరల్డ్‌కప్, ఐసీసీ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్ సహా 2024 టీ20 ప్రపంచకప్‌లో వరుసగా ఉన్నాయి. నాయకుడిగా చరిత్రలో నిలిచేందుకు రోహిత్ శర్మకు ఇందులో ఒక్క విజయం చాలు!. భారత క్రికెట్ చరిత్రలోనే అత్యంత విలువైన, ప్రతిభావంతులైన యువ క్రికెటర్లతో కూడిన టెస్టు జట్టుకు సారథ్యం వహిస్తున్న రోహిత్ శర్మ... స్వదేశంలో బోర్డర్-గవాస్కర్ ట్రోఫీని అందుకుంటాడా? ఐసీసీ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్లో చోటు సాధిస్తాడా? చూడాలి.

జోష్ హాజెల్‌వుడ్ అవుట్

గాయంతో తొలి టెస్టుకు దూరం



బెంగళూర్ : ఆస్ట్రేలియా పేసర్ జోష్ హాజెల్‌వుడ్ గాయంతో తొలి టెస్టుకు దూరమయ్యాడు. సఫారీతో సిడ్నీ టెస్టులో గాయపడిన హాజెల్‌వుడ్.. బెంగళూర్‌లో పెద్దగా సాధన చేయలేదు. మ్యాచ్‌కు రెండు రోజుల ముందు బౌలింగ్ సాధన చేస్తానని కోచ్‌తో చెప్పాడు. కానీ రనౌప్ సమయంలో ఎడమ కాలు తీవ్రంగా వేధిస్తుండటంతో హాజెల్‌వుడ్ ఫిజియోకు ఫిర్యాదు చేశాడు. నాగ్‌పూర్ టెస్టుతో పాటు రెండో టెస్టు (న్యూఢిల్లీ)కు సైతం హాజెల్‌వుడ్ అనుమానంగానే మారాడు. దీంతో స్కాట్ బొలాండ్ విదేశీ గడ్డపై తొలి టెస్టు ఆడనున్నాడు.

ముఖేశ్ మెమోరియల్ 'మల్లయుద్ధ'

ఫిబ్రవరి 9-12 వరకు ఎల్బీ స్టేడియంలో రెజ్లింగ్ టోర్నీ



హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలో ప్రతిభావంతులైన రెజ్లింగ్ క్రీడాకారులను గుర్తించి, ఉపకారవేతనాలు అందించటమే లక్ష్యంగా ముఖేశ్ గౌడ్ మెమోరియల్ 'మల్లయుద్ధ' టోర్నమెంట్ నిర్వహించనున్నారు. ఫిబ్రవరి 9 నుంచి 12 వరకు ఎల్బీ స్టేడియంలో జరిగే కుస్తీ పోటీల్లో రూ.35 లక్షల నగదు బహుమతి అందిస్తున్నట్టు ఆదివారం జరిగిన మీడియా సమావేశంలో నిర్వాహకులు, శ్రేష్ఠ్ ఫౌండేషన్ ఫౌండర్ విక్రమ్ గౌడ్ ప్రకటించారు. ' మా నాన్న కెరీర్ ఓ రెజ్లర్‌గా మొదలైంది. బస్తీ ప్రజల్లో ముఖేశ్ గౌడ్ పేరు చిరస్థాయిగా నిలిచిపోయింది. రెజ్లింగ్ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఏదైనా కార్యక్రమం చేయాలని ఆయన తపించేవారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా రెజ్లింగ్‌లో మల్లయుద్ధ చాంపియన్‌షిప్ నిర్వహిస్తున్నాం. బాల కేసరి నుంచి 100 ప్లస్ కేజీల విభాగం వరకు 17 కేటగిరీల్లో పోటీలు ఉంటాయి. సుమారు వెయ్యి మంది రెజ్లర్లు ఈ పోటీల్లో పోటీపడనున్నారు. ప్రతి విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన కుస్తీ క్రీడాకారులను ఎంపిక చేసి జాతీయ, అంతర్జాతీయ పోటీలకు సన్నద్ధమయ్యేందుకు ఆర్థిక సహకారం అందిస్తాం. రాష్ట్రంలో కుస్తీ క్రీడకు పూర్వ వైభవం తీసుకురావటమే లక్ష్యంగా ఈ మల్లయుద్ధ నిర్వహిస్తున్నామని' దివంగత ముఖేశ్ గౌడ్ కుమారుడు విక్రమ్ గౌడ్ పేర్కొన్నారు. తెలంగాణ రెజ్లింగ్ సంఘం, హైదరాబాద్ రెజ్లింగ్ సంఘం సహకారంతో 'మల్లయుద్ధ'ను ప్రపంచ స్థాయి ప్రమాణాలతో ఇక నుంచి ప్రతి ఏడాది నిర్వహిస్తున్నామని విక్రమ్ గౌడ్ తెలిపారు.

విజేతలు గాయత్రి, చంద్రశేఖర్ జోడీ

హైదరాబాద్ ఓపెన్ టెన్నిస్ టోర్నీ



హైదరాబాద్ : నాలుగు రోజుల పాటు క్రీడాస్ఫూర్తితో సాగిన 12వ హైదరాబాద్ ఓపెన్ టెన్నిస్ టోర్నమెంట్ ఆదివారం ఘనంగా ముగిసింది. దేశవ్యాప్తంగా 339 క్రీడాకారులు పోటీపడిన మెగా ఈవెంట్‌లో పలు విభాగాల్లో సీడెడ్ అథ్లెట్లు సైతం టైటిల్ రేసులో నిలిచారు. మిక్స్‌డ్ డబుల్స్ విభాగం ఫైనల్లో గాయత్రి, చంద్రశేఖర్ జోడీ హరికష్ణ రెడ్డి, శశికళ జోడీపై 8-4తో విజయం సాధించి టైటిల్ సొంతం చేసుకున్నారు. మెన్స్ 50 ప్లస్ డబుల్స్ విభాగంలో హరి కష్ణ రెడ్డి, రియాజ్ జోడీ నంద్యాల నర్సింహారెడ్డి, నీల్‌కాంత్‌లపై 10-5తో విజయం సాధించారు. మెన్స్ 40 ప్లస్ డబుల్స్ విభాగంలో ప్రదీప్ కుమార్, శ్రీరామ్‌లు 10-7తొ శ్రీనివాస్ గౌడ్, శ్రీకర్‌లపై అలవోక విజయంతో ట్రోఫీ సాధించారు. మెన్స్ 60 ప్లస్ డబుల్స్‌లో మెహర్ ప్రకాశ్, వి. శంకర్‌లు 10-9 (7-5)తో టైబ్రేకర్‌లో మనోహర్, రవిశంకర్‌లపై పైచేయి సాధించి టైటిల్ కొట్టారు. మెన్స్ 60 ప్లస్ సింగిల్స్‌లో మెహర్ ప్రకాశ్, మెన్స్ 70 ప్లస్ సింగిల్స్‌లో రామమోహన్ రావు, 50 ప్లస్ సింగిల్స్‌లో నీల్‌కాంత్‌లు విజేతలుగా నిలిచారు. మహిళల విభాగం టైటిల్ పోరులో (30 ప్లస్ డబుల్స్) నీలం అగర్వాల్, నయనతార జోడీ 8-4తో సౌమ్య నాయుడు, అరుణ భాస్కర్‌లపై గెలుపొందారు. వివిధ విభాగాల్లో విజేతలుగా నిలిచిన వారికి ఖమ్మం జిల్లా, సెషన్స్ జడ్జీ అపర్ణ, హైదరాబాద్ ఓపెన్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షులు నంద్యాల నర్సింహారెడ్డి బహుమతులు ప్రధానం చేశారు.

నవచిత్రం

ఏప్రిల్ 28న ఏజెంట్ రిలీజ్




అఖిల్ అక్కినేని, సురేందర్ రెడ్డి కాంబినేషన్‌లో రూపొందుతున్న పాన్ ఇండియా ప్రాజెక్ట్ 'ఏజెంట్' థియేట్రికల్ విడుదలకు సిద్ధమవుతోంది. న్యూ ఇయర్ సందర్భంగా మేకర్స్ మేకింగ్ వీడియోను విడుదల చేసి 'ఏజెంట్'ని వేసవిలో విడుదల చేస్తున్నట్లు చెప్పారు. తాజా అప్‌డేట్ ప్రకారం ఈ చిత్రం ఏప్రిల్ 28న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా థియేటర్లలో సందడి చేయనుంది. ఈ సినిమా హాలిడే సీజన్‌లో క్యాష్ చేసుకోబోతోంది. అలాగే పాన్ ఇండియా రిలీజ్ కోసం సమ్మర్ బెస్ట్ సీజన్. వైల్డ్ యాక్షన్ గ్లింప్స్ ద్వారా మేకర్స్ విడుదల తేదీని ప్రకటించారు. అఖిల్‌ని కుర్చీకి కట్టేసి, తలకు మాస్క్ కప్పారు. అతను పని చేస్తున్న ఏజెన్సీ గురించి అడిగినప్పుడు, "ఒసామా బిన్ లాడెన్, గడాఫీ, హిట్లర్" అని సమాధానమిచ్చాడు. ముఖం అంతా రక్తంతో నిండి.. తనని తాను వైల్డ్ సాలే పిలవడం క్యూరియాసిటీ పెంచింది.

విడుదల తేదీ గ్లింప్స్ చాలా వైల్డ్‌గా ఉంది . అఖిల్ పాత్ర వైల్డ్ సైడ్‌ను ప్రజెంట్ చేసింది. అఖిల్ ఈ చిత్రంలో పొడవాటి, గిరజాల జుట్టుతో విభిన్నమైన గెటప్స్‌లో కనిపించనున్నారు. ఈ సినిమా కోసం స్టైలిష్ మేక్‌ఓవర్ అయ్యారు. సిక్స్ ప్యాక్ అబ్స్‌తో కనిపిస్తాడు. సురేందర్ రెడ్డి ఈ చిత్రాన్ని ఇతర స్పై థ్రిల్లర్‌లకు పూర్తి భిన్నంగా రూపొందించారు. సాక్షి వైద్య అఖిల్ కు జోడిగా నటిస్తోంది. మమ్ముట్టి కీలక పాత్రలో కనిపించనున్నారు.

ఈ చిత్రానికి కథను వక్కంతం వంశీ అందించారు. ఎకె ఎంటర్‌టైన్‌మెంట్స్, సురేందర్ 2 సినిమా పతాకాలపై రామబ్రహ్మం సుంకర నిర్మిస్తున్న ఈ చిత్రానికి జాతీయ అవార్డు గ్రహీత నవీన్ నూలి ఎడిటర్‌గా, అవినాష్ కొల్లా ఆర్ట్ డైరెక్టర్‌గా పని చేస్తున్నారు. అజయ్ సుంకర, దీపా రెడ్డి సహ నిర్మాతలుగా వ్యవహరిస్తున్న ఈ చిత్రం తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో పాన్ ఇండియా విడుదల కానుంది. ఈ చిత్రానికి దర్శకుడు: సురేందర్ రెడ్డి, నిర్మాత: రామబ్రహ్మం సుంకర, సహ నిర్మాతలు: అజయ్ సుంకర, దీపా రెడ్డి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: కిషోర్ గరికిపాటి, కథ: వక్కంతం వంశీ, సంగీతం: హిప్ హాప్, డీఓపీ: రసూల్ ఎల్లోర్.

రైటర్ పద్మభూషణ్‌ని ఆదరిస్తున్న ప్రేక్షకులకు కృతజ్ఞతలు



విజయానందంలో 'రైటర్ పద్మభూషణ్' చిత్ర యూనిట్

సుహాస్ నటించిన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ రైటర్ పద్మభూషణ్. నూతన దర్శకుడు షణ్ముఖ ప్రశాంత్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో టీనా శిల్పరాజ్ కథానాయిక. ఛాయ్ బిస్కెట్ ఫిల్మ్స్, లహరి ఫిల్మ్స్ బ్యానర్స్ పై అనురాగ్ రెడ్డి, శరత్ చంద్ర, చంద్రు మనోహర్ నిర్మించిన ఈ చిత్రాన్ని జి. మనోహర్ సమర్పించారు. ఈ సినిమా ప్రిమియర్స్‌కు ప్రేక్షకుల నుంచి గ్రేట్ రెస్పాన్స్ వచ్చింది. ఈనెల 3న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదలై, విశేష ప్రేక్షకాదరణ రాబట్టుకుంది.

ఈ నేపథ్యంలో హీరో సుహాస్ మాట్లాడుతూ.. 'అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. విడుదలకు ముందు ప్రిమియర్స్ చాలా ఫాస్ట్‌గా ఫిల్ అవుతున్నాయి. చాలా ఆనందంగా వుంది. నా మొదటి థియేటర్ రిలీజ్ ఇది. సినిమా చూసిన చాలా మంది నన్ను దీవిస్తుంటే అనందంతో నాకు మాట రాలేదు. ఇలాంటి ఓ మంచి సినిమాలో నటించినందుకు చాలా గర్వంగా ఉంది. కొత్త దనంతో సినిమా ఉంటే ప్రేక్షకులు కచ్చితంగా ఆదరిస్తారని మా సినిమా నిరూపించింది. మీరు ఇచ్చే ప్రోత్సాహంతో భవిష్యత్తులోనూ మరిన్ని మంచి సినిమాలతో అలరిస్తాను. ఈ విజయాన్ని జీవితంలో మరచిపోలేను' అని అన్నారు.

శరత్ మాట్లాడుతూ, 'మేము సక్సెస్ కొట్టేసినట్లు ఫీలౌతున్నాం. గత ఆరు రోజులుగా.. విజయవాడ, గుంటూరు, భీమవరం, కాకినాడ, వైజాగ్, హైదరాబాద్ కి టీం అంతా వెళ్లి అక్కడ కొందరితో కలిసి వాళ్ళన్ని థియేటర్‌లోకి తెచ్చాం. ప్రేక్షకులు సినిమా చూస్తున్నపుడు ప్రతి ఐదు నిమిషాలకు ఒకసారి థియేటర్లో అందరూ గట్టిగా నవ్వడం మర్చిపోలేని అనుభూతి. చాలా అద్భుతమైన రెస్పాన్ వచ్చింది. ఒక పెద్ద స్టార్‌కి ఉండే రెస్పాన్స్ మా మొదటి సినిమాకి వుండటం చాలా ఆనందాన్ని ఇచ్చింది. వర్డ్ ఆఫ్ మౌత్ ని నమ్ముకొని వెళ్తున్నాం. మీకు సినిమా నచ్చితే మరో పది మందికి చెప్పండి. ఈ సినిమా టికెట్ రేట్లు తగ్గించాం. మల్టీ ప్లెక్స్ లో 150(జీఎస్టీతో కలుపుకొని). తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, ఒరిస్సా, కర్ణాటక , యుఎస్ , కెనడా, ఆస్ట్రేలియా లో విడుదలై మంచి ఆదరణ పొందింది' అని అన్నారు.

షణ్ముఖ ప్రశాంత్ మాట్లాడుతూ, 'సినిమా చూసిన ప్రేక్షకులు రియాక్షన్ చూస్తుంటే ఆనందంతో కన్నీళ్లు వస్తున్నాయి. మా సినిమాని పెద్ద హిట్ చేశారు. చిన్న సినిమాగా విడుదలై పెద్ద సినిమా రేంజ్‌లో ఆదరణ పొందుతోంది. ఓ మంచి సినిమాలో భాగమైనందుకు చాలా సంతోషంగా ఉంది' అని తెలిపారు.

నాయిక టీనా శిల్పరాజ్ మాట్లాడుతూ,' ఇది నా మొదటి సినిమా. ప్రేక్షకుల ఆదరణ, స్పందన చూసినపుడు ఆనందంతో కన్నీళ్లు వచ్చాయి. ఈ సినిమాలో భాగం కావడం గొప్ప ఆనందాన్ని ఇచ్చింది. అందరూ సినిమాని ఆదరిస్తారని కోరుకుంటున్నాను' అని అన్నారు.

గౌరీ మాట్లాడుతూ,' చాలా గొప్పగా ప్రేక్షకులు ఆదరించారు. ఈ సినిమాలో భాగం కావడం ఆనందంగా వుంది. అందరూ ఫ్యామిలీతో వచ్చి ఈ సినిమా చూడాలి' అని చెప్పారు.

చంద్రు మనోహర్ మాట్లాడుతూ, 'ఇప్పటికే ఆరు స్క్రీన్స్ అయ్యాయి. అద్భుతమైన స్పందన వచ్చింది. లహరి మ్యూజిక్ 35 ఏళ్లగా మ్యూజిక్ ఇండస్ట్రీలో వుంది. తొలిసారి ఈ చిత్రంతో ప్రొడక్షన్ చేయడం ఆనందంగా వుంది. విజయం సాధించిన ఆనందం వుంది. మీ అందరి సపోర్ట్ కావాలి' అని చెప్పారు. కళ్యాణ్ నాయక్ మాట్లాడుతూ, 'ఇంత మంచి సినిమా ఇచ్చిన దర్శక నిర్మాతలకు కృతజ్ఞతలు. ఇది మర్చిపోలేని అనుభూతిని ఇచ్చింది' అని అన్నారు.

నేడే రాష్ట్ర పద్దు

రూ.2.80 లక్షల కోట్ల నుంచి రూ.3 లక్షల కోట్ల వరకు...?

- ముహూర్తం నేటి ఉదయం 10.30 గంటలు
- శాసనసభలో హరీశ్‌రావు.. మండలిలో వేముల...
- నేడు రాష్ట్ర బడ్జెట్ ప్రతిపాదన
- ఎన్నికల ఏడాది కావటంతో సర్వత్రా ఆసక్తి
- నిరుద్యోగ భృతి, రైతు రుణమాఫీ, డబుల్ బెడ్ రూం ఇండ్లకు ప్రాధాన్యత దక్కేనా..?

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

'ఇప్పటిదాకా ఒక లెక్క.. ఇప్పుడు మరో లెక్క...' అనే విధంగా రాష్ట్ర ప్రభుత్వం సోమవారం బడ్జెట్‌ను ప్రవేశపెట్టబోతున్నది. ఇది ఎన్నికల సంవత్సరం కావటమే అందుకు కారణం. షెడ్యూల్ ప్రకారం ఈ యేడాది నవంబరు లేదా డిసెంబరులో రాష్ట్ర శాసనసభకు ఎన్నికలను నిర్వహించాల్సి ఉంటుంది. ఈ క్రమంలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి బీఆర్ఎస్ సర్కారు సోమవారం ప్రవేశ పెట్టబోయేదే చివరి బడ్జెట్. అందువల్ల ఇది పూర్తిగా ఎలక్షన్ కోణంలోనే ఉండబోతోందని ఆర్థిక నిపుణులు, విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈసారి భారీ పద్దునే ప్రవేశపెట్టే అవకాశాలున్నాయని వారు అభిప్రాయపడుతున్నారు. గతేడాది (2022-23) రూ.2,56,958 కోట్లతో పద్దును ప్రతిపాదించిన సర్కారు... ఇప్పుడు అంతకు మించి భారీ బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుందని సమాచారం. ఆ రీత్యా చూసినప్పుడు రూ.2.80 లక్షల కోట్ల నుంచి రూ.3 లక్షల కోట్ల వరకూ పద్దు పెరిగే అవకాశముంది. అయితే ఈసారైనా నిరుద్యోగ భృతి, రైతు రుణ మాఫీ, డబుల్ బెడ్ రూం ఇండ్లు, దళితులకు మూడెకరాల భూ పంపిణీ, కేజీ టూ పీజీ తదితర ప్రాధాన్యతాంశాలకు బడ్జెట్‌లో పెద్ద పీట వేస్తారా..? లేదా..? అనేది చూడాలి. ముఖ్యమంత్రి కేసీఆర్ అత్యంత ప్రతిష్టాత్మకంగా భావించే సాగునీటి పారుదల, రైతు బంధు, రైతు బీమా, ఆసరా పెన్షన్లు, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, తెలంగాణకు హరితహారం తదితరాంశాలకు ఎప్పటి మాదిరిగానే అధిక కేటాయింపులు ఉండబోతున్నాయి. వాటితోపాటు రోడ్లు, భవనాలు, ఫ్లై ఓవర్లు, ఓఆర్ఆర్ తదితర నిర్మాణాలకు కూడా ఎక్కువ నిధులు దక్కేలా బడ్జెట్‌ను రూపొందించినట్టు సమాచారం. ఈ రకంగా రూపొందించిన పద్దును సోమవారం ఉదయం 10.30 గంటలకు శాసనసభలో ఆర్థిక మంత్రి తన్నీరు హరీశ్‌రావు, శాసన మండలిలో సభా వ్యవహారాల మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ప్రతిపాదించనున్నారు. ఈ మేరకు సీఎం కేసీఆర్ ఇప్పటికే వారిద్దరికీ దిశా నిర్దేశం చేశారు.

మరోవైపు రాష్ట్ర వార్షిక బడ్జెట్ (2023-24)కు మంత్రివర్గం ఆమోదముద్ర వేసింది. హైదరాబాద్‌లోని ప్రగతి భవన్‌లో సీఎం కేసీఆర్ అధ్యక్షతన ఆదివారం ఉదయం 10.29 గంటలకు ప్రారంభమైన రాష్ట్ర కేబినెట్ సుమారు 50 నిమిషాలపాటు కొనసాగింది. బడ్జెట్ ప్రతిపాదనలపై చర్చించి ఆమోదం తెలిపింది. అనంతరం సీఎం... నాందేడ్‌లో బీఆర్ఎస్ ఆధ్వర్యాన తలపెట్టిన బహిరంగ సభకు బయల్దేరి వెళ్లారు.

సీనియారిటీ జాబితాలు సమగ్రంగా రూపొందించాలి

పదోన్నతులలో అన్ని ఖాళీలను భర్తీ చేయాలి

- బదిలీల ప్రక్రియ ముగిసిన వెంటనే నియామకాలకు నోటిఫికేషన్ ఇవ్వాలి : టీఎస్‌యూటీఎఫ్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పదోన్నతులకు అర్హత కలిగిన ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాలు సబార్డినేట్ సర్వీస్ నిబంధనలకు అనుగుణంగా అన్ని జిల్లాల్లో ఒకే రకంగా సమగ్రంగా రూపొందించాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వర్గ (ఆఫీసు బేరర్స్) సమావేశం డిమాండ్ చేసింది. తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) రాష్ట్ర ఆఫీసు బేరర్ల సమావేశం ఆదివారం టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షులు కె.జంగయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నర్సిరెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ పూర్తి అయిన వెంటనే అన్ని ఖాళీలకు నోటిఫికేషన్ ఇవ్వాలని తద్వారా వచ్చే విద్యా సంవత్సరం ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత లేకుండా చూడాలని కోరారు. పండితులు, వ్యాయమ ఉపాధ్యాయులకు అందరితోపాటే పదోన్నతులు ఇవ్వాలనీ, రాష్ట్ర ముఖ్యమంత్రి అసెంబ్లీలో ప్రకటించిన విధంగా 5,571 ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయుల పోస్టులను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. జీఓ 317 ద్వారా పొరుగు జిల్లాలకు కేటాయించబడిన ఉపాధ్యాయులను పదోన్నతుల అనంతరం ఏర్పడిన ఖాళీల్లో సొంత జిల్లాలకు తీసుకురావాలనీ, మిగిలిన 13 జిల్లాల దంపతుల బదిలీలు పూర్తి చేయాలని సూచించారు.ప్రధాన కార్యదర్శి చావ రవి మాట్లాడుతూ ఉపాధ్యాయుల అభ్యంతరాలను స్వీకరించి సమగ్రమైన జాబితాలు రూపొందించాలన్నారు. పదోన్నతుల సందర్భంగా ఆసక్తి ఉన్న ఉపాధ్యాయులతో అన్ని ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. ఇటీవల జరిగిన 615 స్పౌజ్ బదిలీలు పదోన్నతులకు నిర్దేశించిన పోస్టులలోనే చేసినందున తద్వారా ఆయా జిల్లాల్లో ఏర్పడిన ఖాళీలను పదోన్నతుల కోటాలోనే చేర్చాలని డిమాండ్ చేశారు. రంగారెడ్డి, మేడ్చల్ తదితర జిల్లాల్లో పైరవీ బదిలీల ద్వారా సబ్జెక్టేతర ఖాళీ (అగైనెస్ట్ వేకెన్సీ) లో నియమించబడిన ఉపాధ్యాయుల పోస్టులను ఆయా సబ్జక్టుల పదోన్నతులకు ఖాళీలుగా చూపాలని రవి డిమాండ్ చేశారు. ఆశ్రమ పాఠశాలలు, మోడల్ స్కూల్, గురుకుల ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు, కేజీబీవీ బదిలీలు నిర్వహించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉద్యోగుల ఆరోగ్య పథకం అమలుపై సంఘాలతో సమావేశం నిర్వహించాలనీ, అన్ని యాజమాన్యాల ఉపాధ్యాయులకు ఆరోగ్యకార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్ ఉపాధ్యాయ నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల్లో టిఎస్ యుటిఎఫ్ అభ్యర్థి పాపన్నగారి మాణిక్ రెడ్డి గెలుపు కోసం అన్ని జిల్లాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని సమావేశం తీర్మానించింది. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు సీహెచ్ రాములు, కోశాధికారి టి.లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ అభ్యర్థి మాణిక్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు కె.సోమశేఖర్, ఎం. రాజశేఖర్ రెడ్డి, జి నాగమణి, ఇ.గాలయ్య, బి.రాజు, ఎస్.రవిప్రసాద్, కె.రవికుమార్, జి శ్రీధర్, ఎ సింహాచలం, వై జ్ఞానమంజరి, ఎస్. కె.మహబూబ్ అలీ పాల్గొన్నారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

బాబా రాందేవ్‌పై కేసు



జైపూర్ : ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా ప్రసంగించిన యోగా గురు బాబా రాందేవ్‌పై కేసు నమోదయింది. రాజస్థాన్‌లోని బర్మేర్ జిల్లాలోని చౌహతన్ పోలీస్‌స్టేషన్‌లో స్థానిక నివాసి పతే ఖాన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు ఈ కేసు నమోదు చేశారు. ఈ నెల 2న ఇక్కడ జరిగిన ఒక సభలో ముస్లింలు, క్రిస్టియన్లు మతమార్పిడులు చేస్తారని, ఉగ్రవాద కార్యక్రమాలకు పాల్పడతారని, కిడ్నాపులు చేస్తారని రాందేవ్ విద్వేష ప్రసంగం చేశారు.

మంత్రి ఎవరి కోసం పనిచేస్తున్నారు

- తన నియోజకవర్గంలోని దళితులపై దాడులు పట్టించుకోరా? : వి శ్రీనివాసరావు



భట్టిప్రోలు : దళితులపై దాడులు జరిగితే స్పందించని స్థానిక మంత్రి ఎవరి కోసం పని చేస్తున్నారో చెప్పాలని సీపీఐ(ఎం) ఏపీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. బాపట్ల జిల్లా కొల్లూరు మండలం చింతల్లంక, పెదలంక గ్రామాల్లో బాధితులు, పేదల పక్షాన నిలబడి అక్రమ కేసులకు గురై జైలు పాలైన సీపీఐ(ఎం) కొల్లూరు మండల కార్యదర్శి తోడేటి సురేష్ కుటుంబాన్ని ఆదివారం ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ పేదల పక్షాన పోరాడే కమ్యూనిస్టులకు కేసులు, జైళ్లు కొత్తేమీ కాదని, వాటికి భయపడాల్సిన పనిలేదని పేర్కొన్నారు. భూ సమస్య పరిష్కారం అయ్యేంత వరకు పార్టీ అండగా ఉంటుందన్నారు. దళిత నియోజకవర్గంలో దళితుల సమస్యలు పరిష్కరించాల్సిన స్థానిక మంత్రి తన స్వార్థ ప్రయోజనాల కోసం దళితులపై అధికారులతో అక్రమ కేసులు బనాయింపజేయడం దుర్మార్గమని దుయ్యబట్టారు. భూమి కోసం పోరాటం, ధర్నా చేయడం పేదవాడి ప్రాథమిక హక్కని తెలిపారు. దేశానికి స్వాతంత్ర్యం కూడా ఆనాడు ధర్నాలు, సత్యాగ్రహాలతోనే వచ్చిందని గుర్తు చేశారు. భూమి కోసం చదును చేస్తూ పిచ్చికంపను తొలగించడం నేరమా? అని ప్రశ్నించారు. సమస్య పరిష్కారంలో తహశీల్దార్ ఉపేక్ష వల్లే దళితులపై అగ్రవర్ణ పెత్తందార్లు పోలీసుల సాక్షిగా దాడులకు తెగబడ్డారని విమర్శించారు. ప్రభుత్వ భూములు, ఆర్‌సి భూములు పేదవాడికి అప్పగించాలని చట్టంలో ఉందని తెలిపారు. కోనేరు రంగారావు కమిటీ సిఫార్సులను ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. సురేష్‌ను విడుదల చేసి దాడులకు కారణాలపై తగిన విచారణ చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.రమాదేవి, సీపీఐ(ఎం) బాపట్ల జిల్లా కార్యదర్శి సిహెచ్.గంగయ్య, కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి అంద్ర మాల్యాద్రి, సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు టి.కృష్ణమోహన్ పాల్గొన్నారు.

తలశిల రఘురామ్‌కు సతీవియోగం



విజయవాడ : వైసీపీ శాసనమండలి సభ్యులు తలశిల రఘురాం సతీమణి స్వర్ణకుమారి (44) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె విజయవాడలోని ఓ ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారు. స్వర్ణకుమారి మృతిపై ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సిఎం దంపతులు విజయవాడ గొల్లపూడిలోని తలసిల రఘురాం నివాసానికి వచ్చారు. రఘురాం భార్య స్వర్ణకుమారి భౌతికకాయానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. స్వర్ణకుమారి భౌతికకాయాన్ని రాష్ట్ర మంత్రులు జోగి రమేష్, మేరుగ నాగార్జున, ఎమ్మెల్యేలు పేర్ని నాని, కొడాలి నాని, వసంత వెంకట కృష్ణ ప్రసాద్, కైలే అనిల్, సింహాద్రి రమేష్, బాలినేని, గొల్లపూడి ఎఎంసి మాజీ చైర్మన్ కొమ్మ కోట్లు, యర్రారెడ్డి నాగిరెడ్డి, కాటంనేని పూర్ణ, ఒంకర్ రెడ్డి, ఎంపిపి ప్రసన్నకుమారి, తదితరులు సందర్శించి నివాళులర్పించారు. ఆదివారం సాయంత్రం గొల్లపూడిలోని స్మశాన వాటిలో కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. స్వర్ణకుమారి మృతి పట్ల రాష్ట్ర గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

ఉత్తమ్ వ్యాఖ్యలు ఊహాజనితం

- బోయినపల్లి వినోద్ కుమార్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఈ నెలాఖరు నాటికి రాష్ట్ర శాసనసభ రద్దయి, రాష్ట్రపతి పాలన వస్తుందంటూ కాంగ్రెస్ ఎంపీ ఉత్తమ్ కుమార్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు బోయినపల్లి వినోద్ కుమార్ తీవ్రంగా ఖండించారు. అవన్నీ ఊహాజనితాలని కొట్టి పారేశారు. అసలు శాసనసభ ఎందుకు రద్దవుతుందంటూ ప్రశ్నించారు. ప్రజాస్వామిక వ్యవస్థలో ఊహాజనిత వ్యాఖ్యలకు తావుండబోదని స్పష్టం చేశారు.

న్యాయ వ్యవస్థ పట్ల ప్రజల విశ్వాసాన్ని రక్షించాలి

- రాష్ట్ర హై కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్
- కోర్టు ప్రొసీడింగ్స్ స్థానిక భాషల్లో ఉండే దిశగా చర్యలు
- పెండింగ్ కేసుల పరిష్కారానికి అందరూ సహకరించాలి
- 1013కేసులు జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు బదలాయింపు



నవతెలంగాణ - ధర్మారం

న్యాయ వ్యవస్థ పట్ల ప్రజలకు ఉన్న నమ్మకాన్ని సంరక్షించే దిశగా మనమంతా కృషి చేయాలని రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్ అన్నారు. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం నంది మేడారం గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రారంభోత్సవానికి హాజరైన రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, హై కోర్టు జడ్జీలకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం. నాగరాజు, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.సంగీత సత్యనారాయణ, పోలీస్ కమిషనర్ రేమా రాజేశ్వరి, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఆర్. సురేష్ బాబు స్వాగతం పలికారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కోర్టుల్లో వాడే భాష స్థానిక ప్రజలకు అర్థమయ్యే రీతిలో ఉంటే మరింత చేరువగా న్యాయ వ్యవస్థ పని చేయగలుగుతుందని సూచించారు. క్షేత్రస్థాయి న్యాయస్థానాల్లో స్థానిక భాష ఉపయోగించడం వల్ల మంచి ఫలితాలు, ప్రజల్లో నమ్మకం పెరుగుతున్నదని తెలిపారు. నంది మేడారంలో జూనియర్ సివిల్ జడ్జ్ కోర్టు ఏర్పడటం చారిత్రాత్మిక అంశమని, దీనివల్ల ప్రజల సమీపంలో న్యాయం అందే అవకాశాలు మెరుగవుతాయన్నారు. జిల్లాలోని అన్ని కోర్టుల పరిధిలో 16,465 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటి పరిష్కారానికి మౌలిక వసతుల మెరుగుదల, నూతన కోర్టుల ఏర్పాటు వంటి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. న్యాయవ్యవస్థలో రూల్ ఆఫ్ లా అందరికీ సమానంగా అమలు కావాలని, సమాజంలోని ప్రతి పౌరునికి, వెనుకబడిన వర్గాల ప్రజలకు సమాంతరంగా న్యాయ సేవలు తప్పనిసరిగా అందాలన్నారు. న్యాయ వ్యవస్థ పట్ల ప్రజలకు ఉన్న నమ్మకాన్ని నిలబెట్టుకునే దిశగా మనమంతా సమిష్టిగా పనిచేయాలని, కోర్టులో న్యాయవాదులు, జడ్జిల ప్రవర్తన మార్గదర్శకాలు మేరకు మర్యాద పూర్వకంగా ఉండాలని సూచించారు. నంది మేడారంలో జూనియర్ సివిల్ జడ్జి కోర్టు భవనాన్ని త్వరగా తయారు చేసేందుకు సహకరించిన జిల్లా కలెక్టర్, అధికార యంత్రానికి ఆయన అభినందనలు తెలిపారు. హైకోర్టు జడ్జి జస్టిస్ నవీన్ రావు మాట్లాడుతూ.. తన గ్రామంలో జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏర్పాటు కావడం పట్ల సంతోషాన్ని వ్యక్తం చేశారు. అడ్మినిస్ట్రేటివ్ జడ్జి ఎన్.వి. శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ.. పెండింగ్ కేసుల పరిష్కారానికి సాంకేతికతను వినియోగిస్తూ నూతన కోర్టుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. నంది మేడారంలో ఏర్పాటు చేసిన జూనియర్ సివిల్ జడ్జి కోర్టు పరిధికి 281సివిల్ కేసులు, 732 క్రిమినల్ కేసులు మొత్తం 1013 కేసులు బదిలీ చేసినట్టు తెలిపారు. అనంతరం స్థానిక ప్రజాప్రతినిధులు, జిల్లా బార్ అసోసియేషన్ సభ్యులు రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, హైకోర్టు జడ్జిలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో 14 మంది హై కోర్టు జడ్జీలతో పాటు పెద్దపల్లి ప్రిన్సిపాల్ జిల్లా సెషన్స్ జడ్జి ఎం.నాగరాజు, పెద్దపల్లి బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఆర్. సురేష్ బాబు, సెక్రటరీ భాస్కర్,పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లు ఏమైంది?

- ఈనెల13న హైదరాబాద్, విజయవాడ జాతీయరహదారి దిగ్బంధనం : ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ



నవతెలంగాణ- జగిత్యాలటౌన్

బీజేపీ అధికారంలోకి వస్తే ఎస్సీ వర్గీకరణ బిల్లు తీసుకొస్తామని 2013 ఎన్నికల సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీ, బీజేపీ నాయకులు వెంకయ్య నాయుడు, కిషన్‌రెడ్డి, బండారు దత్తాత్రేయ సమక్షంలో మాట ఇచ్చి పదేండ్లు గడుస్తున్నా నేటికీ ఆ దిశగా ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం బాధాకరమని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణమాదిగ అన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ బిల్లు విషయంలో కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా ప్రధాని మోడీ రాష్ట్రానికి ఫిబ్రవరి 13న వస్తున్నాడన్న సమాచారం మేరకు హైదరాబాద్ - విజయవాడ జాతీయ రహదారి దిగ్బంధనం చేస్తున్నట్టు తెలిపారు. గతంలో అనేక సందర్భాల్లో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో వర్గీకరణ కోసం పెట్టిన సమావేశాలకు హాజరైన బీజేపీ నాయకులు ఓవైపు వర్గీకరణ బిల్లుకు మద్దతు ఇస్తున్నామని చెబుతూనే ఇప్పటివరకు పార్లమెంట్లో బిల్లు ప్రవేశ పెట్టకుండా మోసం చేస్తూ వస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్సీ వర్గీకరణ బిల్లు కోసం పోరాటం చేసేందుకు సిద్ధమయ్యారని, అందులో భాగంగా వచ్చే ఎన్నికల్లో తమ ఆగ్రహాన్ని బీజేపీ చవి చూడక తప్పదని హెచ్చరించారు. బీజేపీని ఓడించేందుకు ప్రణాళిక సిద్ధమైందని చెప్పారు. మరోవైపు రాష్ట్రంలోని అనాథలను ఆదుకుంటామని, అనాథల కోసం దేశం గర్వించే విధంగా ఒక పథకాన్ని రూపొందిస్తామని కేసీఆర్ ఇచ్చిన మాట ఏమైందని ప్రశ్నించారు. ఈ అసెంబ్లీ సమావేశాల్లో అయినా అనాథల కోసం ప్రత్యేక చట్టాన్ని రూపొందించి వారిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

ఏపీ సచివాలయ ఉద్యోగుల సెలవుల రద్దు

- బకాయిల వసూళ్ల కోసమంటూ విజయవాడలో ఉత్తర్వులు
- త్వరలో రాష్ట్రమంతా ఇదే విధానం?

అమరావతి : యూజర్ చార్జీల బకాయిలను వసూలు చేయాలని పేర్కొంటూ వార్డు సచివాలయాల్లో పనిచేసే పలువురు చిరుద్యోగుల సాధారణ సెలవులను ప్రభుత్వం రద్దు చేసింది. ఈ మేరకు విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో ఉత్తర్వులు జారీ అయ్యాయి.

ఆర్థిక సంవత్సరం చివర కావడంతో మార్చి 31లోగా నూరు శాతం బకాయిలను వసూళ్ళ చేయాలని, అప్పటి వరకు (59 రోజుల పాటు) అన్ని రకాల సెలవులను రద్దు చేస్తున్నట్లు ఉత్తర్వులలో పేర్కొన్నారు. నిర్దేశించిన లక్ష్యాలను సాధించని ఉద్యోగులపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామంటూ ఉత్వర్వుల్లో పేర్కొనడం చర్చనీయాంశంగా మారింది. అత్యవసరమైతే ఎగ్జిక్యూటివ్ అథారిటీ దృష్టికి తీసుకెళ్లి సెలవు తీసుకోవచ్చని ఉత్తర్వులలో పేర్కొన్నప్పటికీ అది అందరికీ సాధ్యం కాదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. రాష్ట్రంలోని దాదాపు అన్ని మున్సిపాల్టీలు, నగర పాలక సంస్థల్లో యూజర్ చార్జీల బకాయిలు పెద్ద ఎత్తున పేరుకుపోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా మార్చి నెలాఖరు వరకు ఇదే విధానాన్ని అమలు చేయనున్నారని సమాచారం. ఈ మేరకు ఎక్కడికక్కడ ఉత్తర్వులు జారీ కానున్నాయి. యూజర్ చార్జీలకు సంబంధించి మునిసిపల్‌శాఖ రాష్ట్ర స్థాయిలో గతనెల 18న సమీక్షా సమావేశం నిర్వహించింది. ఆ సమావేశంలోనే ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు చెబుతున్నారు. 2022-23 సంవత్సరానికి సంబంధించి ప్రతి వార్డు సచివాలయం పరిధిలోని ప్రాపర్టీ ట్యాక్స్, నీటి పన్ను, చెత్తవన్ను, వాటర్ మీటర్ యూజర్ చార్జీలతో పాటు ప్రొఫెషనల్ ట్యాక్స్‌లను నూరు శాతం వసూలు చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. తాజా ఉత్తర్వుల్లోనూ అదే విషయం పేర్కొన్నట్లు సమాచారం. వసూళ్లకు సంబంధించి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, వార్డు సచివాలయ అడ్మిన్ సెక్రటరీలు, ఇన్‌డోర్, ఔట్‌డోర్ సిబ్బంది, క్యాష్ కౌంటర్లలో పనిచేసే సిబ్బందికి విజయవాడలో సెలవులు రద్దు చేశారు. అవసరమైతే సచివాలయంలోని ఇతర సిబ్బందిని కూడా వసూళ్లకోసం వినియోగించుకునే అంశాన్ని పరిశీలిస్తున్నారు. ఏకంగా రెండు నెలల పాటు సెలవులు రద్దు చేయడమంటే చిరుద్యోగులను మానసికంగా వేధించడమే అవుతుందనే అభిప్రాయం ఉద్యోగ వర్గాల్లో వ్యక్తమవుతోంది.

యూజర్‌ఛార్జీల బకాయిల వివరాలు

మొత్తం అర్బన్ లోకల్ బాడీలు : 40
యూజర్ ఫీజు డిమాండ్ : రూ.263.27కోట్లు
వసూలైంది: 93.32కోట్లు
పర్సెంటీజీ: 33.32శాతం

క్వెట్టాలో భారీ పేలుడు... అనేక మందికి గాయాలు

ఇస్లామాబాద్ : ఇప్పటికే సంక్షోభంలో ఉన్న పాకిస్థాన్ ఉగ్రవాద దాడులతో తల్లడిల్లుతోంది. ఆదివారం బలూచిస్థాన్‌లోని క్వెట్టా నగరంలో అత్యంత కట్టుదిట్టమైన భద్రతగల ప్రాంతంలో భారీ బాంబు పేలుడు సంభవించింది. ఈ సంఘటనలో అనేకమంది గాయపడినట్లు పాకిస్థాన్ మీడియా తెలిపింది.

వీరిలో ఐదుగురు ప్రాణాపాయ స్థితిలో ఉన్నట్లు తెలుస్తోంది. క్వెట్టా పోలీస్ ప్రధాన కార్యాలయం సమీపంలోని క్వెట్టా కంటోన్మెంట్ ప్రవేశం (ఎఫ్‌సీ మూసా చెక్‌పాయింట్) వద్ద ఆదివారం ఉదయం భారీ బాంబు పేలుడు సంభవించిందని పాక్ మీడియా తెలిపింది. ఈ సంఘటనకు సంబంధించిన వీడియోను బలూచిస్థాన్ పోస్ట్ ట్వీట్ చేసింది.

పేలుడు జరిగిన వెంటనే పెద్ద ఎత్తున పొగ, ధూళి వ్యాపించినట్లు ఈ వీడియోలో కనిపిస్తోంది. హుటాహుటిన పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని, సహాయ కార్యకలాపాలు ప్రారంభించారు. సహాయ కార్యకలాపాల్లో పాల్గొంటున్న జీషన్ అహ్మద్ స్థానిక మీడియాతో మాట్లాడుతూ, క్షతగాత్రులను క్వెట్టాలోని సివిల్ ఆసుపత్రికి తరలించినట్లు చెప్పారు. పోలీసులు, అత్యవసర సమయాల్లో సేవలందించే బృందాలు చేరుకున్నాయని, సంఘటన స్థలాన్ని స్వాధీనంలోకి తీసుకున్నాయని చెప్పారు.

అధికారంలో ఎవరున్నా బాధితుల పక్షాన పోరాడతాం

ఏపీ ఎమ్మెల్సీలు విఠపు బాల సుబ్రహ్మణ్యం, కెఎస్.లక్ష్మణరావు

- పిడిఎఫ్ అభ్యర్థులకు మద్దతుగా ఒంగోలులో సంఘీభావ సభ



ఒంగోలు : అధికారంలో ఎవరు ఉన్నా బాధితుల పక్షాన నిలబడి పోరాడతామని, తాము ఏ ఒక్క వర్గం పక్షాన ఉండబోమని ఏపీ పిడిఎఫ్ ఎమ్మెల్సీలు విఠపు బాలసుబ్రహ్మణ్యం, కెఎస్.లక్ష్మణరావు అన్నారు. తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి మీగడ వెంకటేశ్వరరెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి బాబురెడ్డిలకు సంఘీభావంగా ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల, ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యాన ప్రకాశం జిల్లా ఒంగోలులోని అంబేద్కర్ భవన్‌లో ఆదివారం సభ జరిగింది. ఈ సభకు జిల్లా అభివృద్ధి వేదిక అధ్యక్షుడు టి.గోపాల్‌రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సదర్భంగా పిడిఎఫ్ ఎమ్మెల్సీల ఫ్లోర్ లీడర్ విఠపు బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.. రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థులను గెలవకుండా చేయాలని వివిధ పార్టీలు, అనేక శక్తులు శతవిధాలా ప్రయత్నాలు చేస్తున్నాయని తెలిపారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లు, పట్టభద్రులు, మేధావులు, నేతలంతా సంఘటితమై వారి కుట్రలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రకాశం జిల్లాను వెనుకబడిన జిల్లాల జాబితాలో చేర్చాలని, వెలుగొండ ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేయాలని, రామయపట్నం పోర్టును నిర్మించాలని, కనిగిరి నిమ్జ్ ఏర్పాటు చేయాలని, దొనకొండను పారిశ్రామికవాడగా అభివృద్ధి చేయాలని, జిల్లాలో ఫ్లోరిన్ సమస్యను పరిష్కరించాలని అనేక సందర్భాలలో మండలి లోపల, బయట పిడిఎఫ్ ఎమ్మెల్సీలు పోరాటాలు చేసినట్లు తెలిపారు. నేడు రాష్ట్రంలో భావ ప్రకటన స్వేచ్ఛను హరించేలా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాలన ఉందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం లాభాలలో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను సైతం అమ్మేందుకు అడుగులు వేస్తోందన్నారు. ఈ నేపథ్యంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, ప్రజా సమస్యలపై పోరాడేందుకు పిడిఎఫ్ ఎమ్మెల్సీలను గెలుపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్-ఎస్.ప్రసాద్, రాష్ట్ర నాయకులు కొమ్మోజి శ్రీనివాసరావు, యుటిఎఫ్ బాపట్ల జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.శ్రీనివాసరావు, ప్రకాశం జిల్లా అధ్యక్షులు ఒ.వి.వీరారెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎస్.రవి, ఎస్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి బిసిహెచ్.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

చైనా బెలూన్‌ను కూల్చేసిన అమెరికా



వాషింగ్టన్, బీజింగ్ : పొరపాటున అమెరికా గగనతలంలోకి ప్రవేశించిన చైనాకు చెందిన వాతావరణ పరిశోధన బెలూన్‌ను యుద్ధ విమానంతో అమెరికా కూల్చివేసింది. అమెరికా చర్యను చైనా 'ఓవర్ రియాక్షన్' (అతి స్పందన)గా అభివర్ణించింది. తమ దేశంలో వాతావరణ పరిశోధనలకోసం ప్రయోగించిన మానవ రహిత బెలూన్ పొరపాటున అమెరికా గగన తలంలోకి ప్రవేశించిన విషయాన్ని ముందుగానే తెలియచేశామని, అయినా కూల్చివేయడంతో అమెరికాపై తగిన చర్యలు తీసుకునే హక్కు తమకుందని పేర్కొంది. దోమపై ఫిరంగితో దాడిచేయడంగా చైనా సైనిక నిపుణులు ఈ చర్యను పేర్కొన్నారు. మరోవైపు అమెరికా తన చర్యను సమర్థించుకుంది. బెలూన్‌ను చైనా గూఢాచర్యానికి వాడుతోందని అమెరికా ఆరోపించింది. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ మాట్లాడుతూ ' బెలూన్ గురించి సమాచారం తెలియగానే వీలైనంత త్వరగా కూల్చివేయాలని ఆదేశించాను. దాని శకలాల కారణంగా భూమిపై నష్టం జరుగుతుందేమోనని వేచిచూశారు. అది భూభాగం దాటి సముద్రంపైకి వెళ్లిన వెంటనే అమెరికా ప్రాదేశిక జలాల పరిధిలోనే కూల్చివేయాలని నిర్ణయించారు. దాన్ని విజయవంతంగా అమలు చేసిన మా ఏవియేటర్లను అభినందిస్తున్నాను' అని అన్నారు. బెలూన్ దక్షిణ కరోలినా తీరంలో అట్లాంటిక్ మహాసముద్రంలో కూలిపోయిందని స్థానిక మీడియా నివేదించింది. అంతర్జాతీయ సైనిక నిపుణులు కూడా అమెరికా చర్యను తప్పుపడుతున్నారు. పరిశోధనలకు, సైనిక చర్యలకు మధ్య తేడానే గుర్తించలేని స్థితిలో అమెరికా ఉందా? అని నిపుణులు ప్రశ్నించారు. రాజకీయ బల ప్రదర్శనగానే వారు దీనిని భావిస్తున్నారు.

విండ్‌పాల్ ప్రాఫిట్ ట్యాక్స్‌ను పెంచిన కేంద్రం



న్యూఢిల్లీ : దేశీయంగా ఉత్పత్తి చేసే ముడిచమురుపై విధించే విండ్‌ఫాల్ ప్రాఫిట్ ట్యాక్స్‌ను కేంద్ర ప్రభుత్వం పెంచింది. అలాగే డీజిల్, విమాన ఇంధనం (ఎటిఎఫ్) ఎగుమతులపై విధించే పన్నునూ కేంద్రం పెంచింది. అంతర్జాతీయ చమురు ధరలకు అనుగుణంగా వీటిని పెంచినట్లు కేంద్రం తెలిపింది. పెంచిన ఈ పన్నులు ఈ నెల 4 నుంచే అమల్లోకి వచ్చాయి. ఓఎన్‌జిసి వంటి సంస్థలు ఉత్పత్తి చేసే ముడిచమురుపై టన్నుకు రూ. 1,900గా ఉన్న విండ్‌ఫాల్ ప్రాఫిట్ ట్యాక్స్‌ను ఒక్కసారిగా రూ.5,050కు కేంద్రం పెంచింది. భూగర్భ, సముద్ర గర్భాల నుంచి సేకరించే ముడి చమురు నుంచి పెట్రోల్, డీజిల్, ఎటిఎఫ్ వంటి ఇంధనాలుగా మారుస్తారు. అలాగే ఎగుమతి చేసే డీజిల్‌పై లీటరుకు రూ.5గా ఉన్న పన్నును రూ. 7.5కు ప్రభుత్వం పెంచింది. ఎటిఎఫ్‌పై లీటరుకు రూ. 3.5గా ఉన్న పన్నును రూ 6కు కేంద్రం పెంచింది. ఈ పెంపుతో పన్నులు గరిష్ట స్థాయికి చేరాయి. విండ్‌పాల్ ప్రాఫిట్ ట్యాక్స్‌ను భారత్‌మొదటిసారిగా జులై 1న విధించింది.

సామూహిక లైంగికదాడి కేసులో అండమాన్ మాజీ ప్రధాన కార్యదర్శిపై చార్జిషీట్



పోర్ట్‌బ్లెయిర్ : సామూహిక లైంగికదాడి కేసులో అండమాన్ నికోబార్ మాజీ ప్రధాన కార్యదర్శి జితేంద్ర నారైన్‌తో పాటు మరో ముగ్గురిపై ప్రత్యేక దర్యాప్తు బృందం 935 పేజీల చార్జిషీట్ దాఖలు చేసింది. ఈ కేసు దర్యాప్తు కోసం మాజీ ఐపీఎస్ నేతృత్వంలో ఐదుగురు సభ్యులతో కూడిన దర్యాప్తు ఈ బృందాన్ని అండమాన్ నికోబార్ పోలీసులు ఏర్పాటు చేశారు. 90 మంది సాక్ష్యులు, వివిధ ఎలక్ట్రానిక్, టెక్నికల్, బయోలాజికల్ ఆధారాల ద్వారా ఈ చార్జిషీట్‌ను రూపొందించినట్టు పోలీసులు తెలిపారు. గత ఏడాది ఏప్రిల్, మేల్లో అప్పటి ప్రధాన కార్యదర్శి నివాసంలో తనపై రెండుసార్లు సామూహిక లైంగికదాడి జరిగిందని ఒక మహిళ చేసిన ఫిర్యాదు మేరకు ఈ కేసు నమోదయింది. హైకోర్టు ఆదేశాలతో గత ఏడాది అక్టోబర్ 10న ఈ కేసును నమోదుచేశారు. గత నవంబర్ 15న జితేంద్రను పోలీసులు అరెస్టు చేశారు.

ఏపీలో కానిస్టేబుల్ పరీక్షాఫలితాలు విడుదల

అమరావతి : ఏపీ రాష్ట్ర వ్యాప్తంగా గత నెల 22న పోలీసు నియమకాల కోసం నిర్వహించిన పరీక్షల ఫలితాలను స్టేట్ లెవల్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ ఆదివారం విడుదల చేసింది. మొత్తం 4,59,182 మంది అభ్యర్థులు పరీక్షలు రాయగా వారిలో 95,208 మంది ఉత్తీర్ణులైనట్టు బోర్డు వెల్లడించింది. క్వాలిఫై అయిన వారిలో పురుషులు 77,876మంది, మహిళలు 17,332 మంది వున్నారు. క్వాలిఫై అయిన అభ్యర్థులకు స్టేజ్ టు ఆన్ లైన్ అప్లికేషన్ దరఖాస్తును ఈ నెల 13వ తేదీ సాయంత్రంలోపు సమర్పించాల్సిఉంటుంది. అవసరమైనవారు 9441450639, 9100203323కు లేదా slprb.ap.gov.in మెయిల్‌లో సంప్రదించవచ్చని అధికారులు తెలిపారు.

కొండచరియలు విరిగిపడటంతో కూలిన వంతెన...

సిమ్లా : హిమాచల్ ప్రదేశ్ లూనా ప్రాంతంలో జాతీయ రహదారి 154ఎ మార్గంలోని వంతెనపై ఆదివారం కొండచరియలు విరిగిపడ్డాయి. దీంతో, బ్రిడ్జి పూర్తిగా కూలిపోయింది. చంబా-భర్మౌర్ జాతీయ రహదారికి ఇరువైపులా భారీ సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. చంబా జిల్లా ఎమర్జెన్సీ ఆపరేషన్ సెంటర్ అధికారులు సంఘటనా స్థలానికి వెళ్లారు. కొండచరియలు విరిగిపడటంతో 20 మీటర్ల పొడవైన బ్రిడ్జి కూలిందని చంబా డిప్యూటీ కమిషనర్ తెలిపారు. ఒక కారు, లారీ లోయలో పడినట్లు చెప్పారు. వంతెన కూలడంతో జాతీయ రహదారి కనెక్టివిటీ పూర్తిగా దెబ్బతిన్నదని వెల్లడించారు. ఈ సంఘటనకు సంబంధించిన వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరలైంది.

భారత్-బ్రిటన్ సంబంధాలపై రిషి ప్రత్యేక శ్రద్ధ!

లండన్: భారత్‌తో బ్రిటన్ సంబంధాలపై ఆ దేశ ప్రధాని రిషి సునాక్ ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. వాణిజ్యం, రక్షణ వంటి రంగాల్లో ఇరు దేశాల వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత వృద్ధి చేయడానికి తమ ప్రభుత్వం నుంచి పూర్తి మద్దతు ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ విషయాన్ని లండన్‌లో భారత హైకమిషన్ ట్వీట్ చేసింది. ఈ ట్వీట్ ప్రకారం.. ఇటీవల అమెరికా పర్యటనలో పాల్గొన్న భారత జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ స్వదేశానికి తిరిగివస్తూ లండన్ పర్యటనకు వెళ్లారు. ఈ పర్యటనలో భాగంగా ఇంగ్లండ్ జాతీయ భద్రత సలహాదారు టిమ్ బారోతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో రిషి సునాక్ కొద్ది సేపు పాల్గొన్నారు. భారత్‌తో ద్వైపాక్షిక సంబంధాల వృద్ధికి తమ ప్రభుత్వం పూర్తి మద్దతు ఇస్తుందని అజిత్ దోవల్‌కు హామీ ఇచ్చారు.